
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 133

శనివారం 3-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



Lalithaa

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

Up to Aug 31.

బంగారు నగలపై తరుగులో 1% తగ్గింపు

వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.2000 తగ్గింపు

రూ.~~46000~~ రూ.44000 నుంచి!

# వజ్రాలకు అధిక ధర చెల్లించకండి!

## లలితా జ్యువెల్లరిలో ధరలు పోల్చి కొనండి.

తరచూ కొనే కూరగాయలు, కిరాణా సరుకుల ధరలను కూడా పలు దుకాణాల్లో పోల్చి కొంటాం. అలాంటప్పుడు, ఎప్పుడో ఓసారి విలువైన వజ్రాభరణాలను కొనేటప్పుడు ఎంత జాగ్రత్త వహించాలి?.. ఎందుకు చెబుతున్నానంటే, కష్టపడి సంపాదించిన డబ్బుకు సంపూర్ణ విలువను మీరు పొందాలని మనసారా కోరుకుంటున్నా.

దీన్ని నిశితంగా చదవండి.

ఉదాహరణకు 80.24 గ్రాములున్న ఓ వజ్రాభరణం ధర ఎంతో లెక్కగడుదాం. (వివరణకు మాత్రమే)

బరువు గణాంకాలు:
బంగారం 78.164 గ్రాములు + వజ్రం 10.38 క్యారెట్
(200 మిల్లీ గ్రాములు = 1 క్యారెట్)

ధర గణాంకాలు:
బంగారం : 78.164 గ్రాములు × రూ.2,700 / గ్రాము +
వజ్రం : 10.38 క్యారెట్ × రూ.60,000 / క్యారెట్
మార్కెట్‌లో వజ్రపు సరాసరి ధర - క్యారెట్‌కు రూ.60,000; 18K బంగారం ధర - రూ.2,700 / గ్రాము

పొరబాటున కానీ లేదా 'ఇతర కారణం' వల్ల కానీ నగలోని వజ్రం బరువును 10.38కి బదులుగా 11.38 క్యారెట్ అని లెక్కగడితే? రూ.540 (18K బంగారపు 200 మిల్లీగ్రాముల ధర) అని లెక్కగట్టేందుకు బదులుగా రూ.60,000 అని లెక్కగడితే?.. ఏంటి పరిస్థితి! ఆలోచిస్తేనే భయమేస్తోంది కదూ. అందుకే ఒకటికి పదిసార్లు చెక్ చేసి కొనండి. వజ్రాల ధరపై దృష్టి పెట్టండి. కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ మొత్తం ధరలో పెనుభారాన్ని ఏర్పరుస్తుంది.

## నాణ్యతను నిర్ధారించేందుకు 3 విషయాలు :

- ఆథెంటిసిటి (నాణ్యత నిర్ధారణ) సర్టిఫికెట్ - షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను నమ్మకండి. ఎందుకంటే, తమ వస్తువు నాణ్యతలేనిదని ఎవరైనా చెబుతారా? గుర్తింపు పొందిన మూడోవ్యక్తి (సంస్థ) ఇచ్చే నాణ్యత సర్టిఫికెట్ కావాలని అడగండి. (లలితా జ్యువెల్లరిలో ప్రతి వజ్రాభరణం అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జెమ్మాలజీ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ పొందినవే)
- కలర్ & క్లారిటి : మీరు కొనే వజ్రాభరణాలకు E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటి ఉన్నాయా అని సరిచూసుకోండి. తక్కువ ధరకు లభిస్తున్నాయనే కారణం వల్ల G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు.
- ఎక్స్ఛేంజ్ పాలసి : వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్; నగదుగా, బంగారు నగలుగా అయితే 85% బైబ్యాక్ ఉండాలి. (ఎక్స్ఛేంజ్ చేసుకునే రోజు నాటి మా వజ్రపు ధర ప్రకారం)

అతిపెద్ద వెసులుబాటు: పైన ప్రస్తావించిన క్యారెట్‌కు రూ.60,000 అనే ధర మార్కెట్ సరాసరిగా విక్రయించే వజ్రపు ధర. దీన్ని మీకోసం లలితా జ్యువెల్లరిలో రూ.44,000కు అందిస్తున్నాం.



శ్రావణ సంబరాలు!
Jul 27 - Aug 31

క్యారెట్‌కు రూ.2000 తగ్గింపు

రూ.~~46000~~
రూ.44000 నుంచి!

V.A. గ్రాముకు రూ.975 మాత్రమే

| వజ్రపు వ్యాసం (సెంట్లలో) | మార్కెట్లో వజ్రపు ధర క్యారెట్‌కి | లలితా జ్యువెల్లరిలో వజ్రపు ధర క్యారెట్‌కి |
|---|---|---|
| 0 నుంచి 0.0749 | రూ.60000 నుంచి 76000 | రూ.44000 |
| 0.0750 నుంచి 0.1349 | రూ.76000 నుంచి 85000 | రూ.64500 |
| 0.1350 నుంచి 0.1749 | రూ.98500 నుంచి 105000 | రూ.81000 |
| 0.1750 నుంచి 0.2249 | రూ.108500 నుంచి 112000 | రూ.92000 |

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

ఈటీవీలో డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ఇంటర్వ్యూను దయచేసి యువత తప్పకుండా చూడండి. మీ గెలుపునకు ఉపయోగపడే సమాచారం ఇందులో ఉంది!
డబ్బు ఆదా చేయడంపై మీకు మరింత అవగాహన పెరుగుతుంది. కొందరు పన్నుతున్న మాయ వల నుంచి తప్పించుకోగలరు.
https://youtu.be/dZBs8zfUsjQ

Scan the QR code

మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లు.

హైదరాబాద్
సోమాజిగూడ • కూకట్‌పల్లి

విజయవాడ • విశాఖపట్నం • రాజమహేంద్రవరం • తిరుపతి
చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి
పుదుచ్చేరి • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • కుంభకోణం
బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు

Lalithaa
లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

Lalithaa

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

లక్షలాది డిజైన్లు!

శ్రావణ సంబరాలు! Jul 27 - Aug 31.

# బంగారు నగలపై తరుగులో 1% తగ్గింపు

**ఆగస్టు 31 వరకు. త్వరపడండి! సరికొత్త డిజైన్లు!**

ఎన్నో ప్రత్యేకతలు కలిగిన శ్రావణ మాసంలో మీ ఇంట బంగారు సిరులపంట పండాలన్నదే నా ఆశ. అందుకే మా అత్యంత తక్కువ తరుగు నుంచి ఇంకా **1%** తరుగు తగ్గించాం. మీరు కష్టపడి సంపాదించిన డబ్బుకు ఇంకా ఎక్కువ గ్రాముల బంగారాన్ని పొందవచ్చు. ఇది మా వద్ద ఉన్న విస్తృతశ్రేణి నగలకు వర్తిస్తుంది.

నేను ఎప్పుడూ చెప్పేవిధంగా దయచేసి మా ధరలను నాలుగైదు షోరూంలలో పోల్చిచూడండి. ఎక్కడ ధర తక్కువగా ఉంటే అక్కడే నగలు కొనండి.






'గ్రాముకు రూ.50 తగ్గింపు', 'ఉచిత బహుమతి' వంటివాటి కన్నా మా అతి తక్కువ తరుగు మీ డబ్బుకు అదనపు విలువను చేకూర్చుతుంది.

## చాలా వరకు వెండి వస్తువులకు మజూరి లేదు!



## లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

www.lalithaajewellery.com

నగలు కొనడం ఎలా?..
అన్న విషయంపై
రూపొందించిన పుస్తకం మా షోరూంలో
ఉచితంగా లభ్యమవుతుంది.

హైదరాబాద్ - సోమాజిగూడ: 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా. ఫోన్: 040 - 6748 6677.

కూకట్‌పల్లి : 2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం. ఫోన్: 040 - 2384 2277 / 2200 / 2299.

విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటెరింగ్ కాలేజ్ ఎదురుగా. ఫోన్: 0866-2481133.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

రాజమహేంద్రవరం : 20-25-3, కోరుకొండ రోడ్, కంబాల చెరువు, మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర, దేవిచౌక్ సమీపంలో. ఫోన్: 0883-2020300.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్‌రోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 133

శనివారం 3-8-2019




**జర్నలిస్ట్ రవీశ్‌కు మెగసెసె..**

మరో ముగ్గురికి కూడా అవార్డు ప్రకటించిన ఫౌండేషన్ -5లో



**నేడు తొలి టి20 మ్యాచ్**

లాడర్‌హిల్‌లో వెస్టిండీస్‌తో తలపడనున్న భారత్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



## 6 నుంచి అయోధ్య విచారణ

రాజకీయంగా సున్నితమైన అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదానికి మధ్యవర్తిత్వం పరిష్కారం చూపనందున ఇక ఈ కేసును తామే ప్రతి రోజూ విచారిస్తామని సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ఆగస్టు 6 నుంచి ప్రారంభించి విచారణను రోజూ బహిరంగంగా చేపడతామంది.

వివరాలు 5లో



## కశ్మీర్.. హై అలర్ట్!

కశ్మీర్ లోయలో భద్రతాబలగాల పెంపుపై ఊహాగానాలు కొనసాగుతుండగానే.. అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాత్రపై పాక్ ఉగ్రదాడికి పాల్పడే అవకాశముందనే నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రికులు, ఇతర పర్యాటకులు తక్షణమే తమ పర్యటనను ముగించుకుని వెనక్కు వెళ్లాలని ఆదేశించింది.

వివరాలు 5లో

# చిందేసిన చినుకు..

## రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఎడతెరిపిలేని వర్షాలు

- వ్యవసాయ పనుల వేగం పెంచిన అన్నదాత
- భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్‌లో అత్యధికంగా 22 సెం.మీ. వర్షం
- ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో చాలాచోట్ల స్తంభించిన జనజీవనం
- ఖమ్మం జిల్లాలో పొంగుతున్న వాగులు.. భద్రాచలంలో హై అలర్ట్
- నేడు పలు చోట్ల భారీ వర్షాలు..
- మళ్లీ 5,6 తేదీల్లో భారీ వర్షాలకు అవకాశం



శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండు బ్రిడ్జిలను తాకుతూ ప్రవహిస్తున్న జంపన్నవాగు



భూపాలపల్లి జిల్లాలో నిండుకుండలా అన్నారం బ్యారేజీ

సాక్షి, హైదరాబాద్

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రం తడిసిముద్దయింది. చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండగా.. కొన్నిచోట్ల పూర్తిగా ముసురు నెలకొని ఉంది. హైదరాబాద్‌లో శుక్రవారం రోజంతా కూడా వర్షం పడుతూనే ఉంది. చాన్నాళ్ల తర్వాత ఇప్పుడు ముసురులో రాష్ట్రం తడిసింది. దీంతో వర్షపునీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు మరింత పెరుగుతాయని వాతావరణశాఖ వర్గాలు అంటున్నాయి. ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావాలతో నైరుతి రుతుపవనాలు మరింత ఊపందుకున్నాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. దీంతో రాష్ట్రంలో అనేకచోట్ల కుండపోత నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్‌లో 22 సెంటీమీటర్ల కుండపోత వర్షం కురిసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే జిల్లా వెంకటాపురంలో 18 సెంటీమీటర్లు, గోవిందరావుపేట, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లిలలో 14 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. పరకాల, భద్రాచలంలలో 12 సెంటీమీటర్లు, సత్తుపల్లి, బూర్గంపాడు, ఏటూరు నాగారం, మొగుళ్లపల్లిలలో 11 సెంటీమీటర్లు, పినపాక, శాయంపేట, భూపాలపల్లిలలో 10 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. సాధారణంగా కంటే

మిగతా 2వ పేజీలో ▶

## కృష్ణమ్మ పరవళ్లు

- జూరాల, శ్రీశైలంలోకి పోటెత్తుతున్న కృష్ణమ్మ.. ఏకంగా 2 లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహాలు రాక
- 60 టీఎంసీలకు శ్రీశైలం నిల్వ.. రెండ్రోజుల్లోనే 29 టీఎంసీలు చేరిక
- వరద ఇలాగే కొనసాగితే.. మరో 10 రోజుల్లో శ్రీశైలం నిండటం ఖాయం
- గోదావరిలోనూ వరద ఉధృతి.. 10 టీఎంసీలకు చేరిన ఎల్లంపల్లి నిల్వ
- వారంలో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోతలు షురూ

వివరాలు 2లో

# ఇకపై సొంతంగా నిధులు

- ప్రాజెక్టులు, పథకాల అమలుకు ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం వైఖరిపై తీవ్ర అసంతృప్తిలో రాష్ట్రం

సాక్షి ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

మాటలు కోటలు దాటుతాయిగానీ చేతలు గడప కూడా దాటవన్నట్లుంది రాష్ట్రంపట్ల కేంద్రం వైఖరి. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు ఈ దేశానికే ఆదర్శమని నీతి ఆయోగ్ ప్రశంసలు కురిపించినా కేంద్రం మాత్రం వీటికి పైసా విదల్చడం లేదు. పురోగతిలో ఉన్న ఈ ప్రాజెక్టు, పథకాల అమలుకు కేంద్ర సాయం కోసం ఎదురుచూసి విసుగెత్తిన రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిధులు సమకూర్చుకునేందుకు దృష్టి సారించింది. ఆ దిశగా అవసరమైన వనరులను గుర్తించే పనిలో పడింది. కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించిన మిషన్ భగీరథకు తగిన ఆర్థిక సహాయం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెడుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రం కోరినట్లుగా తగినన్ని నిధులు కేటాయిస్తే మిగతా ప్రాజెక్టులకు ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కాదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి మరో రూ.30 వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.15 వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.10 వేల కోట్లు అవసరం అవుతాయి. పాలమూరు ఎత్తిపోతల పథకానికి అయ్యే ఖర్చు దీనికి అదనం. వీటితో పాటు చిన్నా చితక ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు అవసరం. ప్రాజెక్టులు, పథకాల అమలుతో పాటు మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలన పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంస్థల నుంచి పెద్ద ఎత్తున రుణం పొందింది. దీంతో మళ్లీ రుణానికి వెళ్లడం కంటే సొంతంగా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటే బాగుంటుందన్న ఆలోచనలో ఉంది.

**భూముల వేలం ద్వారా రూ.10 వేల కోట్లు!**

ఈ ఏడాది ప్రాజెక్టులు, ఇతరత్రా పనులు చేపట్టడానికి అవసరమైన రూ.10 వేల కోట్లను భూములను వేలం వేయడం ద్వారా మిగతా 2వ పేజీలో ▶



## దేవదాస్ కనకాల ఇకలేరు

- అనారోగ్యంతో కిమ్స్‌లో చేరిక.. చికిత్స పొందుతూ కన్నుమూత
- హైదరాబాద్‌లో యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పిన దేవదాస్
- రజనీకాంత్, చిరంజీవి, రాజేంద్రప్రసాద్ వంటి నటులు ఆయన శిష్యులే
- ఆయన మృతిపై సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల సంతాపం

వివరాలు 4లో

## 'జుట్టు'కో బ్యాంక్..

హెయిర్ బ్యాంకు.. ఈ బ్యాంకు పేరెప్పుడూ వినలేదు కదూ.. మామూలు బ్యాంకులేం చేస్తాయి.. మా దగ్గర మీ డబ్బులు దాచుకోండి.. భవిష్యత్తులో అవి ఎన్నో రెట్లు పెరిగి మీకు ఉపయోగపడతాయి అంటాయి.. అంతేగా.. ఈ హెయిర్ బ్యాంకు కూడా డిటోనే. కాకపోతే.. మామూలు బ్యాంకుల్లో డబ్బులు దాస్తాం.. ఇక్కడ మన జుట్టు దాస్తాం.. అంతే.. తేడా.. మిగతాదంతా సేమ్ టుసేమ్..



14లో

# ఆపరేషన్లు ఆగిపోయాయ్!

## ప్రభుత్వ వైద్యంపై జూడాల సమ్మె ప్రభావం

- ఉస్మానియా, నిమ్స్, గాంధీ, నిలోఫర్‌లో తీవ్ర సమస్యలు
- ఆందోళనలో రోగులు.. ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు
- వర్షంతో తగ్గిన ఓపీ.. ఎమర్జెన్సీ, ఇన్‌పేషెంట్లకు అందని వైద్యం

**సాక్షి, సిటీబ్యూరో:** జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు నిరసనగా వైద్యులు చేపట్టిన ఆందోళన శుక్రవారం కూడా కొనసాగింది. 3 రోజుల క్రితం ఓపీ సేవలు ఆపేసిన ఆందోళన చేపట్టిన వైద్యులు గురువారం మధ్యాహ్నం నుంచి అత్యవసర వైద్యసేవలను కూడా బహిష్కరించిన విషయం తెలిసిందే. జ్వరం, దగ్గు, జలుబు తదితర సాధారణ సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రి ఓపీకి చేరుకున్న ఔట్ పేషెంట్లకే కాకుండా వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఉస్మానియా, గాంధీ, నిమ్స్ అత్యవసర విభాగాలకు చేరుకున్న రోగులు కూడా సకాలంలో వైద్యసేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు

మిగతా 4వ పేజీలో ▶




శుక్రవారం గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్ చదివింది... గెలిపించండి

13 కూపన్

SPEEDY GOLD LOAN

మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం

040-30915112

SCUF GOLD to 54999

MISSED CALL 044-30123479

SHRIRAM City

MONEY WHEN YOU NEED IT MOST

Vencobb CHICKEN

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 44 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 155 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 107 కిలో | స్కిన్‌లెస్ | 177 కిలో |

Conditions Apply


ఇదండీ సంగతి



.. తర్వాత రాజీనామా చేయనని బాండ్ పేపర్స్ మీద సంతకాలు తీసుకుందాం సార్!


Raymond




## ఒక రేమండ్ ఫ్రాంచైజ్ ప్రారంభించండి. ఒక విజయ వృత్తాంతం ప్రారంభించండి.

పురుషుల లైఫ్‌స్టైల్ విషయంలో 9 దశాబ్దాల కన్నా అధికమైన నైపుణ్యంతో రేమండ్, ఫ్యాషన్ కన్నా ఎంతో ఎక్కువ. వినియోగదారులతో మా సంబంధం వారి ఇన్-స్టోర్ అనుభవాన్ని మించినదని మా నమ్మకం కనుకనే మేం వారి జీవితాలలో ఒక భాగం అయ్యాం. **గత 2 సంవత్సరాలలో 300 కొత్త స్టోర్స్ తెరవబడ్డాయి.** ఒక రేమండ్ షాప్ ఫ్రాంచైజ్‌ని మీ సొంతం చేసుకొని రేమండ్ కుటుంబంతో కలిసి ఈ అద్భుతమైన యాత్రలో పాల్గొనేందుకు ఇది ఒక అవకాశం.

ఫ్రాంచైజీ అయ్యేందుకు ముందుగా కావలసినవి

- ప్రధానమైన మార్కెట్లో, గ్రౌండ్ ఫ్లోర్‌లో 600 చె.అ. నుంచి 1200 చె.అ. ల షాప్ (సొంతది, అద్దెకు తీసుకున్నది లేదా లీజ్ చేయబడినది)
- కనీసం 15 అ. ఫ్రంటేజ్
- రూ. 50* లక్షలు లేదా అంతకన్నా ఎక్కువ పెట్టుబడి

Raymond

మీ ప్రతిపాదనని మాకు franchisee.admin@raymond.in కి పంపించండి లేదా మాతో 88799 00993 పై సంప్రదించండి. సోమవారం నుండి శుక్రవారం: ఉ 9.30 – సా 6.30

*స్థలం కొలతలు ఇంకా ఆకృతిని బట్టి సుమారు ఖరీదు మారవచ్చు.

## 5 నుంచి ఎస్‌జీటీ నియామకాల కౌన్సెలింగ్
### తెలుగు మినహా మిగతా కేటగిరీల్లో పోస్టింగ్‌లు ఇచ్చేలా చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా తెలుగు మినహా ఇతర భాషల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కౌన్సెలింగ్ నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్ డీఈవోలను ఆదేశించారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ ప్రక్రియ చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హిందీ, కన్నడ, మరాఠీ, బెంగాళీ, ఉర్దూ, తమిళ భాషలకు చెందిన ఎస్‌జీటీలకు (720 పోస్టులు) పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

**కౌన్సెలింగ్ షెడ్యూలు..**

**ఈ నెల 5న:** ఎంపికైన అభ్యర్థులు జాబితా ప్రకటన, నోటీసు బోర్డు, జిల్లా వెబ్‌సైట్‌లలో ప్రదర్శన.
**6వ తేదీన:** ఖాళీల ప్రకటన, మీడియం వారీగా, కేటగిరీ వారీగా వివరాల వెల్లడి. అదే రోజు డీఈవోల నేతృత్వంలో అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లపరిశీలన.
**8వ తేదీన:** కౌన్సెలింగ్ నిర్వహణ, పోస్టింగ్‌లు ఇవ్వడం.
**9వ తేదీన:** నియమితులైన స్కూళ్లలో ఆయా టీచర్లు చేరడం.

## 5న ఎక్సైజ్ ఎస్‌ఐ అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 5న ఫిజికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టెస్టులు ఈనెల 5న ఉదయం 9 గంటలకు ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని మెడికల్ రికార్డు డిపార్టుమెంట్ రూం నెంబర్ 507లో ( ఓల్డ్ బిల్డింగ్) ఉంటాయని పేర్కొంది. ఈ ఫిజికల్ టెస్టులకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒకటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించింది. అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి ప్రొఫార్మా డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొంది. రూ. 600 మెడికల్ బోర్డు ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుందని, ఈ టెస్టులకు మళ్లీ తేదీల పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది. మరిన్ని వివరాలకు తమ వెబ్‌సైట్ **www.tspsc.gov. in** పై సంప్రదించాలని తెలిపింది.

## 10న సీపీసీఆర్ ఇంటర్వ్యూలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీఎస్‌సీపీసీఆర్) అధ్యక్ష, సభ్యుల నియామకాలకు సంబంధించి గతేడాది ఆగస్టు 24న ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలక కార్యాలయంలో ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించింది. అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకోలేని వారు ఈ నెల 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు **wdcw.tg.nic.in** వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపింది.

## ఇంజనీరింగ్ ప్రవేశాల గడువు పొడిగింపు

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్ చివరి దశ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 3 (శనివారం) వరకు కాలేజీల్లో చేరవచ్చని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని పేర్కొన్నారు.

## 5, 6 తేదీల్లో క్రీడాకారుల దేహదారుఢ్య పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** క్రీడా అకాడమీలో భర్తీకి సంబంధించి ఈ నెల 5, 6 తేదీల్లో క్రీడాకారులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో 20 క్రీడా అకాడమీల్లో ఖాళీల భర్తీ కోసం ఇది వరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఇప్పటికే ఆయా అభ్యర్థులకు వారి సెల్‌ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ పంపినట్లు తెలిపారు. వివరాలకు **www.tswreis.in** వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

## ఫలితాల కోసం టీఆర్టీ హిందీ అభ్యర్థుల నిరీక్షణ

**సాక్షి, హైదరాబాద్:** టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) హిందీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్ ఫలితాలు వెంటనే విడుదల చేయాలని అభ్యర్థులు శుక్రవారం ప్రభుత్వానికి విన్నవించారు. ఏడాదిన్నర క్రితం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసినా ఇప్పటి వరకు ఫలితాలు ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో టీఎస్‌పీఎస్సీ, విద్యాశాఖ అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఫలితాల ఆలస్యంతో ఉద్యోగ సర్వీసులో తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ప్రస్తుతం టీఆర్టీకి సంబంధించిన మిగతా సబ్జెక్టుల ఫలితాలు 1:1 నిష్పత్తిలో ప్రకటించారని, హిందీ సబ్జెక్టు ఫలితాలు మాత్రం ప్రకటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై తక్షణమే సీఎం కేసీఆర్ చొరవ చూపి తమకు న్యాయం చేస్తారని ఆశతో ఉన్నామని తెలిపారు.

## కృష్ణా, గోదావరి బోర్డుల భేటీ 9కి వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 6న జరగాల్సిన కృష్ణా, గోదావరి బోర్డుల భేటీ 9వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు శుక్రవారం బోర్డు సమాచారం పంపింది. ఇప్పుడిప్పుడే శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వస్తుండటం, ఈ నెల 9 నాటికి చెప్పుకోదగ్గ నిల్వలు చేరితే అప్పుడు పంపకాలు చేయడం సులభమవుతుందన్న భావనతో భేటీ వాయిదా వేసినట్లు తెలిసింది.

## కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వండి


కొత్త ప్రభాకర్‌రెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణకు జీవరేఖలుగా నిలుస్తున్న కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను జాతీయ ప్రాజెక్టులుగా ప్రకటించాలని టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. డ్యామ్ సేఫ్టీ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని 29 పాత డ్యామ్‌ల పునరుజ్జీవానికి వీలుగా రూ.645 కోట్ల మేర ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం 2017 సెప్టెంబర్‌లో కేంద్ర జల సంఘానికి పంపిందని గుర్తుచేశారు. వాటిని సీడబ్ల్యూసీ ప్రపంచ బ్యాంకుకు పంపిందని, ఇంకా నిధులు రాలేదని తెలిపారు. నీరు రాష్ట్ర జాబితాలోని అంశమైనందున తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

## వారిని ఐటీ నుంచి మినహాయించాలి


బండ ప్రకాశ్

**సాక్షి, న్యూఢిల్లీ:** సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను(ఐటీ) నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఆర్‌ఎస్ ఎంపీ బండ ప్రకాశ్ కేంద్రాన్ని కోరారు. వేతన బిల్లుపై శుక్రవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులపై జరిమానాలు విధించడం సరికాదని పేర్కొన్నారు. ఒకే రకమైన పనిచేసే వారికి లింగ వివక్ష లేకుండా వేతనాలు ఇవ్వాలని ప్రతిపాదించడం ప్రశంసనీయమన్నారు.

## దివ్యసాకేతాలయంలో కర్ణాటక సీఎం పూజలు
### చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్న యడియూరప్ప



**శంషాబాద్ రూరల్:** కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప శంషాబాద్‌లో ని దివ్యసాకేతాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమీపంలోని శ్రీరామనగరంలో ఉన్న శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమానికి గురువారం ఆయన వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం రాత్రి అక్కడే బస చేసిన ఆయన శుక్రవారం తెల్లవారుజామున దివ్యసాకేతాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. ఇక్కడ చేపడుతున్న సమతా స్ఫూర్తి కేంద్రం, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు 15 రోజుల తర్వాత మరోసారి ఇక్కడికి వస్తానని యడియూరప్ప చెప్పారు. ఆయన వెంట మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు ఉన్నారు. అనంతరం ఆయన శంషాబాద్ విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి బెంగళూరు బయలుదేరారు.


కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద 9 మీటర్ల ఎత్తులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


ములుగు జిల్లాలో ఉరకలెత్తుతున్న బొగత జలపాతం

# కృష్ణమ్మ పరవళ్లు

- జూరాల, శ్రీశైలంలోకి పోటెత్తుతున్న కృష్ణమ్మ
- ఏకంగా 2లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహాలు రాక
- 60 టీఎంసీలకు శ్రీశైలం నిల్వ.. రెండ్రోజుల్లోనే ఏకంగా 29 టీఎంసీలు చేరిక
- వరద ఇలాగే కొనసాగితే.. మరో 10 రోజుల్లో శ్రీశైలం నిండటం ఖాయం
- గోదావరిలోనూ వరద ఉధృతి.. 10 టీఎంసీలకు చేరిన ఎల్లంపల్లి నిల్వ
- వారంలో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోతలు షురూ

**సాక్షి, హైదరాబాద్:** ఎగువన ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఉప్పొంగుతోంది. అంతకంతకూ వరద ఉధృతి పెరుగడంతో జూరాల నుంచి శ్రీశైలానికి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. 2నెలలుగా నీటి రాకకై ఎదురుచూసిన శ్రీశైలం ప్రాజెక్టులోకి కరువుదీరా వరద వచ్చి చేరుతోంది. గురువారం ఒక్కరోజే శ్రీశైలంలోకి 12టీఎంసీల మేర నీరు వచ్చి చేరగా, శుక్రవారం అది మరింత పెరిగి 24గంటల్లో ప్రాజెక్టులోకి కొత్తగా 17 టీఎంసీల నీరొచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టు నిల్వ 60 టీఎంసీలను చేరగా, 2లక్షల క్యూసెక్కుల (18.18 టీఎంసీలు)మేర ప్రవాహాలు వచ్చి చేరుతున్నాయి.

### శ్రీశైలంలో పెరుగుతున్న నిల్వ

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు వరద 2లక్షల క్యూసెక్కులకు ఏమాత్రం తగ్గడం లేదు. వర్షాలు కొనసాగుతుండటంతో ప్రవాహాలు ఉధృతంగా ఉన్నాయి. శుక్రవారం సైతం ఆల్మట్టిలోకి 2లక్షల క్యూసెక్కుల (18.18 టీఎంసీలు) మేర వరద రావడంతో.. 2.30లక్షల క్యూసెక్కుల (20.9టీఎంసీలు) మేర నీటిని దిగువకు వదులుతున్నారు. ఇప్పటి వరకు ఒక్క ఆల్మట్టిలోకే 172టీఎంసీల మేర కొత్తనీరు వచ్చింది. ఆల్మటినుంచి భారీగా నీరు వస్తుండటంతో నారాయణపూర్ నుంచి దిగువకు 2.10లక్షల క్యూసెక్కుల (19టీఎంసీలు) నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జూరాలకు వరద ఉధృతి స్థిరంగా ఉంటోంది. శుక్రవారం సాయంత్రానికి జూరాలలోకి 2.05లక్షల క్యూసెక్కుల (18.62 టీఎంసీలు) మేర ప్రవాహం వస్తుండటంతో 24 గేట్ల ద్వారా 2.08లక్షల క్యూసెక్కుల (18.63టీఎంసీలు) నీటిని నదిలోకి వదిలారు. మరో 5,800 క్యూసెక్కుల మేర నీటిని నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్‌లతో పాటు జూరాల కుడి, ఎడమ కాల్వలకు వదులుతున్నారు. నదిలోకి వదిలిన నీరంతా శ్రీశైలానికి వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలానికి 1.98లక్షల క్యూసెక్కులు (18 టీఎంసీలు) మేర ప్రవాహం వస్తుండటంతో ప్రాజెక్టులో నిల్వలు అమాంతం పెరుగుతున్నాయి. శుక్రవారం ఒక్కరోజే ప్రాజెక్టులోకి 17టీఎంసీల మేర కొత్త నీరు వచ్చి చేరింది. దీంతో నిల్వ 215 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 60 టీఎంసీలుగా ఉంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటం, స్థానిక పరీవాహకంలోనూ వర్షాలు కురుస్తుండటంతో ఈ ప్రవాహాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ఈ విధమైన ప్రవాహాలే కొనసాగితే మరో మరో 10 రోజుల్లోనే శ్రీశైలం పూర్తిగా నిండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు నీటి విడుదల కొనసాగనుంది.

### 10 టీఎంసీలకు ఎల్లంపల్లి

ఇక గోదావరిలోనూ రోజురోజుకీ గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. శుక్రవారం మేడిగడ్డ వద్ద 3.70లక్షల క్యూసెక్కుల (33.63టీఎంసీలు) మేర ప్రవాహాలు నమోదయ్యాయి. ఇక ఎల్లంపల్లికి సైతం స్థానిక పరీవాహకం నుంచి 4,800 క్యూసెక్కుల మేర వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ 20టీఎంసీలకు గానూ 10టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లిలో సరిపడినంత నీటి నిల్వలు చేరడంతో కాళేశ్వరంలోని ప్యాకేజీలు–6,7,8ల ద్వారా నీటిని తరలించే ప్రక్రియకు ఇంజనీర్లు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే ప్యాకేజీ–6,8 పంప్‌హౌస్‌ల్లో 7 మోటార్లకు 5 మోటార్లు సిద్ధంగా ఉండగా ప్యాకేజీ–7లో రెండు, మూడ్రోజుల్లో పూర్తి కానున్నాయి. 5వ తేదీ నాటికి ఎత్తిపోతలు మొదలు పెట్టాలని భావించినా.. ఒకట్రెండు రోజులు అటుఇటుగా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోతలు ఆరంభం కానుంది.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..** (నిల్వ–టీఎంసీల్లో) (ఫ్లో క్యూసెక్కుల్లో)

| ప్రాజెక్టు | పూర్తి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 106.83 | 2,02,400 | 2,30,207 |
| నారాయణపూర్ | 37.646 | 31.85 | 2,40,135 | 2,10,128 |
| జూరాల | 9.657 | 9.28 | 2,05,000 | 2,08,278 |
| శ్రీశైలం | 215.807 | 60 | 1,97,995 | 2,400 |
| నాగార్జునసాగర్ | 312.045 | 126.30 | 837 | 837 |
| కడెం | 7.6 | 6.32 | 6,149 | 7,774 |
| ఎల్లంపల్లి | 20.18 | 10 | 4,805 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 5.72 | 406 | 232 |


ఏటూరు నాగారం - బూర్గంపాడ్ ప్రధాన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న జీడివాగు


ఆసిఫాబాద్ జిల్లా ఎర్రవాగు ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆటో


యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం భట్టుగూడెం రోడ్డు వద్ద పొంగిన మూసీ వాగు

# చిందేసిన చినుకు..

▶ మొదటి పేజీ తరువాయి

రెండు, మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. శుక్రవారం దినమంతా హైదరాబాద్‌లో వర్షం కురుస్తూనే ఉంది. సగటున 3సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. నగరంలో మాదాపూర్‌లో 3.9సెంటీమీటర్లు, మోండా మార్కెట్‌లో 2.2సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### రెండ్రోజుల్లో 223% అధికం

రుతుపవనాలు ఊపందుకోవడంతో గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో సాధారణం కంటే ఏకంగా 223% వర్షం కురిసినట్లు రాష్ట్ర ప్రభుత్వ అర్థగణాంకశాఖ వెల్లడించింది. ఈ రెండ్రోజుల్లో సాధారణంగా 12.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఏకంగా 40.4 మిల్లీమీటర్లు కురిసింది. గతేడాది ఇదే రెండ్రోజుల్లో 5.3 మిల్లీమీటర్లు కురిసింది. గతేడాదితో పోలిస్తే ఏకంగా ఇది 662% అధికం. జూలై 24 నాటికి రాష్ట్రంలోని 589 మండలాలకుగాను ఏకంగా 448 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అందులో 83 మండలాల్లో కరువు ఛాయలు నెలకొన్నాయని సర్కారు నివేదిక వెల్లడించింది. కానీ ఈ 10రోజుల లోపే పరిస్థితి మారడం గమనార్హం. .

### భద్రాచలం హై అలర్ట్

భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 41.4 అడుగులకు చేరుకుంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. తాలిపేరు ప్రాజెక్ట్ 24 గేట్లను ఎత్తి 1,91,300 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తుండగా.. ఆ వరద నీరంతా గోదావరిలోనే కలుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రికి నీటిమట్టం 43 అడుగులు దాటే అవకాశం ఉంది. ఈ మార్క్ దాటితో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ క్రమంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ ఆదేశించారు. అటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 మండలాల్లో భారీ వర్షం కురవగా.. 6 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం నమోదైంది. సత్తుపల్లి మండలంలో అత్యధికంగా 111.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుబల్లి 84.8, ఎర్రుపాలెం 77.8, సింగరేణి మండలంలో 68.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### పాలమూరులో వర్షానందం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గురువారం రాత్రి నుంచి ముసురు వర్షం కురుస్తోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా దేవరకద్రలో 56.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, ధరూర్, ఉండవెల్లి, ఇటిక్యాల, మల్దకల్, గట్టు, అయిజ, మానవపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉండవెల్లిలో 29మిల్లీమీటర్లు, గద్వాలలో 28.7మిల్లీమీటర్లు, అలంపూర్‌లో 27.7మిల్లీమీటర్లు, రాజోళిలో 24.5మిల్లీమీటర్లు, గట్టులో 23.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### స్తంభించిన జనజీవనం

కొమురం భీం జిల్లాలో రెండ్రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. జిల్లాలో సిర్పూర్(టీ), కౌటాల, పెంచికల్ పేట, దహేగాం, బెబెజ్జూరులో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సిర్పూర్–టీలో చింతకుంట వాగు ఉధృతికి సమీపంలోని 8 గ్రామాల ప్రజల రవాణాకు తీవ్ర అసౌకర్యం తలెత్తింది. పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దహేగాం మండలంలో పలు గ్రామాలు, బెజ్జూరులో ప్రాణహిత సరిహద్దు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అత్యధికంగా దహేగాం మండలంలో 83.04 మిల్లీమీటర్ల వర్షం పడింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండటంతో స్వర్ణ ప్రాజెక్ట్ నిండిపోయింది.

### కరీంనగర్‌లోనూ ముసురే..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ఇల్లంతకుంట మండలంలో 117.3 మిల్లీమీటర్లు వర్షపాతం కురిసింది. పెద్దపల్లి జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 26 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెరువులు, కుంటల్లోకి కూడా కొంత నీరు చేరడంతో.. రైతులు ఖరీఫ్ పనుల వేగం పెంచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ దినమంతా తుంపరవాన పడుతూనే ఉంది. మూడేళ్ల తరువాత మూలవాగు, నక్కవాగు ప్రవహిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలో శుక్రవారం 731.6 మిల్లిమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా రాయికల్ మండలంలో 79.2మి.మీ, అత్యల్పంగా కొడిమ్యాలలో 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

**నాలుగున అల్పపీడనం**

రుతుపవనాలు ఊపందుకోవడంతో శని, ఆదివారాల్లోనూ చాలాచోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలలో ఈ నెల నాలుగో తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఐదారు తేదీల్లో తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## అన్నదాతల్లో ఆనందం

ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుతో పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎక్కడ చూసినా రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై కనిపించారు. మెదక్ జిల్లా కొల్చారం, టేక్మాల్, పాపన్నపేట, పెద్దశంకరంపేట, సిద్దిపేట జిల్లా బెజ్జంకి, అక్కన్న పేట, హుస్నాబాద్, సంగారెడ్డి జిల్లా ఝరా సంగం, రామచంద్రాపురం, సంగారెడ్డి పట్టణాల్లో వర్షం కురిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లానూ ముసురు పట్టుకుంది. రెండ్రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది.

## వరంగల్‌లో పొంగిపొర్లుతున్న వాగులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల సమీపంలోని పంటలు నీట మునిగాయి. వెంకటాపురం(కె) మండల పరిధి గంగారం గ్రామ సమీప పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు రెండోసారి గండి పడింది. బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జగ్గన్నగూడెం–అంకన్నగూడెం మధ్య ఒర్రె ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జగ్గన్నగూడెం జల దిగ్బంధంలో ఉంది. ఏటూరు నాగారం మండలంలో పలు వాగులు పొంగి పొర్లాయి. ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలం వెంగ్లాపూర్–ప్రాజెక్టు నగర్ మధ్య కల్వర్టుపై నుంచి వరద వెళ్తుండడంతో వెంగ్లాపూర్, గొనేపల్లి, నార్లాపూర్, ఎల్బాక, పడిగాపూర్, మేడారం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎలిశెట్టిపల్లి–కొత్తూరు మార్గంలో దయ్యాలవాగు ఉగ్రరూపంతో రాకపోకలు నిలిచిపోయాయి. రామన్నగూడెం–రాంనగర్ గ్రామాల మధ్య జీడివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉగ్ర రూపం దాల్చి ప్రవహిస్తోంది.

# ఇకపై సొంతంగా నిధులు

▶ మొదటి పేజీ తరువాయి

రాబట్టుకోవాలని భావిస్తోంది. కోకాపేటలో హెచ్‌ఎండీఏకు ఉన్న 140 ఎకరాలు, రాయదుర్గంలో టీఎస్‌ఐఐసీకి ఉన్న 180 ఎకరాలను వేలం వేస్తే రూ.10 వేల కోట్లు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కోకాపేట, రాయదుర్గం ప్రాంతాలు ఇప్పుడు రాజధానిలో అత్యంత విలువైన ప్రాంతాలు. వేలం వేస్తే ఎకరాకు కనిష్టంగా రూ.30 కోట్లు గరిష్టంగా రూ.40 కోట్లు ధర పలుకుతుందని అంచనా వేస్తున్నారు. ఈ భూములు వేలం వేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు వస్తాయని తద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని భూమి బ్యాంక్‌లుగా నిర్ధారించింది. ప్రభుత్వ అవసరాలకు పోను మిగిలిన వాటిని అభివృద్ధి చేసి పారిశ్రామిక, గృహ అవసరాలకు వినియోగించాలని నిర్ణయం తీసుకుంది.

### కేంద్రం తీరుపై తీవ్ర అసంతృప్తి

కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనపై కేంద్రం ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించనే లేదు. మూడేళ్లుగా దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విన్నవిస్తూనే ఉంది. కేంద్రం పట్టించుకోకపోయినా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ముందుకు వెళ్లాలని నిర్ణయించుకుని బ్యాంక్‌ల కన్సార్టియం ద్వారా నిధులు సేకరించారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.80 వేల కోట్లు ఖర్చు చేశారు. ఇటీవలే ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని ఒడిసిపట్టే కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చే ఏడాది నాటికి ఇది పూర్తి స్థాయిలో నీటిని తోడటం ప్రారంభిస్తే తెలంగాణలోని సగం జిల్లాలకు సాగు, తాగునీరు అందించడానికి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంత భారీ ప్రాజెక్టు పట్ల కేంద్రం స్పందించిన తీరు పూర్తి నిరాశాజనకంగా ఉందని ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

**మా ప్రయత్నం మేం చేస్తున్నాం**

''మేం ప్రాజెక్టులు చేపడుతున్నాం, వాటిని పూర్తి చేసేందుకు త్రికరణశుద్ధితో ప్రయత్నిస్తున్నాం. కేంద్రం తగిన తోడ్పాటు అందిస్తే బాగుండేది. అయినా మేము ఎక్కడా వెనకడుగు వేయకుండా మా ప్రయత్నం మేము చేస్తున్నాం''–టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### నీతి ఆయోగ్ సిఫారసు చేసినా..

మిషన్ భగీరథ బాగుందని ప్రశంసించిన నీతి ఆయోగ్ ఈ పథకానికి రూ.19 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది. భూగర్భ నీటిమట్టం పెరిగేందుకు దోహదపడేందుకు ఉద్దేశించిన మిషన్ కాకతీయకు కూడా రూ. ఐదు వేల కోట్లు ఇవ్వాలని సిఫారసు చేసింది. అయితే, కేంద్రం మాత్రం ఇప్పటివరకూ ఈ పథకాలకు గానీ, ప్రాజెక్టులకు గానీ పైసా విదల్చలేదు. నీతి ఆయోగ్ సిఫారసు చేసినా రాష్ట్రానికి ప్రయోజనం లేకుండా పోయింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టులు, పథకాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిధుల సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది.

## ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటడాన్ని కొనసాగించాలని సూచించింది. గ్రామ పంచాయతీ మొదలుకుని రాష్ట్ర స్థాయి వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని, ప్రస్తుతం వర్షాలు బాగా పడుతున్న నేపథ్యంలో మొక్కలు నాటే అవకాశం వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వం జూలై రెండోవారంలో హరితహారాన్ని అధికారికంగా ప్రారంభించాలని భావించినా వాతావరణం సహకరించలేదు. అయితే సీఎం కేసీఆర్ అధికారికంగా మొదలుపెట్టే ఐదో కార్యక్రమంతో సంబంధం లేకుండా వానలు, అనుకూల పరిస్థితులను బట్టి మొక్కలు నాటనున్నారు.

## నయీం కేసును సీబీఐకి అప్పగించాలి

### బీసీ సంఘాల డిమాండ్

**హైదరాబాద్:** గ్యాంగ్‌స్టర్ నయీం కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం నయీం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని రూ.వేలకోట్లు దిగమింగిన అధికారులను, రాజకీయనేతలను వదిలి నిరపరాధులను శిక్షించే కుట్రలు చేస్తోందని ఆ సంఘాలు ఆరోపించాయి. ఈ కేసును సీబీఐకి అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశాయి. విద్యానగర్ బీసీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన 13 బీసీ సంక్షేమ సంఘాల సమావేశంలో ఆ సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు. నయీం కేసులో ముగ్గురు మంత్రులు, 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్సీలు, 12 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నట్లు అప్పట్లో వెలుగులోకి వచ్చిందని, కానీ వీరిపేర్లను చార్జిషీట్‌లో లేకుండా తప్పించారని విమర్శించారు. నయీం వ్యవహారాలతో ఎటువంటి సంబంధంలేని బీసీ సంఘంనేత ఆర్.కృష్ణయ్యతో పాటు గ్రామస్థాయి నాయకుల పేర్లను చార్జిషీట్లో పెట్టి కేసును నీరుగారుస్తున్నారన్నారు. నయీంను ఎన్‌కౌంటర్ చేయగానే లారీల్లో రూ.2 వేల కోట్లను పోలీసులు తెచ్చినట్లు వార్తలు వచ్చాయని, ఆ డబ్బును ఎవరు ఎక్కడికి తీసుకెళ్లారని ప్రశ్నించారు. ఆర్.కృష్ణయ్య వద్దకు రోజుకు ఎంతోమంది తమ కష్టాలు, బాధలు చెప్పుకోవడానికి వస్తారని అందులో నయీం బాధితులు కూడా వచ్చారని, వారి పక్షాన మాట్లాడితే దాన్ని కూడా కృష్ణయ్యపేరును చార్జిషీట్‌లో పెడతారా అని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, ఎర్ర సత్యనారాయణ, కె.నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎకనామిక్ హబ్‌గా వరంగల్: ఎర్రబెల్లి



**సాక్షి, హైదరాబాద్:** వరంగల్ సమగ్రాభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా, ఓ ఎకనామిక్ హబ్‌గా మార్చే విధంగా కొత్త మాస్టర్ ప్లాన్ ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు వెల్లడించారు. త్వరలోనే దీన్ని ప్రభుత్వం ఆమోదించనుందని చెప్పారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్‌కు సూచించారు. వరంగల్ మాస్టర్ ప్లాన్–2041 ఆమోదంపై శుక్రవారం తన నివాసంలో మంత్రి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3 జిల్లాల్లోని 19 మండలాలు, 181 రెవెన్యూ గ్రామాలు మాస్టర్ ప్లాన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. టెక్స్ టైల్ పార్క్, టూరిజం హబ్... వంటి అన్ని అంశాలతో వరంగల్ ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజల సూచనలకు ప్రాధాన్యమిచ్చి అవసరమైన మార్పులతో తుది ప్లాన్ సిద్ధం చేశామనీ, ఎన్జీవోలు, పౌరుల నుంచి వచ్చిన దాదాపు 3,500 ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. మున్సిపల్ శాఖ పూర్తిగా సమీక్షించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ చెప్పారు. సమీక్షలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ‘అక్బరుద్దీన్‌ను కాపాడుతున్న కేసీఆర్’



**సాక్షి, హైదరాబాద్:** ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీని సీఎం కేసీఆర్ కాపాడుతున్నారని, హిందువులను అవమానపర్చేలా మాట్లాడినా పట్టించుకోవడం లేదని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్బరుద్దీన్ నిర్మల్‌లో చేసిన ప్రసంగంపై చార్జిషీట్ దాఖలు చేయకపోవటం వల్లే మొన్న కరీంనగర్‌లో మరోసారి విద్వేషపూరిత ప్రసంగంతో రెచ్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ పబ్బం గడుపుకునేందుకే కేసీఆర్ హిందువుల మనోభావాలను కించపరుస్తున్నారని మండిపడ్డారు. అక్బరుద్దీన్ కరీంనగర్ ప్రసంగంపై కేసు నమోదు చేయమని కోర్టు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలైనా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ ముస్లింల మన్నన కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఓవైపు హిందువులను దూషించే ఒవైసీలతో దోస్తీ చేస్తూనే మరోవైపు యాగాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల కోసమే కేసీఆర్ యాగాలు చేస్తున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌కు టులెట్ బోర్డు కాదని.. ఫర్ సేల్ బోర్డే పెట్టుకోవాలన్నారు.

## నయీం కేసును సుమోటోగా విచారించాలి



చాడ వెంకట్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** గ్యాంగ్‌స్టర్ నయీం కేసును సీబీఐ సుమోటోగా విచారించాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. ఆర్టీఐ సమాచారం ప్రకారం టీఆర్‌ఎస్ నేతలు, పోలీసులకు ఈ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని తెలుస్తోందని, అందుకే ప్రభుత్వం నయీం డైరీని బయటపెట్టడం లేదనే అనుమానాన్ని ఓ ప్రకటనలో వ్యక్తం చేసింది. నయీం దోచుకున్న డబ్బును తిరిగి బాధితులకు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కొత్తగూడెం జిల్లాలో జరిగిన లింగన్న ఎన్‌కౌంటర్ అనుమానాలకు తావిస్తోందని, దీనిపై న్యాయవిచారణకు ఆదేశించాలని సర్కార్‌ను డిమాండ్ చేశారు.

## ‘విమలక్క, సంధ్య అరెస్టు అన్యాయం’



**సాక్షి, హైదరాబాద్:** లింగన్న ఎన్‌కౌంటర్ సందర్భంగా శవాన్ని రీ–పోస్టుమార్టం చేస్తున్న ప్రాంతానికి వెళ్లిన అరుణోదయ అధ్యక్షురాలు విమలక్క, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్యలను అరెస్టు చేయడం అన్యాయమని మాజీ ఎంపీ రేణుకాచౌదరి అన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని, అప్రజాస్వామికమని అభిప్రాయపడ్డారు. సామాజిక ఉద్యమకారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాల్పుల పేరుతో ప్రాణాలను పొట్టన పెట్టుకోవడాన్ని ఖండిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## వీఆర్వో సంఘాల ఆందోళనలు

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) వ్యవస్థపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం, తెలంగాణ వీఆర్వోల సంఘం శుక్రవారం కలెక్టరేట్ల ఎదుట ‘ఆత్మ గౌరవ ధర్నా’లను నిర్వహించాయి. రెవెన్యూ శాఖ రద్దు, ఇతర శాఖల్లో ఉద్యోగుల విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. వీఆర్వోలపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ జిల్లాల్లో జరిగిన ధర్నాల్లో రెండు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు, ఎన్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నయీం కేసులో ఎవర్నీ వదలొద్దు: సీపీఎం



**సాక్షి, హైదరాబాద్:** గ్యాంగ్‌స్టర్ నయీం కేసుతో సంబంధమున్న వారు ఏ స్థాయి వారైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నయీం డైరీని బహిర్గతం చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులనూ నయీం గ్యాంగ్ కొల్లగొట్టిందన్నారు. ఈ కేసు విషయంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారంలో పోలీసు, రెవెన్యూ అధికారులతోపాటు చట్ట వ్యతిరేక శక్తుల పేర్లు, టీఆర్‌ఎస్ నేతల పేర్లు ఉన్నట్టు బయట పడిందన్నారు. అధికార పార్టీ నేతల హస్తం ఉందని తెలియగానే ప్రభుత్వం ఈ కేసును మరుగున పడేయాలని చూస్తోందని విమర్శించారు.

## ‘కేంద్ర హోం శాఖతో విచారించాలి’



**సాక్షి, హైదరాబాద్:** నయీం వ్యవహారంపై కేంద్ర హోం శాఖతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నయీంతో సంబంధాలున్న లిస్టులో అధికారులు, ఇతర పార్టీల నేతల పేర్లను మాత్రమే ప్రకటించడం చూస్తుంటే దీని వెనుక పెద్దల హస్తం ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని ఆరోపించారు. దీనిపై టీఆర్‌ఎస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.



## చదివే బొమ్మ!

**ఈ** చిత్రంలో కనిపిస్తున్నది మామూలు డాల్ఫిన్ బొమ్మ కాదండోయ్... ఇదో ‘చదివే’బొమ్మ! దీని పేరు డాల్ఫియో. 6, 7, 8వ తరగతి తెలుగు, ఆంగ్ల పాఠ్య పుస్తకాలను ఇది అనర్గళంగా, ఉచ్చారణ లోపాల్లేకుండా చదివేయగలదు!

**ఇదో** టాకింగ్ పెన్, మల్టీమీడియా ప్రింట్ రీడర్. ఇందులో ముందే లోడ్ చేసిన ఆడియో ఫైళ్లతో కూడిన మెమొరీ చిప్ ఉంటుంది. బ్యాటరీ చార్జింగ్ ద్వారా పనిచేసే డాల్ఫియోలో పాఠాలు వినబడేలా ఓ స్పీకర్ కూడా ఉంటుంది.

**డాల్ఫియోలో** ఒక సెన్సర్ ఉంటుంది. దీన్ని పాఠ్య పుస్తకం తాలూకా బార్‌కోడ్‌లపై ఉంచితే సెన్సర్ వాటిని స్కాన్ చేసి సంబంధిత ఆడియో ఫైళ్లను యాక్టివేట్ చేస్తుంది. పాఠంలోని అక్షరాలపై డాల్ఫియోను కదుపుతూ వెళ్తుంటే వాటిని అది చదువుతూ వెళ్తుంది.

**విద్యార్థుల్లో** జీవన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు పాఠశాల విద్యాశాఖ ‘టాకింగ్ బుక్స్’ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యునిసెఫ్ సహకారంతో రాష్ట్రంలోని 600 పాఠశాలలకు వీటిని అందించేందుకు చర్యలు చేపట్టింది. పుస్తకాల్లోని పాఠ్యాంశాలపై రీడింగ్ డివైస్ పెడితే ఆ పాఠ్యాంశాలు వాయిస్ రూపంలో విద్యార్థులకు వినిపిస్తాయి. అంతేకాదు బొమ్మలపై పెట్టినా ఆ బొమ్మకు సంబంధించిన కథనాన్ని మొత్తం వివరిస్తుంది. అందుకే వాటికి లైఫ్ స్కిల్ టాకింగ్ బుక్స్‌గా యునిసెఫ్ పేరు పెట్టింది.

**డాల్ఫియో** బొమ్మలను 417 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), 35 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 37 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, ఉట్నూరులోని 111 ఆశ్రమ పాఠశాలలకు అందించనున్నారు.

**బాలికల్లో** జీవన నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా వారిలో మార్పు తీసుకొచ్చేందుకు తెలుగు, ఇంగ్లిషు భాషల్లో వంద కథలతో ఈ టాకింగ్ పుస్తకాలను యునిసెఫ్ పాఠశాలలకు అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు యునిసెఫ్ ప్రతినిధి సుకన్య సుబ్రమణ్యన్ సహకారంతో వీటిని పాఠశాలలకు అందించినట్లు పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్ వెల్లడించారు.

**పర్యావరణ** సమస్యలు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ, బాలికల సమస్యలు, ఆరోగ్యం, పౌష్టికత, బాల కార్మిక, బాలల హక్కులు తదితర అంశాలకు సంబంధించిన పాఠాలను మంచి కథలతో రూపొందించినట్లు విజయ్‌కుమార్ వివరించారు. ముఖ్యంగా గ్రామాల్లోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సులభశైలిలో ఈ కథలు ఉన్నట్లు వెల్లడించారు. 6, 7,8 తరగతులకు చెందిన బాలికలకు వీటితో జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. వీటి ద్వారా జీవన నైపుణ్యాలతోపాటు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో మాట్లాడటం, చదవడం, రాయడం నేర్పించడానికి ఎంతో ఉపయోగపడుతాయని యునిసెఫ్ కన్సల్టెంట్ సదానంద్ వివరించారు.

– సాక్షి, హైదరాబాద్

## రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు

- అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందాలి: కేటీఆర్
- సిరిసిల్ల ఆస్పత్రి అకస్మిక తనిఖీ

**.సిరిసిల్ల:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం మధ్యాహ్నం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెంచామని తెలిపారు. ఒకప్పుడు ‘నేను రాను తల్లో సర్కారు దవాఖానాకు’అంటూ పాటలు పాడే వారని ఇప్పుడు కేసీఆర్ కిట్లు ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపు అయ్యాయన్నారు. ప్రజల్లో ఇంత నమ్మకాన్ని పెంచి ఆస్పత్రికి వచ్చే వారిని ఇప్పుడు వెనక్కి పంపడం ఏమిటని ప్రశ్నించారు. సిరిసిల్ల ఆస్పత్రి సమస్యలపై వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతకుమారితో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి ముందుగా నలుగురు గైనకాలజిస్టులను ఇవ్వాలని కోరారు. సిరిసిల్లకు మంజూరైన 350 పడకల ఆస్పత్రి ఏర్పాటుతో సమస్యలు శాశ్వతంగా తీరుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

**నిజంగానే డాక్టర్లు దేవుళ్లే..**

అత్యవసర పరిస్థితుల్లో నిజంగా డాక్టర్లు దేవుళ్లేనని కేటీఆర్ చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో తనకైనా.. సీఎంకైనా డాక్టర్లే వైద్యం చేయాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి వాళ్లు దేవుళ్లతో సమానమన్నారు. ఇంత పెద్ద గురుతర బాధ్యత ఉన్న వైద్యులు టైంపాస్‌కు పని చేయొద్దని, మనసు పెట్టి వైద్యం అందించాలని కేటీఆర్ సూచించారు. ఒక్కో డాక్టర్ చదువుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో ఆలోచించాలని కోరారు.

**అప్పుడే పుట్టిన బాబుతో కేటీఆర్ సెల్ఫీ**

జిల్లా ఆస్పత్రిని అకస్మికంగా తనిఖీ చేసిన కేటీఆర్ పలు వార్డులను పరిశీలించారు. ప్రసూతి విభాగంలోనికి వెళ్లి అప్పుడే పుట్టిన బాబుతో సెల్ఫీ దిగారు. రుద్రంగికి చెందిన చిప్ప శిరీష, ప్రసాద్ దంపతులకు శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బాబు పుట్టాడు. 3.30 గంటలకు అక్కడికి వెళ్లిన కేటీఆర్‌తో కుటుంబ సభ్యులు, బాబుతో కలసి ఫొటో దిగడం విశేషం.



శుక్రవారం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లీబిడ్డతో కేటీఆర్ సెల్ఫీ

# ఐక్యంగా రెవె‘న్యూ’ సమరం..!

- సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు..
- ట్రెసా, తహసీల్దార్ల సంఘాల విలీనం
- రెవెన్యూ సమస్యలపై ఐక్య పోరాటాలు

**సాక్షి, హైదరాబాద్:** కలసి ఉంటే కలదు సుఖం.. విడిపోతే పడిపోతాం.. అంటున్నాయి రెవెన్యూ సంఘాలు. సఖ్యతగా, ఐక్యతగా మెలగాలని భావిస్తున్నాయి. రెవెన్యూ శాఖ ప్రక్షాళన, విలీనం, వీఆర్వో వ్యవస్థ రద్దు సంకేతాలపై గుర్రుగా ఉన్న రెవెన్యూ సంఘాలు ఐక్యతారాగం వినిపిస్తున్నాయి. ఒక్కటై సర్కార్‌పై ఒత్తిడి తేవాలని భావిస్తున్నాయి. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ట్రెసా), తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ)త్వరలో విలీనం కానున్నాయి. ఒకే మాట.. ఒకే బాటగా సాగాలని నిర్ణయించాయి. వేర్వేరు ఉద్యమాలకు స్వస్తి పలికి ఒకేమార్గంలో సాగాలని నిర్ణయించాయి. రెవెన్యూ శాఖ ప్రక్షాళన, ఇతర శాఖల్లో ఉద్యోగుల విలీనం, తహసీల్దార్ల బదిలీలపై పోరాటం సాగించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనికి ప్రధాన కారణం విడివిడిగా ఆందోళనలు సాగించడమేననే అభిప్రాయం ఉద్యోగవర్గాల్లో వ్యక్తమైంది. యూనియన్ల మధ్య ఉన్న అభిప్రాయభేదాలను ప్రభుత్వపెద్దలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే అభిప్రాయం వెల్లడైంది. ఈ నేపథ్యంలో వేర్వేరుగా పోరాడటం కంటే సంఘటితంగా వెళ్లడం మంచిదని ఉద్యోగులు అంటున్నారు. ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు, రెవెన్యూశాఖ మనుగడ కోసం ఐక్యంగా ఉద్యమించడం మంచిదనే అభిప్రాయానికి ఆయా సంఘాలు వచ్చాయి. ఇందులోభాగంగా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ట్రెసా), తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ)లు ఒక అడుగు ముందుకేశాయి. ఈ క్రమంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాలన్నింటినీ ఏకతాటి మీదకు తేవాలని ట్రెసా నిర్ణయించింది. ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో ట్రెసా, టీజీటీఏ విలీనానికి ఆమోదముద్ర వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఉద్యోగుల హక్కులు కాపాడుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా ఈ కీలక నిర్ణయానికి ముందడుగు పడ్డట్లు తెలుస్తోంది.

**ప్రభుత్వం దిగిరాకపోవడంతో...**

ఎన్నికల కమిషన్ ఆంక్షలకు అనుగుణంగా గతేడాది శాసనసభ ఎన్నికలవేళ ఇతర జిల్లాలకు బదిలీలు చేసిన తహసీల్దార్లను పాత జిల్లాలకు పంపాలని ఒత్తిడి తెచ్చినా ప్రభుత్వం స్పందించలేదు. ఈ విషయంపై చర్చించేందుకు ప్రభుత్వ పెద్దలు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. సర్కార్ రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, వీఆర్వోల వ్యవస్థ రద్దు, ఇతర శాఖల్లో ఉద్యోగుల విలీనంపై సంకేతాలిస్తుండడంతో ఆందోళనకు గురైన ఉద్యోగసంఘాలు పోరాటబాట పట్టాయి. ఈ క్రమంలో టీజీటీఏ వర్క్ టు రూల్‌కు పిలుపునిచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ట్రెసా కూడా వెనక్కితగ్గింది. దీంతో విడివిడిగా ఉద్యమాల వల్ల ప్రభుత్వం దృష్టిలో పలుచనబడ్డామని భావించిన ఉద్యోగులు.. సంఘాల మధ్య ఆధిపత్యపోరుకు తావులేకుండా పట్టువిడుపులు ప్రదర్శించాలని సూచించారు. ఇందుకనుగుణంగా సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు రావాలని ఒత్తిడి తెచ్చారు. ఉద్యోగుల అభిప్రాయాలతో ఏకీభవించిన సంఘాల నేతలు కూడా మెట్టు దిగారు. ఒకే సంఘంగా కలిసి నడిచేందుకు ముందుకు వచ్చారు. ట్రెసా, టీజీటీఏల కలయికతో వీటికి అనుబంధంగా కొనసాగుతున్న సంఘాలు కూడా ‘సంఘ’టితం కానున్నాయి.

# నిమ్మగడ్డ విడుదల

**సాక్షి, హైదరాబాద్:** రస్ అల్ ఖైమా (రాక్) ఫిర్యాదు మేరకు సెర్బియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో అరెస్టయిన పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ శుక్రవారం విడుదలయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని వాన్‌పిక్‌లో పెట్టుబడులకు సంబంధించి తమకు అన్యాయం జరిగిందని రస్ అల్ ఖైమా యాజమాన్యం యూఏఈ కోర్టులో ఫిర్యాదు చేయడం తెలిసిందే. అక్కడి కోర్టు నుంచి లుకౌట్ నోటీసులు పొందిన రాక్ వాటి ఆధారంగా ఇంటర్‌పోల్‌ను అప్రమత్తం చేసింది. దీంతో బెల్‌గ్రేడ్‌లో దిగిన నిమ్మగడ్డ ప్రసాద్‌ను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ అరెస్టు అక్రమమని, వాన్‌పిక్ ప్రాజెక్టు న్యాయపరమైన వివాదాల్లో చిక్కుకున్న కారణంగా ఆయన కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఇందులో ప్రసాద్ తప్పేమీ లేదని వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి కార్యాలయానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకొని ప్రసాద్‌ను భారత్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో నిమ్మగడ్డ ప్రసాద్ తరపున న్యాయవాదులు కూడా అక్కడ ఆయన విడుదలకు ప్రయత్నాలు చేశారు. దీంతో ఆయన శుక్రవారం విడుదలైనట్లు తెలిసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

**వివాదమేంటి?**

ప్రకాశం జిల్లాలో చేపట్టిన వాన్‌పిక్ ప్రాజెక్టుకు రస్ అల్ ఖైమా తన స్థానిక భాగస్వామిగా నిమ్మగడ్డ ప్రసాద్‌ను గతంలో ఎంచుకుంది. ఈ ప్రాజెక్టులో రాక్ 26% వాటా తీసుకొని దాదాపు రూ.535 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అయితే తర్వాత తలెత్తిన న్యాయపరమైన వివాదాల వల్ల ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఈ ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేసిన భూములను సైతం ఈడీ అటాచ్ చేసింది. దీంతో ప్రధాన భాగస్వామి అయిన నిమ్మగడ్డ పెట్టుబడులు సైతం అందులో ఇరుక్కుపోయాయి. అయితే తమ పెట్టుబడులపై తగిన రాబడి రాలేదంటూ తాజాగా రాక్.. యూఏఈ కోర్టులో ఫిర్యాదు చేసింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అడ్జుడికేటింగ్ అథారిటీ చేసిన ఈ అటాచ్‌మెంట్ సరికాదంటూ గత వారమే ఈడీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చింది. ఈ ఆస్తులను జప్తు నుంచి విడుదల చేస్తూ రూ.235 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలని మాత్రం కోరింది. దీంతో ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు తొలగినట్లు అయింది. అదే సమయంలో బెల్‌గ్రేడ్‌లో నిమ్మగడ్డ ప్రసాద్ అరెస్టు కావడం గమనార్హం.

## ఆపరేషన్లు ఆగిపోయాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రైవేటు ఆస్పత్రులకు తరలి వెళ్లగా.. మరి కొందరు ఆస్పత్రి ప్రాంగణాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. రోజంతా ఏకధాటిగా కురుస్తున్న వర్షం, వైద్యులు సమ్మెకు దిగిన సమాచారంతో ఆయా ఆస్పత్రులకు రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇదిలా ఉండగా పార్లమెంట్‌లో జాతీయ వైద్య కమిషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ.. దానిని ఉపసంహరించే వరకు ఆందోళనను విరమించేది లేదని వైద్యులు మరోసారి స్పష్టం చేశారు.

**అత్యవసరం తప్ప అంతా బంద్!**

సాధారణ రోజుల్లో ఉస్మానియాలో రోజుకు సగటున 150, గాంధీలో 200, నిలోఫర్‌లో 40–50, ఈఎన్‌టీలో 25, నిమ్స్‌లో 250 వరకు చిన్నాపెద్దా సర్జరీలు జరుగుతాయి.అయితే జూడాల సమ్మెతో 30% సర్జరీలు వాయిదా వేయాల్సి వచ్చింది. అత్యవసర సర్జరీలు కొనసాగినప్పటికీ.. మిగిలిన ఆపరేషన్లను వాయిదా వేశారు. ఇప్పటికే సర్జరీకి డేట్ తీసుకుని, ఉదయాన్నే ఆయా ఆపరేషన్ థియేటర్ల వద్దకు చేరుకున్న బాధితులు తీరా ఆపరేషన్ వాయిదా వేసినట్లు తెలిసి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. గాంధీ ఆస్పత్రిలోని జూడాలు చేపట్టిన సామూహిక అమరణ నిరాహార దీక్ష కొనసాగుతోంది. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యులు ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేయగా, ఉస్మానియాలో పాతభవనం ముందు ఆందోళన చేపట్టారు. ఇక నిలోఫర్ చిన్నపిల్లల దవాఖానాలో సకాలంలో వైద్య సేవలు అందక పసిపిల్లలు అవస్థలు పడుతున్నారు. నిమ్స్‌లో రెసిడెంట్ వైద్యులు విధులు బహిష్కరించడంతో అత్యవసర విభాగానికి చేరుకున్న రోగులకే కాకుండా ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు వైద్యసేవలు అందలేదు.

**స్టాఫ్ నర్సులే పెద్దదిక్కు**

జూనియర్లు సమ్మెలో ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తాత్కాలికంగా సెలవులను రద్దు చేశారు. సీనియర్ ఫ్యాకల్టీ మొత్తాన్ని ఓపీ, ఐపీ, అత్యవసర విభాగాల్లో అందుబాటులో ఉంచారు. ఉదయం 9 గంటలకే ఐపీ రౌండ్స్ నిర్వహించాల్సిన సీనియర్ వైద్యులు ఓపీలో కూర్చోవడంతో ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు స్టాఫ్‌నర్సులే పెద్ద దిక్కుగా మారారు. కాగా ఇప్పటికే ఆస్పత్రిలో అడ్మిటైన వారికి సర్జరీ కోసం ఎదురు చూపులు తప్పలేదు.

## ఐఐటీ సీట్లన్నీ ఫుల్: ఎంహెచ్‌ఆర్‌డీ సెక్రటరీ ట్వీట్

**సాక్షి, హైదరాబాద్:** దేశంలోని ఐఐటీల్లో బీటెక్ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. గతంలో ప్రతిసారి సీట్లు మిగిలే ఐఐటీల్లో ఈసారి అన్ని సీట్లు భర్తీ అయ్యాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ట్వీట్ చేశారు. ఐఐటీల్లో మొత్తం 13,604 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా, ఇటీవల పూర్తి చేసిన జోసా కౌన్సెలింగ్‌తో సీట్లన్నీ భర్తీ అయ్యాయని వెల్లడించారు. అన్ని ఐఐటీల సమన్వయం, ఐఐటీ రూర్కీ సహకారంతో ఇది సాధ్యమైందన్నారు.

# దేవదాస్ కనకాల ఇకలేరు

**సాక్షి, హైదరాబాద్:** సీనియర్ నటుడు, నటన శిక్షకుడు దేవదాస్ కనకాల (75) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కన్నుమూశారు. గత నెల 27న కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటినుంచి ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. దీనికితోడు పలు అవయవాలు పనిచేయకపోవడంతో ఆయన మృతి చెందారు. ఆయనకు కుమారుడు రాజీవ్ కనకాల, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. రాజీవ్ సినీ నటుడిగా, కోడలు సుమ టీవీ యాంకర్‌గా సుపరిచితులు.

**నటుల ఫ్యాక్టరీ..**

తూర్పు గోదావరి జిల్లాలోని కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో 1945 జూలై 30న కనకాల పాపయ్య నాయుడు, మహాలక్ష్మమ్మ దంపతులకు దేవదాస్ జన్మించారు. యానాం శివారులోని కనకాలపేట ఆయన స్వగ్రామం. దేవదాస్ తండ్రి ఫ్రెంచి పాలనలో ఉన్నప్పుడు యానాం ఎమ్మెల్యేగా పనిచేశారు. నటుడిగా, శిక్షకుడిగా దేవదాస్ కనకాల ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చలిచీమలు, నాగమల్లి సినిమాలకు దర్శకత్వం వహించారు. సిరిసిరి మువ్వ, గోరింటాకు, మంచుపల్లకి, గ్యాంగ్ లీడర్ తదితర చిత్రాల్లో దేవదాస్ నటించారు. చివరగా ‘భరత్ అనే నేను’ చిత్రంలోనూ కనిపించారు. హైదరాబాద్‌లో యాక్టింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటుచేసి నటనలో శిక్షణనిచ్చారు. రజనీకాంత్, చిరంజీవి, రాజేంద్రప్రసాద్, శుభలేఖ సుధాకర్, భానుచందర్, రఘువరన్, నాజర్, తదితర ప్రముఖులు దేవదాస్ శిష్యులే. 2018లో సతీమణి లక్ష్మి మృతి ఆయనను కలిచివేసింది. ఆయన మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు సినీ నటులు కిమ్స్ ఆస్పత్రి వద్దకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన భౌతిక కాయం ఆస్పత్రిలోనే ఉంచారు. శనివారం ఉదయం 8 గంటలకు మణికొండలో నిస్వగృహానికి భౌతికకాయాన్ని తీసుకెళ్లనున్నారు. ఉదయం 11:30 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఉంచి, అనంతరం రాయదుర్గంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

**సీఎం సంతాపం..**

సీనియర్ నటుడు దేవదాస్ కనకాల మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. నటన శిక్షణ సంస్థను నెలకొల్పి ఎందరినో సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దేవదాసు కనకాల మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరనిలోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## నిరంజన్‌రెడ్డి తల్లికి సీఎం నివాళి

**వనపర్తి:** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తల్లి తారకమ్మ సమారాధనకు శుక్రవారం సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత నెల 22వ తేదీన మంత్రి తల్లి మృతి చెందారు. అదే రోజు ముఖ్యమంత్రి తన స్వగ్రామం చింతమడకకు వెళ్లినందున ఇక్కడికి రాలేకపోయారు. ఈ నేపథ్యంలో నిరంజన్‌రెడ్డిని స్వయంగా కలసి పరామర్శించేందుకు సీఎం శుక్రవారం వనపర్తికి వచ్చారు. మధ్యాహ్నం సుమారు గంట పాటు ఆయన మంత్రి నివాసంలో గడిపారు. రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌అలీ, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు జోగినిపల్లి సంతోష్‌కుమార్, పి.రాములు, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అబ్రహాం, రాజేందర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు జూపల్లి కృష్ణారావు, చిత్తరంజన్‌దాస్, మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీ ఎమ్మెల్యేలు ఎడ్మ కిష్టారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీడ్స్ డైరెక్టర్ కేశవులు, విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తదితరులు తారకమ్మకు నివాళులర్పించారు.

# కశ్మీర్.. హై అలర్ట్!



పోలీసు సోదాల్లో దొరికిన అమెరికా తయారీ అత్యాధునిక రైఫిల్

## ప్రఖ్యాత అమర్‌నాథ్ యాత్ర అర్ధంతరంగా నిలిపివేత • యాత్రపై పాకిస్తాన్ 'ఉగ్ర' దృష్టి

## పాక్‌లో తయారైన మందుపాతర లభ్యం • అమెరికాలో తయారైన స్నైపర్ తుపాకీ కూడా

**కశ్మీరం వేడెక్కుతోంది. లోయలో భద్రతా బలగాల పెంపుపై ఊహాగానాలు కొనసాగుతుండగానే.. ప్రతిష్టాత్మక అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తూ శుక్రవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాత్రపై పాక్ ఉగ్రదాడికి పాల్పడే అవకాశముందనే నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రికులు, ఇతర పర్యాటకులు తక్షణమే తమ పర్యటనను ముగించుకుని కశ్మీర్ నుంచి వెనక్కు వెళ్లాలని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదేశించింది. యాత్ర మార్గంలో పాకిస్తాన్‌లో తయారైన మందుపాతర, అమెరికా మేడ్ స్నైపర్ రైఫిల్ లభించాయని భారత ఆర్మీ ప్రకటించింది. యాత్రపై దాడికి ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నారని కచ్చితమైన నిఘా సమాచారం వచ్చినట్లు పేర్కొంది. కశ్మీర్‌కు భారీగా బలగాలను పంపిస్తున్నారన్న వార్తలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అయితే, అలాంటిదేమీ లేదనీ, అంతర్గత భద్రత, సిబ్బంది మార్పిడి కోసం 10 వేల మందిని పంపేందుకు గత వారమే ఆదేశాలిచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడి ప్రజల కన్నా.. భూభాగమే ముఖ్యమని తేలిందని పీడీపీ నేత, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు.**



జమ్మూలోని భగవతి నగర్ బేస్‌క్యాంప్‌కు చేరుకున్న అమర్‌నాథ్ యాత్రికులు

**శ్రీనగర్:** అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం అనూహ్య ప్రకటన చేసింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్ర లక్ష్యంగా దాడి చేసేందుకు ఆ దేశ ఆర్మీ సహాయంతో కుట్రలు పన్నుతున్నారని కచ్చితమైన సమాచారం వచ్చినట్లు భారత ఆర్మీ శుక్రవారం హెచ్చరించింది. దీంతో యాత్రికులు, పర్యాటకులు కశ్మీర్ నుంచి ఉన్నపళంగా వెనక్కు వెళ్లిపోవాలని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం సూచించింది. దీంతో స్థానిక కశ్మీర్ ప్రజల్లోనూ భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితులు హింసాత్మకంగా మారే అవకాశం ఉందంటూ అక్కడి ప్రజలు నిత్యావసరాల కొనుగోలుకు దుకాణాల ముందు క్యూలు కడుతున్నారు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో గవర్నర్ పాలన నడుస్తుండటం తెలిసిందే. జూలై 1న మొదలైన అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 15న ముగియాల్సి ఉంది. కాగా, యాత్ర సాగే మార్గాల్లో ఆయుధాలు, పేలుడు పదార్థాలను సైన్యం గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుందని ఆర్మీ 15 కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ) లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ చెప్పారు. అమర్‌నాథ్ యాత్ర సాగే బల్తాల్, పహల్గామ్ మార్గాల్లో భద్రతా దళాలు సోదాలు నిర్వహించగా, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, అమెరికాలో తయారైన ఎం–24 (స్నైపర్) తుపాకి లభించాయని వెల్లడించారు. పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశామని ఆయన తెలిపారు. యాత్రికులపై దాడి చేయాలన్న ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేసేందుకు భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని ధిల్లాన్ వెల్లడించారు. గత కొన్ని రోజుల్లో భద్రతా దళాలు జరిపిన సోదాల్లో, పాకిస్తాన్‌లోని ఆయుధ కర్మాగారంలో తయారైన మందుపాతర, భారీ స్థాయిలో ఇతర ఆయుధాలు దొరికాయని ధిల్లాన్ తెలిపారు. కశ్మీర్ లోయలో శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టేందుకు పాకిస్తాన్, ఆ దేశ ఆర్మీ చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. జమ్మూ కశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్‌తో కలిసి ధిల్లాన్ సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'గత మూడు నాలుగు రోజుల నుంచి మాకు నిఘా వర్గాల ద్వారా కచ్చితమైన సమాచారం వస్తోంది. పాకిస్తాన్ ఆర్మీ నేతృత్వం, సాయంతోనే ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రికులపై దాడి చేసేందుకు కుట్ర పన్నుతున్నారు' అని చెప్పారు. మరోవైపు అవసరమైతే కశ్మీర్ విమానాశ్రయం నుంచి అదనపు విమానాలను నడపడానికి సిద్ధంగా ఉండాలని విమానయాన సంస్థలను డీజీసీఏ ఆదేశించింది.

### ఇక కేంద్రం సిద్ధమైంది: మెహబూబా

పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ ప్రభుత్వం కశ్మీర్‌పై సైనిక శక్తిని ఉపయోగిస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను తొలగించే విషయంలో కీలక నిర్ణయం త్వరలోనే రావొచ్చన్న వార్తల నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ 'ఎట్టకేలకు కేంద్రం సిద్ధమైనట్లుగా ఉంది. ప్రజల కన్నా భూభాగమే ముఖ్యమని ఇండియా నిర్ణయించుకున్నట్లుంది. మీరు (ప్రభుత్వం) దేశంలోని ముస్లిం ఆధిక్య రాష్ట్రం ప్రేమను గెలుచుకోవడంలో విఫలమయ్యారు. మతం ఆధారంగా దేశ విభజనను వ్యతిరేకించి లౌకిక రాజ్యమైన భారత్‌తో కలిసుండాలని నిర్ణయించుకున్న రాష్ట్రమిది. కానీ ఇప్పుడు ఇండియా సిద్ధమైనట్లుగా ఉంది. జమ్మూ కశ్మీర్ ప్రజలను దోపిడీ చేసేందుకు కేంద్రం సన్నద్ధమైనట్లుగా కనిపిస్తోంది' అని ఆరోపించారు. అలాగే మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్ ప్రత్యేక హోదా అంశాన్ని కదిలించవద్దని కేంద్రాన్ని కోరింది.

### భద్రత కోసమే బలగాలు: కేంద్రం

కశ్మీర్‌లో అంతర్గత భద్రతా పరిస్థితుల దృష్ట్యానే పారా మిలిటరీ బలగాలను కశ్మీర్‌కు పంపుతున్నట్లు కేంద్ర హోం శాఖ శుక్రవారం వెల్లడించింది. ఇలాంటి విషయాలను బహిరంగంగా చర్చించాల్సిన అవసరం లేదని హోం శాఖ స్పష్టం చేసింది. కశ్మీర్‌కు 10 వేల సిబ్బందిని కేంద్రం జమ్మూ కశ్మీర్‌కు తరలిస్తోందనీ, వారం క్రితమే ఇందుకు సంబంధించిన ఆదేశాలు వచ్చాయని హోం శాఖ వర్గాలు చెప్పాయి.

### భయం రేకెత్తిస్తున్నారు: ఎన్‌సీ, పీడీపీ

యాత్రికులు, పర్యాటకులు కశ్మీర్ నుంచి వెంటనే వెళ్లిపోవాలని చెప్పడం ద్వారా కశ్మీర్ లోయలో ప్రభుత్వం భయం రేకెత్తిస్తోందనీ, ఇలాంటి పరిస్థితిని తాము ఇంతకుముందెన్నడూ చూడలేదని జమ్మూ కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) మండిపడ్డాయి. ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా ఓ ట్వీట్ చేస్తూ, 'ఉన్నపళంగా వెళ్లిపోవాలని యాత్రికులు, పర్యాటకులకు ప్రభుత్వమే చెబితే వారిలో భయం కలగదా? వారంతా తక్షణం అన్నీ సర్దుకుని వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు విమానాశ్రయాలు, రహదారులు పూర్తిగా జనంతో కిక్కిరిసిపోతాయి' అని అన్నారు. కశ్మీర్‌కు రాజ్యాంగం ఇస్తున్న హక్కులను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని కోరింది. మాజీ ప్రధాని మన్మోహన్ అధ్యక్షతన జమ్మూ కశ్మీర్ అంశంపై కాంగ్రెస్ ఓ భేటీ నిర్వహించిన అనంతరం కేంద్రానికి ఈ విజ్ఞప్తి చేసింది.

### కశ్మీర్‌లో భయం భయం..

ఉగ్రవాదులు దాడి చేసేందుకు కుట్ర పన్నుతున్నందున అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకులు వెంటనే కశ్మీర్ నుంచి వెనక్కు వెళ్లిపోవాలంటూ ప్రభుత్వం ప్రకటన చేయడంతో స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రజలు సరకులు, ఇతర నిత్యావసరాలు కొనుగోలు చేసి ముందస్తుగా భద్రపరచుకునేందుకు దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. ఏటీఎంలు, పెట్రోల్ బంకుల ముందు భారీ వరుసల్లో నిలబడుతున్నారు. కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలగించే విషయమై కీలక నిర్ణయం రానుందనీ, ఆ కారణంగా గొడవలు జరిగి శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని పుకార్లు వస్తున్నాయి. దీంతో సరకులను ముందుగానే కొనుగోలు చేసి పెట్టుకునేందుకు స్థానికులు క్యూలు కట్టారు.

---

### హైదరాబాద్ వర్సిటీకి ఎమినెన్స్ హోదా

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సహా దేశంలోని ఐదు వర్సిటీలకు ఎమినెన్స్ హోదా ప్రకటించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సిఫారసు చేసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో పాటు ఢిల్లీ వర్సిటీ, బీహెచ్‌యూ, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మేరకు యూజీసీ ఎంపవర్డ్ ఎక్స్‌పర్ట్ కమిటీ(ఈఈసీ) నిర్ణయం తీసుకుంది. ఎమినెన్స్ హోదా పొందాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం నిధులను వెచ్చించేందుకు అంగీకారం తెలపాల్సి ఉంటుంది. అదే ప్రైవేట్ సంస్థలకైతే ప్రభుత్వాల నుంచి నిధులు అందనప్పటికీ స్పెషల్ కేటగిరీ డీమ్డ్ యూనివర్సిటీగా మరింత అటానమీ లభిస్తుంది.

### 'ట్రిపుల్ తలాక్'పై సుప్రీంకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ:** ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ట్రిపుల్ తలాక్ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలయింది. ట్రిపుల్ తలాక్ ఆచారం శిక్షార్హమంటూ తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ 'సమస్త కేరళ జమియతుల్ ఉలేమా'అనే సంస్థ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 21లకు ఈ చట్టం విరుద్ధంగా ఉందని పేర్కొంది. మత ప్రాతిపదికన తీసుకువచ్చిన ఈ చట్టం అమలును ఆపకుంటే సమాజంలో విభేదాలు, అసమానతలు పెరిగే ప్రమాదముందని ఆ సంస్థ తెలిపింది.

### 'జై శ్రీరాం' అనాలంటూ మూకదాడి

**గోధ్రా:** 'శ్రీరాం' అని నినదించేందుకు వ్యతిరేకించిన ముగ్గురు ముస్లిం యువకులపై ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసిన ఘటన గుజరాత్‌లోని గోధ్రాలో చోటు చేసుకుంది. ఆరుగురు ఆగంతకులపై కేసు నమోదైంది. 'నా కుమారుడు సమీర్ (17), అతడి మిత్రులతో కలసి బైక్‌పై వెళుతుండగా, రెండు బైక్‌లపై వచ్చిన ఆరుమంది వారిని ఆపి 'శ్రీరామ్' అని నినదించాల్సిందిగా బలవంతం చేశారు. ముగ్గురు యువకులు అందుకు వ్యతిరేకించడంతో సైకిల్ చైన్‌తో దాడిచేశారు' అని సమీర్ తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

### జూదంలో భార్యను పణంగా పెట్టి ..

**జౌన్‌పూర్:** జూదం, తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి తన భార్యనే ఓడిపోయి, ఆమెపై గ్యాంగ్‌రేప్ చేయించిన ఘటన యూపీలో జరిగింది. ఆ తాగుబోతుతో కలసి తాగేందుకు, జూదమాడేందుకు అతడి మిత్రుడు అరుణ్, బంధువు అనిల్‌లు తరచూ అతని ఇంటికొచ్చేవారు. జూదమాడే సమయంలో డబ్బు అయిపోవడంతో తన భార్యనే పణంగా పెట్టి ఓడాడు. దీంతో వారిద్దరూ ఆమెను గ్యాంగ్‌రేప్ చేశారు. దీంతో ఆమె అక్కడినుంచి తప్పించుకొని బంధువు ఇంటికెళ్లింది. తర్వాత, సారీ చెప్పి తీసుకొస్తూ మళ్లీ వారితో గ్యాంగ్‌రేప్ చేయించాడు. ఈ విషయంపై ఆమె జఫారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసేందుకు అంగీకరించలేదు. దీంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. గ్యాంగ్‌రేప్ కేసు నమోదు చేయాల్సిందిగా కోర్టు ఆదేశించడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు.

### ఐఎన్ఎఫ్‌ను రద్దు చేసుకున్న అగ్రరాజ్యాలు

**బ్యాంకాక్:** ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కుదిరిన అణు క్షిపణుల నిరోధక ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు అమెరికా–రష్యా ప్రకటించాయి. భూమి నుంచి ప్రయోగించే స్వల్ప, మధ్యంతర శ్రేణి అణ్వస్త్ర, ఇతర క్షిపణుల ప్రయోగాలను నిషేధిస్తూ అమెరికా–రష్యాల మధ్య 1987లో ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియెట్ రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్) ఒప్పందం కుదిరింది. ఆయుధ పోటీని తగ్గించే లక్ష్యంతో ఇరు దేశాలు ఈ ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఐఎన్ఎఫ్ ఒప్పందం ముగిసినట్లేనని రష్యా ప్రకటించిన కొద్ది నిమిషాల్లోనే.. అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియో దీనిపై మాట్లాడారు. తాము ఇందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఐఎన్ఎఫ్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నట్లు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న ఇరు దేశాలు.. కొన్ని నెలల కింద నుంచే ఒప్పంద విరమణకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చాయి.



బంగ్లాదేశ్‌కు చెందిన ఈ అవిభక్త కవల పేర్లు రబేయా, రుకేయా. హంగేరీకి చెందిన 35 మంది నిష్ణాతులైన వైద్యుల బృందం ఏకధాటిగా 30 గంటలపాటు సర్జరీలు చేసి విజయవంతంగా వీరిద్దరినీ విడదీశారు.

## 'ఉగ్ర' బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- జాతీయ దర్యాప్తు సంస్థకు విస్తృత అధికారాలు
- ఉగ్ర వ్యతిరేక చట్ట సవరణకు పార్లమెంట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** కీలకమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్ట సవరణ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందింది. ఇది చట్ట రూపం దాలిస్తే ఉగ్ర చర్యలతో సంబంధమున్న ఏ వ్యక్తిని అయినా సరే ఉగ్రవాదిగా ప్రకటించడంతో పాటు, అతని ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. జాతీయ దర్యాప్తు సంస్థ అధికారాలను విస్తృతం చేసింది. ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం–1967 సవరిస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అనుకూలంగా 147 ఓట్లు, వ్యతిరేకంగా 42 ఓట్లు పడ్డాయి.



రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్‌షా

కాంగ్రెస్, బీఎస్పీ బిల్లుకు మద్దతు తెలిపాయి.

### కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలు

బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు చిదంబరం మాట్లాడుతూ.. చట్ట సవరణకు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే, తాజా సవరణతో వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని, చట్టం దుర్వినియోగం అయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవరణలను కోర్టులు కొట్టేసే అవకాశముందన్నారు. డీఎంకేకు చెందిన రవికుమార్ మాట్లాడుతూ.. మూకదాడి కేసులు, పరువు హత్యల్లో నిందితులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించాలని కోరారు. దీనిపై హోం మంత్రి మాట్లాడుతూ.. 'గతంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం ఉగ్రవాదానికి మతం రంగు పులిమింది. సంఝౌతా ఎక్స్‌ప్రెస్, మక్కా మసీదు పేలుడు ఘటనల్లో ఒక మతానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టింది. దీంతో అసలైన నిందితులు తప్పించుకోగలిగారు. ఈ చట్టాన్ని ఉపయోగించుకునే దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా ప్రతిపక్ష నేతలను జైలుపాలు చేసి, మీడియాపై ఆంక్షలు విధించింది' అని కాంగ్రెస్ పార్టీకి చురకలు అంటించారు.

### విదేశాల్లో ఉగ్ర కేసులపైనా ఎన్ఐఏ

దేశంతోపాటు విదేశాల్లో ఉగ్ర సంబంధ కేసులపైనా దర్యాప్తు చేపట్టే అధికారం ఎన్ఐఏకు ఇస్తూ కేంద్ర హోం శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం భారతీయులు, భారత్ ఆస్తులపై ఉగ్రదాడులు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ఆయుధాల రవాణా, తయారీ, దొంగనోట్లకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు చేపట్టే అధికారం ఎన్ఐఏకు ఉంటుంది. ఇలాంటి కేసుల విచారణకు ఢిల్లీలో ప్రత్యేక కోర్టును కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. జలియన్ వాలాబాగ్ నేషనల్ మెమోరియల్ చట్టం–1951 (సవరణ)బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. జలియన్ వాలాబాగ్ నేషనల్ మెమోరియల్ కమిటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ట్రస్టీగా ఉండేందుకు ఇకపై వీలుండదు. డ్యామ్ సేఫ్టీ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

### ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకే..

చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం సవరణ బిల్లుపై జరిగిన చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తూ.. ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయడానికే చట్ట సవరణను చేపట్టామన్నారు. ఒక సంస్థను ఉగ్ర సంస్థగా ప్రకటిస్తే అందులోని వ్యక్తులు వేర్వేరు పేర్లతో ప్రమాదకర కార్యకలాపాలను కొనసాగించేందుకు ప్రస్తుత చట్టం వీలు కల్పిస్తోంది. ఇటువంటి వారి చర్యలపై నిఘా వేసేందుకు వీలు లేకుండా పోయింది. ఇలాంటి వ్యక్తులను అడ్డుకునేందుకే తాజాగా సవరణ చేపట్టాం' అని వివరించారు. 'ఈ చట్టంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగేందుకు వీలులేకుండా నిబంధనలున్నాయి. నాలుగు దశల్లో పరిశీలన జరిపిన మీదటే ఎవరైనా వ్యక్తులను ఉగ్రవాదులుగా ప్రకటించేందుకు వీలుంటుంది' అని తెలిపారు.

## జర్నలిస్ట్ రవీశ్‌కు మెగసెసె అవార్డు

### మరో ముగ్గురికి పురస్కారం

**మనీలా:** ఆసియా నోబెల్‌గా అభివర్ణించే ప్రఖ్యాత రామన్ మెగసెసె పురస్కారం ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు, ఎన్డీటీవీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రవీశ్ కుమార్‌ను వరించింది. 2019 ఏడాదికి గాను రవీష్ ఈ అవార్డును గెలుచుకున్నట్లు రామన్ మెగసెసె ఫౌండేషన్ శుక్రవారం ప్రకటించింది. నిస్సహాయుల గొంతుకగా నిలిచినందుకుగాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ పేర్కొంది. అలాగే భారత్‌దేశ టెలివిజన్ జర్నలిస్టుల్లో అత్యంత ప్రతిభావంతమైన వారిలో రవీశ్ ఒకరని కొనియాడింది. రవీష్‌తోపాటు మరో నలుగురు ఆసియా నుంచి మెగసెసె–2019 పురస్కారానికి ఎంపికయ్యారు. వారిలో కో స్వీ విన్(మయన్మార్), అంగ్‌ఖానా నిలపైజిత్(థాయిలాండ్), రేముండో పుజాంతే కాయాబ్యాబ్(ఫిలిప్పీన్స్), కిమ్ జాంగ్ కి(దక్షిణ



కొరియా) ఉన్నారు. వీరందరికీ ఆగస్టు 31వ తేదీన ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఆసియా నోబెల్‌గా పరిగణించే ఈ అవార్డును 1957లో ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసె జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. ఆసియా అత్యున్నత పురస్కారంగా పిలిచే ఈ అవార్డును వ్యక్తులు లేదా సంస్థలకు రామన్ మెగసెసే ఫౌండేషన్ ఏటా అందిస్తోంది. గతంలో భారత్ నుంచి రామన్ మెగసెసె అవార్డును ఆర్‌కే లక్ష్మణ్, పి.సాయినాథ్, అరుణ్ శౌరి, కిరణ్ బేడీ, అర్వింద్ కేజ్రీవాల్ అందుకున్నారు.

### రవీష్ ప్రస్థానం..

బిహార్‌లోని జిత్వార్‌పూర్ గ్రామంలో రవీశ్ జన్మించారు. ప్రముఖ న్యూస్ చానల్ ఎన్డీటీవీలో రిపోర్టర్‌గా 1996లో పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఎన్డీటీవీ హిందీ భాషలో తొలిసారి 24 గంటల చానల్‌ను ప్రారంభించడంతో అందులో ఆయన ప్రైమ్ టైమ్ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రైమ్ టైమ్ కార్యక్రమం ద్వారా అంతగా వెలుగులోకి రాని సామాన్యుల సమస్యలను దేశానికి చూపించే ప్రయత్నం చేశారని ఫౌండేషన్ పేర్కొంది. అనేక ఒత్తిడులు ఉండే మీడియా వాతావరణంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపింది. వాస్తవాల ఆధారిత రిపోర్టింగ్ పద్ధతులను ఆచరించేవారని, నైతికతతో తన వృత్తిని నిర్వహించేవారని వెల్లడించింది.

## వేతన కోడ్‌కు రాజ్యసభ ఆమోదం

- ఉద్యోగులకు కనీస వేతనం అందేలా ఏర్పాట్లు



**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేసే ప్రతి కార్మికుడికీ కనీస వేతనం అందించేందుకు వీలు కల్పించే వేతనాల కోడ్ –2019 బిల్లును రాజ్యసభ ఆమోదించింది. వేతనాలు, బోనస్‌లకు సంబంధించిన వివిధ నిబంధనలు, సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. ఇది చట్ట రూపం దాల్చితే దేశ వ్యాప్తంగా ఉన్న 50 కోట్ల మంది కార్మికులకు లాభం కలుగుతుందని కార్మిక మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ సభలో తెలిపారు. సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 85 మంది, వ్యతిరేకంగా 8 మంది ఓటేశారు. కనీస వేతనాల చట్టం, వేతన చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన ప్రతిఫలం చట్టం స్థానంలో ఇది అమల్లోకి రానుంది. ఈ బిల్లుకు లోక్‌సభ స్టాండింగ్ కమిటీ ప్రతిపాదించిన 24 సవరణల్లో 17 సవరణలను ప్రభుత్వం ఆమోదించిందని మంత్రి గంగ్వార్ తెలిపారు. అయితే, కనీస జీవన పరిస్థితుల ఆధారంగా కనీస వేతనాలను నిర్ణయించే అధికారాన్ని రాష్ట్రాల నుంచి తీసుకోబోమన్నారు. కార్మిక సంఘాలు, యజమానులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించే త్రిసభ్య కమిటీలే కనీస వేతనాలను నిర్ణయిస్తాయన్నారు. అదేవిధంగా, వేతనాల విషయంలో స్త్రీ, పురుష, ట్రాన్స్‌జెండర్లంటూ వివక్ష ఉండబోదన్నారు. వేతన పరిమితితో పనిలేకుండా అన్ని రంగాల కార్మికులకూ కనీస వేతనం సకాలంలో అందేలా నిబంధనలు పొందుపరిచామన్నారు. ప్రస్తుతం ఉన్న వేర్వేరు కార్మిక చట్టాలు వేతనానికి 12 రకాలైన నిర్వచనాలిచ్చాయని, దీంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తాజా బిల్లుతో ఇటువంటి సమస్యలుండవన్నారు. జూలై 30వ తేదీన ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది.

## 6 నుంచి అయోధ్య విచారణ

- మధ్యవర్తిత్వంతో పరిష్కారం కాలేదు
- రామజన్మ భూమి–బాబ్రీ మసీదు కేసుపై సుప్రీంకోర్టు





**న్యూఢిల్లీ:** రాజకీయంగా సున్నితమైన అయోధ్యలోని రామజన్మభూమి–బాబ్రీ మసీదు భూవివాదానికి మధ్యవర్తిత్వం పరిష్కారం చూపనందున ఇక ఈ కేసును తామే ప్రతి రోజూ విచారిస్తామని సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ఆగస్టు 6 నుంచి ప్రారంభించి విచారణను రోజూ బహిరంగంగా చేపడతామంది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్ఎంఐ ఖలీపుల్లా నేతృత్వంలోని త్రిసభ్య మధ్యవర్తిత్వ కమిటీ దాదాపు నాలుగు నెలలపాటు అయోధ్య కేసులో మధ్యవర్తిత్వానికి ప్రయత్నించినా ఫలితం రాలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదికను తాము చదివామనీ, సమస్యకు ఈ కమిటీ తుది పరిష్కారం చూపలేకపోయిందని పేర్కొంది. కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఇక తామే ఈ కేసును విచారించాలని నిర్ణయించినట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తెలిపింది. జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లు ఈ ధర్మాసనంలో ఇతర సభ్యులుగా ఉన్నారు. జూలై 31 నాటి వరకు మధ్యవర్తిత్వంలో ఎంత పురోగతి వచ్చిందో తెలిపే నివేదికను ఆగస్టు 1న తమకు సమర్పించాల్సిందిగా త్రిసభ్య మధ్యవర్తిత్వ కమిటీని కోర్టు జూలై 18నే ఆదేశించింది. కాగా, అయోధ్య కేసుపై ప్రతి రోజూ విచారణ జరుపుతామంటూ సుప్రీంకోర్టు చెప్పడాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) స్వాగతించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి న్యాయపరమైన చిక్కులు త్వరలోనే తొలగిపోతాయని తాము ఆశిస్తున్నామని ట్విట్టర్‌లో తెలిపింది.

### మధ్యవర్తిత్వంతో లాభం లేదు

త్రిసభ్య కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం, మధ్యవర్తిత్వంతో లాభం లేదనీ, కేసును తామే విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ ఎఫ్ఎంఐ ఖలీఫుల్లా ఈ త్రిసభ్య కమిటీకి నేతృత్వం వహిస్తుండగా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్‌తోపాటు సీనియర్ న్యాయవాది, మధ్యవర్తిత్వంలో పేరొందిన శ్రీరామ్ పంచు సభ్యులుగా ఉండటం తెలిసిందే. క్లిష్టమైన అయోధ్య సమస్యకు హిందూ, ముస్లిం వర్గాలకు అమోదయోగ్యమైన పరిష్కారం లభించడం లేదని త్రిసభ్య కమిటీ తన నివేదికలో పేర్కొంది. అయోధ్య కేసులో మధ్యవర్తిత్వానికి కోర్టు మార్చి 8న అనుమతినిచ్చింది. చర్చలను రహస్యంగా జరపాలనీ, 8 వారాల్లోగా పూర్తి చేయాలని అప్పట్లో గడువు విధించింది. అయితే సామరస్యక పరిష్కారం కనుగొనే దిశగా చర్చలు ఆశాజనకంగా సాగుతున్నాయనీ, మరికొంత సమయం కావాలని కమిటీ కోరడంతో, ఆగస్టు 15 వరకు కోర్టు గడువిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్‌లో కమిటీ ఈ చర్చలు జరిపింది. 16వ శతాబ్దంలో మీర్ బఖీ నిర్మించిన బాబ్రీ మసీదును 1992 డిసెంబర్ 6న కొందరు కూల్చేయడం తెలిసిందే.

### 20 రోజుల సమయం కావాలి...

ఈ కేసులో ముస్లింల తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ శుక్రవారం కోర్టులో వాదిస్తూ పలు సాంకేతికాంశాలను ప్రస్తావించారు. కేసులోని వివిధ అంశాలను సంపూర్ణంగా వాదించాలంటే తనకు ముందుగా కనీసం 20 రోజుల సమయం కావాలని ఆయన కోరారు. కేసులోని వివిధ అంశాలు, అప్పీళ్లను ఎలా విచారించాలో రాజీవ్ కోర్టుకు చెబుతుండగా, న్యాయమూర్తులు కలగజేసుకుంటూ 'మేము ఏం చేయాలో మీరు మాకు గుర్తుచేయాల్సిన అవసరం లేదు. కేసులో ఏయే అంశాలున్నాయో మాకు తెలుసు. వాటన్నింటిపై మేం విచారిస్తాం. ముందు విచారణ ప్రారంభం కానివ్వండి' అని అన్నారు. మధ్యవర్తిత్వ కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలు రహస్యంగానే ఉంటాయని కూడా కోర్టు స్పష్టం చేసింది.

సాక్షి

శనివారం, ఆగస్టు, 3

# వైద్యరంగం మేలుకేనా?!

భ్రష్టుపట్టిన వైద్య రంగానికి, వైద్య విద్యకు చికిత్స చేయడం కోసమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) బిల్లుకు గురువారం రాజ్యసభ కూడా ఓకే అనడంతో పార్లమెంటు ఆమోదం లభించినట్టయింది. ఈ బిల్లుకు వైద్యులు, వైద్య విద్యార్థులు మొదటి నుంచీ వ్యతిరేకం. నిరుడు జనవరిలో తొలిసారి లోక్‌సభలో దీన్ని ప్రవేశపెట్టినప్పుడు వారు దేశ వ్యాప్తంగా 12 గంటల సమ్మె చేశారు. సభలో సైతం వ్యతిరేకత వెల్లువెత్తడంతో అప్పట్లో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు. అయితే తాము ఆదినుంచీ వ్యతిరేకిస్తున్న పలు అంశాలు ఇప్పటికీ ఈ బిల్లులో ఉన్నాయన్నది వైద్యులు, వైద్య విద్యార్థుల ప్రధాన ఆరోపణ. ఈమధ్యకాలంలో ఈ స్థాయిలో వివాదాస్పదమై, తీవ్ర నిరసనలు వ్యక్తమైన బిల్లు ఇదే. ఈ బిల్లు ముసాయిదా రెండేళ్ల క్రితం వెల్లడైనప్పుడు ఇది తమకు సమ్మతం కాదని వైద్యరంగ నిపుణులు, విద్యార్థులు తేల్చి చెప్పారు. అదే సమయంలో భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) పని తీరు సక్రమంగా లేదన్న విషయంలో అందరికీ ఏకీభావం ఉంది. కానీ దాని స్థానంలో తీసుకొచ్చిన ఎన్ఎంసీ సైతం లొసుగుల మయం అయితే ఎలాగన్నది వారి ప్రశ్న. తమ అభ్యంతరాల తర్వాత కేవలం కొన్ని నిబంధనలు మాత్రమే స్వల్పంగా మారాయని వారంటున్నారు.

పాత బిల్లు స్థాయీ సంఘం పరిశీలనకెళ్లాక ప్రధానంగా అందులో రెండు మార్పులు చేశారు. ఎంబీబీఎస్ పూర్తయ్యాక పట్టా ఇచ్చేముందు విడిగా పెట్టదల్చిన పరీక్షను రద్దు చేశారు. కానీ అదే సమయంలో ఆఖరి సంవత్సరం 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్'(నెక్స్ట్) పేరిట ఉమ్మడి పరీక్ష నిర్వహించాలని, అందులో కృతార్థులైనవారే వైద్య వృత్తిలో ప్రవేశించేందుకైనా, పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశం కోరడానికైనా అర్హులని బిల్లులోని సెక్షన్ 15(1) చెబుతోంది. పీజీ కోర్సులకోసం నిర్వహించే ఇప్పుడున్న నీట్ పరీక్ష రద్దును వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు వ్యతిరేకిస్తున్నారు. హోమియోతో పాటు భారతీయ వైద్య విధానాలను ప్రాక్టీస్ చేసేవారికి 'బ్రిడ్జి కోర్సు' పెట్టి వారు రోగులకు అల్లోపతి మందుల చీటీలు రాయడాన్ని అనుమతించే పాత నిబంధన తొలగించారు. అయితే 'బ్రిడ్జి కోర్స్' అనే మాట లేదు తప్ప సామాజిక వైద్య సహాయకుల(సీహెచ్‌పీ) పేరిట కొత్త నిబంధన ఏర్పరిచారు. శిక్షణ పొందాక మండలాల స్థాయిలో వీరు అల్లోపతి ఔషధాలను ఒక స్థాయి వరకూ రోగులకు సూచించవచ్చునని చెబుతున్న నిబంధన వల్ల గ్రామీణ ప్రాంత వైద్య ఆరోగ్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందన్నది వైద్యులు, వైద్య విద్యార్థుల వాదన. ఇందులో నిజముంది. మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన, ప్రామాణికమైన వైద్య సేవలందితే నిరుపేద జనం ప్రాణాంతకమైన దీర్ఘ రోగాల బారినపడే అవకాశాలుండవు. వైద్యుల వద్ద కాంపౌండర్లుగా పనిచేసినవారో, ఇతరత్రా కోర్సులు చేసినవారో వైద్యులుగా అవతారమెత్తి ఇష్టానుసారం మందులు రాస్తుండటం వల్ల ఇప్పటికే ఎన్నో సమస్యలొస్తున్నాయి. కొత్తగా ఏర్పరిచే వ్యవస్థ ఈ స్థితిని నిర్మూలించకపోగా, దాన్ని చట్టబద్ధం చేసే ప్రమాదం కనబడుతోంది. ఈ నిబంధన పర్యవసానంగా కొత్తగా రంగంలో కొచ్చే మూడున్నర లక్షలమంది సీహెచ్‌పీలు తమకున్న పరిధులు అతిక్రమించరన్న గ్యారెంటీ లేదు. ఒకపక్క అయిదేళ్లపాటు వైద్య విద్య అభ్యసించినవారికి పట్టా ఇవ్వడం విషయంలోనే తీవ్ర మార్పులు చేసినవారు... వైద్య విద్యతో సంబంధంలేనివారిని సీహెచ్‌పీలుగా ఉదారంగా అనుమతించడం ముమ్మందు సమస్యలకు దారితీసే అవకాశం లేకపోలేదు. నిజానికి ఈ నిబంధన తొలగించాలని స్థాయీ సంఘం సూచించింది. అయినా జరిగిందేమీ లేదు.

ఇక వైద్య విద్యకు సంబంధించిన నిబంధనలు కూడా విమర్శలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు మెడికల్ కళాశాలలు, డీమ్డ్ వర్సిటీల్లో 50 శాతం సీట్లకు సంబంధించిన ఫీజుల్ని నియంత్రించే నిబంధన వల్ల మిగిలిన 50శాతం సీట్లకూ వారు ఇష్టానుసారం ఫీజులు నిర్ణయించే ప్రమాదం ఉంటుంది. సారాంశంలో ఇది వైద్య విద్యను ప్రైవేటీకరించడమే అవుతుంది. 75శాతం సీట్లకు సంబంధించిన ఫీజుల్ని నియంత్రించే విధానం ఉన్నప్పుడే సాధారణ కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకూ, ప్రతిభ గల విద్యార్థులకూ వైద్య విద్య అందుబాటులో ఉంటుంది. అయితే ఎన్ఎంసీ పరిధిలోకి రాని మిగిలిన 50 శాతం సీట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఫీజుల్ని నియంత్రించుకోవచ్చునని ప్రభుత్వం అంటోంది. కానీ ఇది ఆచరణ సాధ్యమవుతుందా? ఎన్ఎంసీలో ఉండే సభ్యులకు సంబంధించిన నిబంధనలో కొంత మార్పులు చేశారు. ఇప్పుడున్న నిబంధన ప్రకారం కేంద్రం 14మందిని నామినేట్ చేస్తుంది. రాష్ట్రాల నుంచి పదిమంది ఉంటారు. వీరుగాక 9మంది స్వతంత్ర సభ్యులుంటారు. అయితే మొత్తంగా వైద్యరంగాన్ని పర్యవేక్షించే వ్యవస్థను ఆ రంగంలోని నిపుణులకే విడిచిపెట్టడం ఉత్తమం. ఆ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వాలు నామినేట్ చేసేవారే అధికంగా ఉంటే ఆ రంగానికి చెందిన నిపుణుల సూచనలు వీగిపోతాయి. దీన్ని గురించి ఆలోచించి ఉంటే బాగుండేది. అయితే ఎన్ఎంసీ పరిధికింద నాలుగు బోర్డులు ఏర్పాటు చేయడం ఒక రకంగా మంచిదే. దీని ప్రకారం డిగ్రీ స్థాయి విద్య కోసం ఒకటి, పీజీ విద్యా వ్యవహారాలు చూసేందుకు మరొకటి బోర్డులు ఏర్పాటవుతాయి. ఇక వైద్య కళాశాలల పనితీరు మదింపు వేయడం, వాటికి రేటింగ్ నిర్ణయించడంవంటివి పర్యవేక్షించడానికి ఒక బోర్డు, ఈ రంగంలో నైతిక విలువల పరిరక్షణకు, రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూసేందుకు మరొక బోర్డు ఏర్పాటవుతాయి. ఇన్నాళ్లూ అన్నిటినీ ఒకేచోట కేంద్రీకరించడంవల్ల పర్యవేక్షణ లోపం మాత్రమే కాదు... అవినీతి కూడా ఊడలు వేసిందని అందరూ అనుకుంటున్నదే. మొత్తానికి ఎన్నో ఏళ్ల తర్వాత సమగ్రమైన మార్పులు చేయడానికంటూ తీసుకొచ్చిన బిల్లు సైతం ఆ రంగంలోనివారికి పెద్దగా సంతృప్తినీయకపోవడం విచారకరం. ఈ విషయంలో కేంద్రం మరిన్ని సంప్రదింపులు జరిపి ఉంటే బాగుండేది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.తదియ రా.2.03 వరకు, తదుపరి చవితి, నక్షత్రం మఖ ఉ.10.34 వరకు, తదుపరి పుబ్బ వర్జ్యం సా.6.11 నుంచి 7.29 వరకు, దుర్ముహూర్తం ఉ.5.43 నుంచి 7.23 వరకు, అమృతఘడియలు... ఉ.8.19 నుంచి 9.49 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# నేర రాజకీయాల పర్యవసానం!



శేఖర్ గుప్తా

**హిందీ ప్రాబల్యప్రాంతంలో ముగ్గురు ప్రత్యేక నేతలు కులదీప్ సింగ్ సెంగార్, సంజయ్ సింహ్, సాక్షి మహరాజ్ సింగ్. వక్రమార్గం పట్టిన భారత రాజకీయాలకు వీరు సమకాలీన ప్రతీకలు. రాజకీయ ఫిరాయింపులు, నేరమయ రాజకీయాలు, అవినీతి, హత్యలు, అత్యాచారాలు, దోపిడి, వంచన వంటి సమస్త అనైతిక చర్యల కలబోత వీరు. ఈ లక్షణాలను కలిగి ఉంటూనే గత మూడు దశాబ్దాలుగా వారు ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో వెలుగొందుతున్నారు. భారత రాజకీయాల గురించి వీరు మనకు చెబుతున్నదేమిటి? మొదటిది ఏమిటంటే గెలుపుతత్వం ఒక్కటే రాజకీయ నీతిగా మారి పార్టీలు దాన్ని మాత్రమే చూస్తున్నాయి. నేరతత్వం, లెక్కలేనన్ని అత్యాచారాలకు పాల్పడటం అనేవి ఎవరూ లెక్కించలేదు. హిందీ ప్రాబల్య ప్రాంతంలో గెలుపుతత్వానికి సంబంధించిన లక్షణాలు... కులం, స్థానిక ఓటు.. ఇవి ఉంటే ఏమైనా చేయవచ్చు.**

కులదీప్ సింగ్ సెంగార్, సంజయ్ సింహ్, సాక్షి మహరాజ్ సింగ్ అనే ఈ ముగ్గురి బాగోతాలను కాస్త పరిశీలించండి. వర్తమాన రాజకీయాలు, పోలీసింగ్, న్యాయవ్యవస్థ, బీజేపీ తీరు తెన్నులను అచ్చుగుద్దినట్లు వెల్లడించే గాథలు వీరి సొంతం మరి. ఈ ముగ్గురు ఫిరాయింపుదార్లే ఇవాళ మన రాజకీయసంబంధిత ప్రధాన శీర్షికలలో వెలిగిపోతున్నారు. వీరిలో మొదటివారు, అపఖ్యాతిని మూట గట్టుకున్నవారు అయిన కులదీప్ సింగ్ సెంగార్ ఉన్నావ్ అత్యాచార –హత్యా కేసుల్లో మునిగితేలుతున్నారు. ఇక రెండోవారు అమేథీ మాజీ రాజా, ఎంపీ, మాజీ మంత్రి సంజయ్ సింహ్. మునిగిపోతున్న కాంగ్రెస్ నావ నుంచి ఫిరాయించి బీజేపీలోకి గెంతేశారు. మూడవవారు సాక్షి మహరాజ్. పార్లమెంటరీ ఎన్నికలల్లో ఉన్నావ్ నియోజకవర్గ ఎంపీగా గెలిచారు. ఈయన రాజకీయంగానూ, నేరపూరితంగానూ ఇటీవలి కాలంలో పెద్దగా తప్పు చేసిందేమీ లేదు. అడపాదడపా చేసే కువ్యాఖ్యలు, అప్రతిష్టాకరమైన మాటలకు మాత్రమే తనది బాధ్యత. లోక్‌సభ ఎన్నికల్లో తనకు పూర్తి మద్దతునిచ్చినందుకుగానూ జైలుకెళ్లి మరీ సెంగార్‌కి కృతజ్ఞతలు చెప్పివచ్చిన పెద్దమనిషి ఇతడు.

ఈ ముగ్గురు నేతలూ తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించారనే చెప్పాలి. వీరిపై పూర్తిగా లేక పాక్షికంగా పరిష్కృతం కాని హత్యానేరాలు ఆరు ఉన్నాయి. లేక హత్యా నేరారోపణల్లో వీరికి పాత్ర ఉంది. వీరు చేసిన హత్యల్లాగే మరో మూడు అత్యాచార కేసులు కూడా ఇంకా కొలిక్కి రాలేదు. పైగా ఈ ముగ్గురికీ ఇప్పటికీ మంచి డిమాండ్ ఉంటోంది. తమ సొంత కులానికి చెందిన ఓట్లు వీరు గుప్పిట్లోనే ఉంటున్నాయి. పైగా డబ్బు ఆశ చూపి ఓట్లు రాబట్టడం కూడా తెలుసు. చట్టాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి కొట్టినపిండి. అన్ని రాజకీయ పార్టీలు తమనే కోరుకునే ప్రత్యేక గుణాలు వీరి సొంతం. యోగ్యత, నిజాయతీ, నైతికత ఇవి లేకున్నా గెలుపు సాధించడం కూడా వీరికి తెలిసిన విద్యే. ఎట్టకేలకు ఈ ముగ్గురూ బీజేపీలో కలిసిపోయారు. 48 గంటలకు ముందుగా సెంగార్‌పై బీజేపీ బహిష్కరణ వేటు వేసింది. నేరస్తుడిగా, డాన్‌గా లేక బాహుబలిగా (హిందీ ప్రాబల్య ప్రాంతంలో ఇతడిని ఇదే పేరుతో పిలుస్తారు) ఇతడి జీవితం నేరపూరితమైందని మనకు స్థిరమైన అభిప్రాయం ఉంది. అందుకనే వైవిధ్యపూరితమైన, వర్ణరంజితంతో కూడిన అతడి జనరంజక ప్రజా జీవితం గురించి, మనం నిర్లక్ష్యం వహిస్తున్నాం. 2002లో స్థానిక దాదాగా ఉన్న ఇతడు తొలిసారిగా బీఎస్పీ తరపున నిలిచి ఉన్నావ్ నుంచి గెలుపొందారు.

అతడు మొదట్లో సమాజ్‌వాదీ పార్టీలోకి ఫిరాయించాడు. 2007, 2012లో బంగేర్‌మావు, భాగవత్ నగర్ నియోజకవర్గాలనుంచి గెలుపొందారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రత్యేకించి యాదవులు, రాజపుత్రులకు చెందిన మాఫియా నేరస్తులను సమాజ్‌వాది పార్టీ పెంచి పోషించేదని అందరూ అంగీకరిస్తారు. అయితే 2017లో మారుతున్న పరిణామాలను గమనించి బీజేపీలోకి చెక్కేసి అక్కడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే సంవత్సరం అంటే బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన మూడునెలలకు ఆ దురదృష్టపు అమ్మాయి ఉద్యోగం కోసం సహాయం చేయమంటూ అతడి వద్దకు వచ్చినప్పుడు అతడు తనపై అత్యాచారం సల్పాడని ఆరోపించింది. ఆ తర్వాత తన కన్నీళ్లు తుడిచి, సహాయం చేస్తానని, ఉద్యోగం వెదికి పెడతానని మాట ఇచ్చాడని పేర్కొంది.

ఇక సంజయ్ సింగ్ విషయానికి వస్తే చాలా పార్టీలు మారాడు. బాగా పేరొందిన ఒక హత్య కేసులో అతడికి సంబంధముందని ఆరోపణలు వచ్చాయి. తర్వాత అవి వీగిపోయాయనుకోండి. జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్ సయ్యద్ మోదీని 1988 జూలై 28న సుపారీ ఇచ్చి మరీ చంపించిన ఘటనలో సంజయ్ ప్రధాన అనుమానితుడు. అయితే దీనికి సాక్ష్యాధారాలు కనుగొనడంలో యూపీ పోలీసు శాఖ, సీబీఐ రెండూ విఫలమైనందున కేసు వీగిపోయింది. నేరం రుజువయ్యేంతవరకు నిందితుడు అమాయకుడేనని మనం అంగీకరిస్తాం కదా. తుపాకులతో కాల్చడం వాస్తవం, హత్య జరగడం వాస్తవం కానీ ఎవరు ఆ పనికి ప్రేరేపించారో తెలీదు. కనుగొనలేదు. ఆ కేసులో ఒక హంతకుడికి శిక్షపడింది. మరొకరు విచారణ సమయంలోనే చనిపోయాడు.

ఆ హత్య జరిగిన కొంతకాలానికే సయ్యద్ మోదీ భార్య అమీతా మోదీని సంజయ్ సింగ్ పెళ్లాడాడు. ఈ హత్యకేసు విచారణను సీబీఐకి అప్పగించిన సమయంలోనే వీపీసింగ్ కాంగ్రెస్‌కి ఎదురుతిరిగి తానే ప్రధానమంత్రి అయ్యారు. సంజయ్ సింగ్‌కు వీపీసింగ్ దూరపు బంధువు కావడంతో సంజయ్ కూడా కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి తన మామయ్య చెంత చేరాడు. సరిగ్గా దశాబ్దం తర్వాత ఇతడు బీజేపీలోకి మారాడు. 1988లో అమేథీనుంచి గెలిచి కాంగ్రెస్ నేత సతీష్ శర్మను ఓడించాడు. కానీ వాజ్‌పేయి ప్రభుత్వం లోక్‌సభలో ఒక ఓటు తేడాతో ప్రభుత్వాన్ని కోల్పోయింది. తర్వాత 1999 ఎన్నికల్లో సంజయ్ సింగ్ ఒకప్పటి తన స్నేహితుడు, బోధకుడు అయిన రాజీవ్ గాంధీ సతీమణి సోనియాపైనే రాయ్‌బరేలీలో బీజేపీ తరపున పోటీ చేశాడు. ఎందుకైనా మంచిదని సోనియా దక్షిణాదిలో బళ్లారి నుంచి కూడా పోటీకి తలపడ్డారు. ఆ నేపథ్యంలో సంజయ్ సింగ్‌ను చూసి భీతిల్లిన సోనియా బళ్లారికి పారిపోయిందంటూ నినాదం పుట్టుకొచ్చింది. కానీ సోనియా రెండు చోట్లా గెలిచారు. అయితే గాలి మళ్లీ కాంగ్రెస్ వైపు తిరుగుతుందని గ్రహించగానే సంజయ్ సింగ్ 2003లో మళ్లీ కాంగ్రెస్‌లోకి దూకాడు. 2009లో రాయ్ బరేలీ, అమేథీ పక్కన ఉండే సుల్తాన్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచాడు. అయిదేళ్లు గడిచాక 2014లో యూపీలో కాంగ్రెస్ ఊచకోతకు గురయ్యాక అసోం నుంచి కాంగ్రెస్ తరపున రాజ్యసభ సభ నామినేషన్ గెల్చుకున్నాడు. ఇక 2019లో ఈ టర్మ్ కూడా ముగిశాక, గాంధీ కుటుంబం పని పూర్తయ్యాక, మళ్లీ బీజేపీలో కొత్త మామయ్యలను వెదికి పట్టి దూరిపోయాడు.

ఇక సాక్షి మహరాజ్. బీజేపీ మాజీ సీఎం కల్యాణ్ సింగ్ కులానికి చెందిన వెనుకబడిన లోధ్ కమ్యూనిటీలో స్టార్‌లాగా ఎదిగివచ్చాడు. 1991, 96 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ తరపున గెలిచాడు. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనలో నిందితుడైన సాక్షి మహరాజ్ సైద్ధాంతిక పవిత్రత ఉన్నవాడిగా కనిపిస్తాడు. కానీ అతని నిబద్ధత బీజేపీనుంచి మళ్లీ టికెట్ సాధించలేకపోయింది. తనకు టికెట్ ఇవ్వలేదు కాబట్టి బీజేపీ పేదల వ్యతిరేక పార్టీగా మారిపోయిందని ఆరోపిస్తూ సమాజ్‌వాదీ పార్టీలోకి చెక్కేశాడు. అసలు కారణం ఏమిటంటే నాటి ప్రధాని వాజ్‌పేయి సన్నిహితుడైన బ్రహ్మదత్ ద్వివేదీ హత్య కేసులో సాక్షి ఒక నిందితుడు. 2000 సంవత్సరంలో ములాయం సింగ్ యాదవ్ అతడిని రాజ్యసభకు పంపారు. ఈ క్రమంలో తనపై పాత హత్యా కేసు వీగిపోయింది. అయితే తర్వాత కూడా అలాంటి నేర చర్యలనుంచి పక్కకు తప్పుకోలేదు. తన తోటి మేనల్లుళ్లతో కలిసి ఒక కాలేజీ ప్రిన్సిపాల్‌పై సామూహిక అత్యాచారం జరిపిన కేసులో బుక్కయ్యాడు. 2002 నాటికి సమాజ్ వాదీ పార్టీ రంగు వెలిసిపోతోందని గ్రహించాక ములాయంపైనే బోలెడు ఆరోపణలు గుప్పించి బీజేపీ తిరుగుబాటు నేత కల్యాణ్ సింగ్ స్థాపించిన రాష్ట్రీయ క్రాంతి పార్టీలో చేరిపోయాడు. ఇది లోధీల పార్టీ అని చెప్పనక్కరలేదు. తర్వాత కూడా సాక్షి హవా కొనసాగింది. ఒక నకిలీ ఎన్జీవో సంస్థను స్థాపించి అక్రమంగా రూ.25 లక్షలను వసూలు చేసిన కేసులో నాటి ప్రభుత్వం సాక్షిపై ఆరోపణలు చేసింది. ఇతడితోబాటు తన అనుయాయి అయిన సుజాత వర్మను కూడా ఈ కేసులో నిందితులుగా ఆరోపించారు. 2012లో సాక్షి మహరాజ్ మళ్లీ బీజేపీలో చేరాడు. కొద్దికాలంలోపే సుజాత వర్మ హత్యకు గురయ్యారు. సాక్షి అనుయాయులే హంతకులుగా ఆరోపణలకు గురయ్యారు.

ఈ కేసులో సాక్షి మహరాజ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తర్వాత లొంగిపోయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. తనపై ఎఫ్ఐఆర్‌ని కొట్టివేయాలని అలహాబాద్ హైకోర్టులో ఇతడు వేసిన పిటిషన్‌ని కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాతి సంవత్సరం బీజేపీ నుంచి లోక్‌సభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాడు. అలా అతడి గౌరవాన్ని మళ్లీ నిలబెట్టారు. ఇంతటి నేరమయ కెరీర్ కలిగిన సాక్షి మహరాజ్‌ని సీతాపూర్ జైలుకెళ్లి తన గెలుపుకు దోహదం చేసిన కులదీప్ సింగ్ సెంగార్‌కు ధన్యవాదాలు చెప్పాడంటూ మనం అమాయకంగా ఆరోపిస్తున్నాం మరి. భారత రాజకీయాల గురించి వీరు మనకు చెబుతున్నదేమిటి? గెలుపుతత్వం ఒక్కటే రాజకీయ నీతిగా మారి పార్టీలు దాన్ని మాత్రమే చూస్తున్నాయి. నేరతత్వం, లెక్కలేనన్ని అత్యాచారాలకు పాల్పడటం అనేవి ఎవరూ లెక్కించలేదు.

హిందీ ప్రాబల్య ప్రాంతంలో గెలుపుతత్వానికి సంబంధించిన లక్షణాలు ఏమిటి? స్థానిక వోటు బ్యాంకును నిర్మించుకోవడం. దానికి కులం, మాఫియా ప్రాతిపదిక కావటం. రెండూ కలిసివుంటే మరీ మంచిది. అప్పుడే మీరు గెలిచే వ్యక్తి కాగలరు. లేదా ఇతరుల గెలుపుకు, ఓటమికి ముఖ్య పాత్ర కాగలరు. అప్పుడు అన్ని పార్టీలు మీకోసం క్యూ కడతాయి. వాటిలో గెలిచే పక్షమేదో మీరు సంతోషంగా ఎంచుకోవచ్చు. ఈ క్రమంలో మీరు ఏమైనా చేయవచ్చు. హత్య, అత్యాచారం, దోపిడీ, దొమ్మీ, మోసం, దురాక్రమణ దేనికైనా మీరు పాల్పడవచ్చు. చిన్నస్థాయి నుంచి వచ్చిన ఒక టీనేజ్ బాలిక వెంటిలేటర్ గుండా శ్వాస పీల్చుకుంటున్న స్థితిలో, ఆమె తండ్రితోపాటు కుటుంబంలోని చాలామంది హత్యకు గురైన స్థితిలో మీ ప్రాభవం మొత్తం క్షణాల్లో కరిగిపోవచ్చు. ఉన్నావ్ ఘటన రగిలించిన న్యాయం ఇదే మరి.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

## జాతిహితం



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

### ఇప్పుడే..



"రైతులంతా ఆత్మహత్యలకు పాల్పడుతుంటే దేశంలోని వ్యాపారవేత్తలెవరూ మాట్లాడటానికి ముందుకు రాలేదు. లక్షలాదిమంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయినప్పుడు, సమాచార హక్కు కార్యకర్తలు హత్యలకు గురైనప్పుడు కూడా వారెవరూ నోరు మెదపలేదు. ఇప్పుడు ఒక వ్యాపారవేత్త ఆత్మహత్య చేసుకోగానే దేశంలోని పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉన్నాయో వారికి తెలిసి వచ్చింది"

– నిఖిల్ వాగ్లే, జర్నలిస్ట్

### అదిచాలు



"కూలిపోతున్న ఆర్థిక వ్యవస్థను కాపాడటానికి ఏమైనా చేయమని దేశ ప్రజలు ప్రధానిని కోరడం చిత్రంగా ఉంది. కొత్త ప్రభుత్వానికి ఇది మొదటి ఏడాదే. ఎన్నికలకు ముందు 2024లో పాక్‌లోని కొన్ని చెట్లపై బాంబుల వర్షం కురిపిస్తారు. అంతే, దాంతో అంతా సర్దుకుంటుంది"

– వీణా వేణుగోపాల్, రచయిత్రి

### కష్టం



"గత వారం రోజుల్లో ప్రభుత్వం 38వేల మంది సైనికులను కశ్మీర్‌కు తరలించింది. భద్రతాపరమైన సమస్యలున్నాయని తెలిసినప్పుడు అమర్‌నాథ్ యాత్రను ముందే నిలిపివేసి ఉండాల్సింది. హఠాత్తుగా యాత్రికులను వదిలివెళ్లమనడం చాలా ఇబ్బందికరం. ముఖ్యంగా వృద్ధులకు చాలా కష్టం"

– షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

### ముసుగు



"ప్రేమతో ముస్లింలు అధికంగా ఉండే ఒక్క రాష్ట్రాన్ని కూడా గెలుచుకోలేక పోయారు. మత ప్రాతిపదికన విభజించడాన్ని తిరస్కరించి లౌకిక భారత్‌ను మాత్రమే వారు కోరుకున్నారు. చివరికి ముసుగులు తొలగిపోయాయి. కశ్మీరీలకు ఏది లభించినా, అది వారి స్వదేశమైన భారత్ నుంచే అని ముఫ్తీ సహేబ్ ఎప్పుడూ చెబుతూండే వారు. ఇప్పుడు వారి ప్రత్యేకమైన గుర్తింపును కాపాడుకోవడానికి ఉన్న కొద్దిపాటి అవకాశాలను దోచుకోవడానికి వారి దేశమే సన్నాహాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది"

– మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధినేత

### గందరగోళం



"పుకార్లేనా? ఊహాగానాలేనా? తాము ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వమే తిరస్కరిస్తోందా? కానీ, అసలే సంక్షోభంలో ఉన్న కశ్మీర్‌లో అందరూ కలిసి భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. గందరగోళాన్ని, అస్థిరతను కలిగిస్తున్నవారికి అది మంచిది కాదు"

– సీమా ముస్తాఫా, కాలమిస్ట్

# న్యాయం చేశారా.. కక్ష తీర్చుకున్నారా?

తమకు మంచి జరగడం కంటే ఎదుటి వారికి కీడు జరిగేలా చేసి ఆనందం పొందటం అనేది ఒక మానసిక దౌర్బల్యం. అలా ఆనందం పొందే తరహా మానసిక స్థితి సమాజానికి చాలా ప్రమాదకరం. ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించుకోవడం ద్వారా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం మహిళలకు న్యాయం చేసిందా లేక కక్ష తీర్చుకుందా అనేది పెద్ద ప్రశ్న. అకస్మాత్తుగా ముస్లిం మహిళలపై ప్రధానికి గానీ, సంఘ పరివారానికి గానీ ఇంత ప్రేమ, ఇంత దయ ఎక్కడి నుండి పుట్టుకొచ్చిందో? ఏకబిగిన తలాక్ తలాక్ తలాక్ అని మూడుసార్లు చెప్పి వివాహ బంధాన్ని తెంచుకుని మహిళని వదిలించుకోవడాన్ని ఎవరూ సమర్థించరు. ముస్లింలలో ఇదొక సామాజిక దురాచారం. దీనిని ముస్లిం సమాజం నుంచి పారదోలాలి. అయితే ఆ దురాచారాన్ని వదిలించడానికి అనుసరించే పద్ధతులు ముస్లిం సమాజాన్ని భయభ్రాంతులకు గురి చేసేవిగా ఉండకూడదు. ట్రిపుల్ తలాక్ అనేది ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఉత్పన్నమైన ఒక ప్రత్యేక వెసులుబాటు. అలాంటి ప్రత్యేక పరిస్థితులు ఇప్పుడు లేవు కాబట్టి తక్షణ ట్రిపుల్ తలాక్ కూడా అవసరం లేని మాట వాస్తవం. స్వల్ప పరిమాణంలో ఈ ఆచారాన్ని దుర్వినియోగం చేస్తున్న దాఖలాలను సాకుగా చూపెట్టి ముస్లిం సమాజంపైన దాడికి దిగడం సరైంది కాదు.

వివాహం, విడాకులు, ఆస్తుల పంపకాలు, దత్తత, వారసత్వం వంటివన్నీ పౌర న్యాయం కింద కేసులుగా పరిగణిస్తాయి. విడాకులు ఇవ్వడం నేరంగా ఏ'సివిల్ లా'లోనూ లేదు. కానీ ప్రస్తుతం పార్లమెంటులో ఆమోదించిన బిల్లు తలాక్ చెప్పినటువంటి వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధించే వెసులుబాటును కల్పించింది. ఒకవైపు ట్రిపుల్ తలాక్ రద్దు చేస్తున్నామని చెబుతూనే భార్యాభర్తలను శాశ్వతంగా విడదీసే ఏర్పాట్లు ఈ బిల్లులో ఉన్నాయి.

ట్రిపుల్ తలాక్ వంటి దురాచారాన్ని నిరోధించేందుకు చట్టాలను ఉపయోగించి, కౌన్సెలింగ్ నిర్వహించి భార్యాభర్తలు కలిసి జీవించేలా చేయాలి. అంతేగానీ క్రిమినల్ కేసులు పెట్టి, జైళ్లకు పంపడం ద్వారా భార్యాభర్తల మధ్య మరింత అగాధం సృష్టించడానికి తోడ్పడేదిగా ఈ బిల్లు ఉంది. ముస్లిం మహిళలకు న్యాయం చెయ్యడం కంటే ఈ బిల్లు వలన ముస్లిం సమాజాన్ని వేధించడానికి తీసుకొచ్చిందిగా భావించడానికి ఇదే కారణం. ముస్లిం మహిళల కంటే ముందే సంఘ్ పరివారం సంబరాలు జరుపుకుంటున్నది ఇందుకోసమే.

మహమ్మద్ అబ్బాస్, ఆవాజ్ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మొబైల్ : 94900 98032

# అమ్మో! పులులు పెరిగాయ్!?



శ్రీరమణ

ఈ మధ్య రెండు మూడు రోజులుగా పులుల ప్రస్తావన ఎక్కువైంది. ఎక్కడ విన్నా ఇదే టాపిక్ అయిపోయింది. పేపర్లలో పతాక శీర్షికలెక్కాయి పులులు. దేశంలో పులుల సంఖ్య అధికంగా మూడో వంతు పెరిగిందని, గ్రాఫ్ గీతలతో సహా చూపించారు. ఇదంతా మోదీ హయాంలోనే మోదీ అవిరళ కృషితోనే సాధ్యపడిందన్నట్టు తెగ వార్తలొచ్చాయ్. నాకసలు అనుమానం వచ్చింది. ఏమిటి నిజం పులుల గురించా, బీజేపీ పులుల గురించా అని సందేహం వచ్చింది.

ఒక్కోసారి టెన్నిస్ ఆటగాళ్లని 'టైగర్స్' అంటుంటారు. ఆ ఉద్యమం నడిచినన్నాళ్లూ శ్రీలంకలో 'తమిళ పులులు'గా వ్యవహరించేవారు. కిందటి ఎన్నికల్లో పెరిగిన సంఖ్యని దృష్టిలో పెట్టుకుని, పెరిగిన పులుల సంఖ్యగా చెబుతున్నారనుకున్నా. కొన్ని వేలమంది, కొన్ని వేల కెమెరాలు శ్రమించి పులుల సంఖ్యని నిర్ధారించారు. మోదీకి అసలు తను కిందటి జన్మలో 'బెంగాల్ టైగర్' అయి ఉండ వచ్చని గట్టి విశ్వాసం. అందుకే ఆయనకి పులిమీద పిచ్చి ఇష్టమని కొందరంటుంటారు. కనుకనే వాటి అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారని మరికొందరి నమ్మకం.

పులి అంటే ధీమా. పులి అంటే పంజా. పులి అంటే చచ్చే భయం. సింహానికి ఠీవి ఎక్కువ. పులికి దూకుడెక్కువ. పులి ఏం తోస్తే అది వెనకా ముందూ చూడకుండా చేస్తుంది. తర్వాత సింగిల్‌గా గుహలో కూచుని బాధపడి, ఎవరికీ వినిపించకుండా చిన్నగా గాండ్రించి, పంజాతో వెన్ను తడుముకుని ముందుకి నడుస్తుంది. సింహం అలా కాదు. మధ్యమధ్య ఠీవిగా వెనక్కి తిరిగి చూసుకుంటుంది. అది తప్పైనా ఒప్పైనా. ఒక్కోసారి అదీ ఏనుగులద్దె తొక్కుతుంది. జూల్లో ఈగలు వాలి దాన్నీ చికాకు పెడతాయి. వాటిని దర్జాగానే సంబాళించుకుని, 'లయనిజమ్'కి భంగం రాకుండా కాపాడుకుంటుంది. ఒక్కసారి జూలు విదిల్చుకుని ఠీవినొకసారి రీచార్జ్ చేసుకుని వెనక్కి తిరిగిచూసి అడవి దద్దరిల్లేలా గర్జిస్తుంది. దీన్నే సింహావలోకనం అంటారు. సమస్త జీవ రాశి ఆ గర్జనకి ఉలిక్కిపడుతుంది గానీ జూలులో ఆడుకుంటున్న ఈగలు మాత్రం నవ్వుకుంటాయ్. పులి చర్మాన్ని తపోధనులు ఆసనంగా వాడతారు. తల, పులిగోళ్లు యథాతథంగా ఉండి తపస్సుకి ఓ నిండుతనం చేకూరుస్తాయ్.

మోదీ కూడా యోగాసనాలు, పెద్ద నిర్ణయాలు పులి చర్మంమీద కూచునే తీసుకుంటారని కొందరంటారు. పులి చర్మం సృష్టిలో ఒక విచిత్రం. భూమ్మీద ఏ రెండు చర్మాలూ ఒక్కలా ఉండవట. చుక్కలు, ఆ వైఖరి దేనికదే ప్రత్యేకం. విశ్వనాథ సత్యనారాయణకి పులి చాలా అభిమాన జంతువు. ఆకాశంలో ఇంద్రధనుస్సుని పులి తోకతో పోలుస్తారాయన. 'పులిముగ్గు' పేరుతో ఓ మంచి నవల రాశారు. నిజంగా ఇప్పుడు మోదీ పుణ్యమా అని పులుల సంఖ్య పెరిగిందంటే విశ్వనాథ ఆనందపడి మోదీని మధ్యాక్కరలతో మెచ్చుకొనేవారు. ప్చ్... ప్రాప్తం లేదు.

ఎంతైనా సింహానికున్న రుజువర్తన పులికి లేదంటారు. ఒక్కోసారి పులి నక్కలా ప్రవర్తిస్తుందని అడవి జీవితం తెలిసిన వాళ్లంటారు. పులిమీద బోలెడు లిటరేచర్ వచ్చింది. అనేక కథలు వచ్చాయ్. ఒక పులికి నిండుగా వృద్ధాప్యం వచ్చేసింది. పులులకి వృద్ధాశ్రమాలు ఉండవు కదా. చచ్చేదాకా దాని బతుకు అది బతకాల్సిందే. లేళ్ల గుంపుల్ని వేటాడిన పులి అడుగుల నడకే గగనంగా ఉంది. క్షుద్బాధ తీరేదెలా? కుందేళ్లు నోట్లోకి రావుకదా. ఇంతకుముందు రాజుగారిని తిన్నప్పుడు మిగిలిన బంగారు కడియం పులి పంజాకి ధరించి తిరుగుతోంది. చెరువు పక్కన ఓ చెట్టు నీడన కూర్చుంది. వచ్చే పోయే వారిని కేకలతో పలకరించేది. 'రండి.. రండి! నరమాంసం తిని ఎంతో పాపం మూటగట్టాను. ఇదిగో ఈ వజ్రాలు పొదిగిన బంగారు కంకణం తీసుకుని నన్ను పునీతం చెయ్యండి. ఓయీ విప్రుడా నీవే ఇందుకు తగు' అనగానే విప్రుడు ఆశపడ్డాడు. విప్రుని తినేసి తిరిగి కంకణాన్ని పంజాకి వేసుకుంది పులి. మోదీ పులుల లెక్క తిరిగి తిరిగి పులిహింస దగ్గర ఆగింది. మొత్తంమీద ఏదో రకంగా దేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది!

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

## అక్షర తూణీరం



# ఆహ్వానం

ఇంట్లో ఏదైనా శుభకార్యం ఉన్నప్పుడు అది దిగ్విజయంగా జరగాలంటే కుటుంబ సభ్యుల, దగ్గరి బంధువుల సహకారం తీసుకోవటం అవసరం. ఎంతమంది సహకారమున్నా, నిర్వహణలో ఇంటి యజమానిదే ప్రధాన బాధ్యత అవుతుంది. ముఖ్యంగా అతిథులను, ఆత్మీయులను ఆహ్వానించేటప్పుడు మొక్కుబడిగా, హడావుడిగా కాకుండా ఆ పిలుపు హృదయంలోనుంచి వారి రాకకు తమ ఆనందాన్ని వ్యక్తం చేయాలి. భోజన, పానాదులలో భేదం చూపకుండా అందరిపట్ల ఒకే విధంగా శ్రద్ధ చూపాలి. వచ్చినవారు తిరిగి వెళ్లేటప్పుడు చందన తాంబూలాలతో సత్కరించి పంపుతూ వారి ముఖాలలో ఆనందాన్ని చూస్తూ తాము ఆనందించాలి.

ఎన్ని అత్యవసర పనులున్నా పక్కనపెట్టి, ఫలానా వారింట్లో శుభకార్యానికి తప్పకుండా వెళ్లాలి, అక్కడ దొరికే గౌరవం, ఆ పలకరింపు, ఆ తీరే వేరు అని ఆహ్వానితులకు అనిపించేట్లుగా ఆహ్వానం ఉండాలి. మహా భారతం సభాపర్వంలో నారదుని ఆదేశంతో, శ్రీకృష్ణుని అనుమతితో ధర్మరాజు రాజసూయ యాగం చేయటానికి పూనుకుంటాడు. ధౌమ్య పురోహితులు చెప్పిన విధంగా యాగానికి అవసరమైన సామగ్రి సమకూర్చే పనిని ఇంద్రసేనుడు మొదలైన ప్రముఖులకు అప్పజెప్పాడు. రాజులను, ఇతర ప్రముఖులను, ప్రజలను ఆహ్వానించి, వారికి విడుదులు ఏర్పాటు చేసే బాధ్యతను సహదేవుడికి అప్పజెప్పాడు. భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైన పెద్దలను వెంటబెట్టుకుని తీసుకు రావటానికి నకులుని పంపాడు. వచ్చిన బంధు జనులందరికీ బంగారు, వెండి, రత్నాలను దక్షిణలుగా, దానాలుగా ఇచ్చే విషయంలో కృపాచార్యుని, కార్యాకార్యాలను ఆలోచించటానికి భీష్మద్రోణులను, సమస్త పదార్థాలను వినియోగించటానికి విదురుని, ఆహ్వానితులైన రాజులు ప్రేమపూర్వకంగా తెచ్చే కానుకలు గ్రహించటానికి, జాగ్రత్త చేయటానికి దుర్యోధనుని, భక్ష్య భోజ్యాది ఆహార పదార్థాలను అందరికీ అందేటట్లు చూడటానికి దుశ్శాసనుని ధర్మరాజు నియమించాడు. ముఖ్యులందరికీ వారి వారికి తగిన విధులను పంచాడు. అప్పుడు యజ్ఞ దీక్ష వహించాడు.

ధర్మరాజు కార్య నిర్వహణా సామర్థ్యంవల్ల, ఆయా పనులకు నిర్దేశించిన వారంతా సమర్థంగా వాటిని నిర్వర్తించటంవల్ల రాజసూయం మనోహరంగా సాగింది. ధర్మరాజును, తమ్ములను వచ్చిన వారందరూ అమితంగా ప్రశంసించి వెళ్లారు. ఇంట శుభకార్యం జరగవలసిన విధమిదే. శుభకార్యాలలో అందరూ ఒకే చోట కలవటంవల్ల మానవ సంబంధాలు బలపడతాయి. ఆనందం తద్వారా ఆరోగ్యం చేకూరతాయి. ఇవన్నీ శుభకార్యాలలో ఆహ్వానం ఆత్మీయంగా ఉన్నప్పుడే సిద్ధిస్తాయి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

జ్యోతిర్మయం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
3-8-2019

వెబ్ ఫ్లిక్స్


'ఇరోస్ నౌ'లో స్ట్రీమింగ్ అవుతున్న 'మెట్రో పార్క్' సిరీస్‌లోని పాత్రలు

**పండులో బాగా తీయగా ఉండేది గుజ్జేమరి! అంత తీయగా. అంత చాకచాక్యంగా బిజినెస్ నడుపుతారు మన గుజరాతీయులు! యూఎన్ గుర్తించిన 190 ప్రపంచ దేశాల్లోని 129 దేశాల్లో గుజ్జు తీస్తున్నారు! సరదాగా.. కాలక్షేపంగా "మెట్రో పార్క్" చూసినా.. వాళ్లలోని తెగువ, ఎంట్రపెన్యూర్‌షిప్ అర్థమవుతాయి! శభాష్ గుజరాతీస్!!**

# అమెరికా గుజ్జు తీస్తున్నారు

అమెరికా.. న్యూజెర్సీలోని మెట్రో పార్క్‌లో కల్పేష్ పటేల్ (రణ్‌వీర్ షోరే), పాయల్ పటేల్ (పూర్బీ జోషీ) భార్యాభర్తలు. వాళ్లకు టీన్స్‌లో ఉన్న ఇద్దరు పిల్లలు.. పంకజ్, మున్నీ. డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉన్న కల్పేష్ ''పే అండ్ రన్'' అనే అమెరికన్ కన్వీనియెన్స్ స్టోర్ ఒకటి నడిపిస్తూంటాడు. పాయల్ బ్యూటీ పార్లర్ రన్ చేస్తూంటుంది.

**ఎపిసోడ్ 1.. న్యూ బిగినింగ్స్..**

పాయల్ చెల్లెలు కింజల్ ప్రెగ్నెంట్. మంచికి, చెడుకి అక్క తోడుగా ఉంటుందని తన భర్త కణ్ణన్‌తో కలిసి న్యూయార్క్ సిటీ నుంచి మెట్రో పార్క్‌కు మారుతారు. కణ్ణన్ తమిళియన్. గృహప్రవేశ కార్యక్రమానికి సౌత్ ఇండియన్ పురోహితుడినే పిలవాలని పట్టుబట్టి పిలుస్తాడు. చేతిలో ట్యాబ్‌తో ప్రత్యక్షమవుతాడు ఆ పూజారి. ఇకో పూజ చేస్తానంటూ ట్యాబ్ ఆన్ చేసి మంత్రాలు చదువుతూంటాడు. ధూప దీపాలను వెలిగించాలి అన్నప్పుడు ట్యాబ్‌లో దీపాలు, అగరుబత్తీలు డిస్‌ప్లే అవుతాయి. వాటిని వీళ్లు టచ్ చేయగానే వెలుగుతాయి. అలాగే నైవేద్యానికి అరటిపళ్లు డిస్‌ప్లే అవుతాయి. టచ్ చేయగానే దేవుడికి ఆరగింపు అయిపోతుంది. టెంకాయ అంతే టచ్ చేయగానే రెండుగా పగులుతుంది. అలా హౌజ్‌వార్మింగ్ సెర్మనీ కానిచ్చి లంచ్‌కు 'ఇండియన్ రెస్టారెంట్' నుంచి పిజ్జా తెప్పించుకుని గృహప్రవేశం విందు పూర్తి చేసేస్తారు.

> **''గుజరాత్ నుంచి గుజరాతీని ప్రపంచంలో ఎక్కడికైనా తీసుకెళ్లగలం.. కాని గుజరాతీలోంచి గుజరాత్‌ను వేరు చేయడం అసాధ్యం (You can take gujrati out of Gujrat but you can't take Gujrat out of Gujrati)'' అనేది గుజ్జూస్‌నుద్దేశించి వాడుకలో ఉన్న నానుడి. ఈ విషయం ఎరోస్‌నౌలో స్ట్రీమ్ అవుతున్న ''మెట్రో పార్క్'' అనే సిరీస్ చూస్తే కరెక్ట్ అనిపిస్తుంది. ఈ వారం వెబ్‌ఫ్లిక్స్‌కి స్టోరీ ప్లే ఆ కథే!**

**ఎపిసోడ్ 2.. ది అసిస్టెంట్..**

తన స్టోర్‌లో కస్టమర్స్‌ని ఆకట్టుకునేలా మాట్లాడే అసిస్టెంట్ల వేటలో పడ్డాడు కల్పేష్. ఒకరోజు సూటు, బూటు వేసుకొని చేతిలో ఫైల్‌తో స్టోర్‌లో అడుగుపెడ్తాడు దేశీ యువకుడు. అతణ్ణి చూసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనుకొని మనవాడే అని సంబరపడిపోతూ సాదరంగా ఆహ్వానిస్తాడు కల్పేష్. అతను స్టోర్‌లోని సరుకులను చూపిస్తుంటే అర్థంకాని ఆ దేశీ యువకుడు తనను పరిచయం చేసుకుంటాడు తన పేరు బిట్టూ (పితోభాష్ త్రిపాఠీ) అని, బిహార్ నుంచి వచ్చానని.. ఉద్యోగం కోసం తిరుగుతున్నానని. ''ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కాదన్న మాట'' అని సణుక్కుంటూ ఆ యువకుడిని ఇంటర్వ్యూ చేస్తాడు. మెచ్చి అసిస్టెంట్ ఉద్యోగమూ ఇచ్చేస్తాడు. పినాసితనంతో సరుకులను ఆదా చేయడంలో, కస్టమర్స్‌ను మాటల్లో పెట్టి సేల్స్ పెరిగేలా చేయడంలో, ఓపిక లేని అమెరికన్లు 'కీప్ ది చేంజ్' అంటూ వెళ్లిపోయేదాకా చిల్లర కోసం గల్లాలో వెదికినట్టు యాక్షన్ చేయడంలో బిట్టూకి శిక్షణ కూడా ఇస్తాడు. నెల తిరిగేసరికి కల్పేష్‌ను మించి తయారవుతాడు బిట్టూ ఫ్రమ్ బిహార్.


బిట్టూ

**ఎపిసోడ్ 3.. కల్పేష్ స్టడీస్..**

''అమెరికాలో కుక్క పిల్ల దగ్గర్నుంచి మనిషి దాకా.. చెంచా నుంచి స్విమ్మింగ్ పూల్ దాకా అన్నిటి కీ ఇన్సూరెన్సే. ఆ వ్యాపారంలోకి దిగితే లాభాలే లాభాలే'' అంటూ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఒక ఫ్రెండ్ ఇచ్చిన సలహా వింటాడు కల్పేష్. సైడ్ బిజినెస్‌గా తనూ ఇన్సూరెన్స్ రంగంలోకి దిగాలని డిసైడ్ అయిపోతాడు. ఏజెంట్‌గా సర్టిఫికెట్ పొందాలంటే అందుకు సంబంధించిన పరీక్ష రాయాలి. రాత్రింబవళ్లు కష్టపడి చదివి పాస్ మార్కులు తెచ్చుకుంటాడు. ''సైన్ అండ్ స్మైల్'' అని ఏజెన్సీకి పేరు పెట్టి బీమా వ్యాపారం మొదలుపెడ్తాడు.

**ఎపిసోడ్ 4.. గెరిల్లా మార్కెటింగ్..**

కల్పేష్ ఊహించుకున్నట్టుగా బీమా వ్యాపారం పుంజుకోదు. మళ్లీ పాత స్నేహితుడి దగ్గరకు వెళ్తాడు. గెరిల్లా మార్కెటింగ్ చేయమని అడ్వయిజ్ ఇస్తాడు ఫ్రెండ్. ఆ మరుసటి రోజే స్టార్ట్ చేస్తాడు. బిట్టూకి కెమెరా ఇచ్చి రోడ్ల మీద జనాలున్న చోటికి, కార్ పార్కింగ్‌లకు వెళ్లి.. ఇన్సూరెన్స్ గురించి చెప్తూ వీడియో తీయించుకుంటాడు కల్పేష్. ఆ వీడియోను ఇండియన్ సినిమాలు ప్రదర్శిస్తున్న చోట్ల, ఇండియన్ డిష్ చానెల్స్‌లో యాడ్‌గా వేయిస్తాడు. అట్లా అతని వ్యాపారం పుంజుకోకపోయినా.. ''సైన్ అండ్ స్మైల్ .. శాటిస్‌ఫ్యాక్షన్ గ్యారెంటీడ్ అండ్ డెఫినెట్లీ'' అనే తన పంచ్ లైన్‌తో గుజరాతీ కమ్యూనిటీలో ఒక జోకర్‌గా మాత్రం పాపులర్ అవుతాడు కల్పేష్ పటేల్.


కల్పేష్

**ఎపిసోడ్ 5.. కరొకే నైట్స్..**

పైసా పైసా లెక్క చూసే భర్త పిసినారితనమంటే చిరాకేసిన పాయల్.. పైసా కాదు ప్యాషన్ ఉండాలంటూ భర్తను దెప్పుతుంటుంది. పట్టుదలకు పోయిన కల్పేష్ తన ప్యాషన్ ఏంటో చూపిస్తానని.. న్యూజెర్సీలోని సేల్ యార్డ్ (చోర్ బజార్ లాంటిది)కి వెళ్లి.. గీచిగీచి బేరమాడి కరొకే మ్యూజిక్ సెట్ కొనుక్కొస్తాడు. తెల్లవారి తన ప్రాక్టీస్‌తోనే ఇంట్లో వాళ్లను నిద్రలేపుతాడు. ఆ స్వరానికి భార్య, పిల్లలు జడుసుకుంటారు. అయినా వెనక్కి తగ్గడు కల్పేష్. పైగా ఒక వీకెండ్ ఇంట్లోనే డిస్కో నైట్ అరేంజ్ చేస్తాడు. చుట్టుపక్కల ఉన్న గుజ్జూస్‌ని పిలుస్తాడు. వాళ్లంతా మైకాసురులు అవుతారు. భరించలేని పాయల్ పోలీసులకు ఇన్‌ఫామ్ చేస్తుంది భర్తకు తెలియకుండా. ''డిస్టర్బెన్స్ అవుతోందని నైబర్స్ కంప్లయింట్ చేశారు'' అంటూ పోలీసులు వచ్చి పార్టీ క్లోజ్ చేయిస్తాడు. నైబర్స్ అంతా ఇక్కడే ఉండగా కంప్లయింట్ ఎవరిచ్చారబ్బా అని అనుకుంటూ భార్య వైపు అనుమానంగా చూస్తాడు కల్పేష్.

**ఎపిసోడ్ 6...యూనీసెక్స్..**

తన ''ఫర్ లేడీస్ ఓన్లీ' బ్యూటీపార్లర్‌ను యూనీసెక్స్ పార్లర్‌గా మార్చేస్తుంది పాయల్. నిజానికి మగవాళ్లకు సంబంధించిన బ్యూటీ టిప్స్, హెయిర్ కటింగ్స్ ఏవీ ఆమెకు రావు. తనకు వచ్చినట్టు హెయిర్ కట్ చేసి ''మిమ్మల్ని ఇలా తయారుచేశా... ఎంత హ్యాండ్‌సమ్‌గా కనిపిస్తున్నారో'' అంటూ బాలీవుడ్ హీరోల ఫోటోలు చూపిస్తూ యూనీసెక్స్ పార్లర్‌ను మేనేజ్ చేస్తూంటుంది పాయల్.

**ఎపిసోడ్ 7..డైట్స్ అండ్ గాడ్జెట్స్**

కణ్ణన్‌కు గాడ్జెట్స్ పిచ్చి. ఇంట్లో క్లీనింగ్‌కి రోబోల్లాంటి రిమోట్ కంట్రోల్డ్ మెషీన్‌ను తెస్తాడు. కాని దాన్ని ఆపరేట్ చేయడం కన్నా స్వతహాగా పనిచేసుకోవడమే బెటర్ అని ప్రాక్టికల్‌గా అర్థమవుతుంది కింజల్‌కు. అందుకే ఆ పని కణ్ణన్‌కే అప్పజెప్పుతుంది. ఇంకోవైపు కుక్కల వల్ల ఎలర్జీతో విపరీతంగా జలుబు చేస్తుంది కల్పేష్‌కి. హాస్పిటల్‌కి వెళితే టూడీ ఎకోతో సహా టెస్ట్‌లన్నీ చేయిస్తారు. అందులో కొలెస్ట్రాల్, ట్రై గ్లిసరైడ్స్ ఎక్కువున్నట్టు తేలుతుంది. ఎప్పటినుంచో జ్యూస్ గ్రైండర్ కొనాలనే ఆలోచనలో ఉన్న పాయల్.. ఇదే కరెక్ట్ సమయమని పావులు కదుపుతుంది. జ్యూస్ డైట్‌తో కొలెస్ట్రాల్, వెయిట్‌ను కంట్రోల్ చేసుకోవచ్చని, ఇద్దరం డైట్ స్టార్ట్ చేద్దామని కల్పేష్‌ను ఒప్పించి గ్రైండర్ కొనిపిస్తుంది. ఒక వారం బాగానే సాగుతుంది డైట్. తర్వాత ఇద్దరికీ నీరసం మొదలవుతుంది. జ్యూస్ చేయడం కంటే ఆ గ్రైండర్‌ను శుభ్రం చేయడమే కష్టమని ఆచరణలో తెలుసుకుంటుంది పాయల్. ఈలోపు కుక్కల అలర్జీ నుంచి బాస్‌ను కాపాడ్డానికి ఒక మెషీన్‌ను తెచ్చి షాప్‌లో అమరుస్తాడు బిట్టూ. పెట్ డాగ్స్‌తో ఎవరైనా షాప్‌లోకి వస్తే ఆ మెషీన్ వింత శబ్దాలను చేస్తుంది. ఆ సౌండ్స్‌కి కుక్కలు పారిపోతాయి. అయితే ఆ శబ్దాలు కుక్కలకు మాత్రమే వినపడ్తాయి. కాని ఈ మెషీన్ వల్ల ఓ కస్టమర్ దగ్గర దొరికిపోతారు కల్పేష్ అండ్ బిట్టూ.


కింజల్

**ఎపిసోడ్ 8.. ప్రెగ్నెన్సీ క్లాసెస్..**

కింజల్‌కు డెలివరీ టైమ్ దగ్గరపడ్తూంటుంది. బేబీ పుట్టాక ఎలా సంరక్షించాలో తెలుసుకోవడానికి ప్రెగ్నెన్సీ క్లాసెస్‌కు అటెండ్ అవుతుంటారు కింజల్, కణ్ణన్. ఆ క్లాసెస్ ఏవీ అర్థంకాని కణ్ణన్ వాళ్లు పెట్టే ప్రతి పరీక్షలో ఫెయిల్ అవుతుంటాడు. పక్కనున్న మరో ప్రెగ్నెంట్ లేడీ హజ్బెండ్‌ను ఎగ్జాంపుల్‌గా చూపిస్తూ నేర్చుకోమంటుంది టీచర్. కింజల్ కూడా అతణ్ణి మెచ్చుకొనేసరికి ఉడికిపోతుంటాడు కణ్ణన్.

**ఎపిసోడ్ 9.. హౌజింగ్ ఫాలింగ్ ఎపార్ట్..**

కల్పేష్ పిసినారితనం మళ్లీ మ్యాటర్ అవుతుంది పాయల్‌కు. ఇంట్లో కాలింగ్ బెల్ నుంచి బాత్రూమ్స్‌లో ఫ్లష్‌దాకా అన్నీ రిపేరింగ్‌లో ఉంటాయి. డబ్బుకి కక్కుర్తి పడి ప్లంబర్‌ను పిలిపించకుండా అన్నిటికీ ప్లాస్టర్లు వేసి నెట్టుకొస్తుంటాడు కల్పేష్. సహనం చచ్చిపోయిన పాయల్ గొడవ పెట్టేసరికి అతి చవగ్గా దొరికిన ఫ్రెంచ్ ప్లంబర్‌ను పట్టుకొస్తారు కల్పేష్, బిట్టూ. ఆ ఫ్రెంచ్ ప్లంబర్ ఫ్రెంచ్ యాసలో ఇంగ్లిష్ మాట్లాడుతూ గంటల చొప్పున డాలర్లను లెక్కగట్టి ముప్పై డాలర్లలో అయిపోయే పనికి వందల డాలర్ల బిల్లు పంపిస్తాడు. గతుక్కుమంటాడు కల్పేష్. ఈలోపు కింజల్‌కు నొప్పులు స్టార్టవుతాయి. అంతకుముందు స్కానింగ్‌లో ఆడపిల్ల అని చెప్పిన డాక్టర్లు నొప్పుల సమయంలో స్కాన్ చేసి బేబీ చేంజ్ అయిందంటారు. ఖంగుతిన్న కపుల్‌ను చూసి.. ''ఏం లేదు.. అంతకు ముందు బేబీ గర్ల్ అనుకున్నాం.. కాని కాదు పుట్టబోయేది బేబీ బాయ్'' అని వివరణ ఇస్తారు డాక్టర్లు. ఇలాంటి షాక్‌లు, వింతలు అన్నిటినీ అధిగమించి మగబిడ్డను కంటుంది కింజల్. ఇక్కడితో మెట్రో పార్క్ ఎండ్.



డాలర్లను రూపాయిల్లో లెక్కించుకుంటూ ఖర్చులకు గుండెను బాదుకునే సగటు భారతీయ మనస్తత్వం, అమెరికా అయినా అంతరిక్షమైనా ఇండియనైజ్ చేయగల మన చాకచక్యం వంటి లక్షణాలతో ఈ తొమ్మిది ఎపిసోడ్లు ఆద్యంతమూ హాస్య ప్రధానంగా సాగుతాయి. చిన్న నుంచి పెద్ద వరకూ అందరూ ఎంజాయ్ చేయగల సిరీస్ మెట్రో పార్క్.

– సరస్వతి రమ



## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



సందర్భం: నేడు వాణిశ్రీ బర్త్‌డే

పల్లవి : అరె రె రె రె రె రె రె రె రె రె రె రె
ఎట్టాగో ఉన్నాది ఓలమ్మీ
ఏటేటో ఔతుందె చిన్నమ్మీ (2)
అరె రె రె రె రె రె రె రె రె రె రె రె
అట్టాగె ఉంటాది ఓరబ్బీ
ఎట్టాగొ ఔతాది చిన్నబ్బీ (2)

**చరణం : 1** మొలలోతు నీళ్లల్లో మొగ్గల్లె నువ్వుంటే
నీ ఒంటి నిగనిగతో నీళ్లు మెరుస్తుంటే
॥మొలలోతు॥
పొదచాటున నేను మాటేసి చూస్తుంటే
నువ్వు తానాలు ఆడావు ఓలమ్మీ
నా ప్రాణాలు తీశావె చిన్నమ్మీ
॥అరె–ఎట్టాగో॥ ॥అరె–అట్టాగె॥

**చరణం : 2**
మొగ్గలు ఒక్కొక్కరేకిప్పుకున్నట్టు
నీ చక్కదనాలు నేనొకటొకటె చూశాను ॥మొగ్గ॥
జడచూస్తి ఆ... మెడచూస్తి ఆహా...
జబ్బల నునుపు చూస్తి హా...
కనరాని ఒంపులన్నీ ఓలమ్మీ
కసికసిగా చూస్తినే చిన్నమ్మీ
॥అరె–ఎట్టాగో॥ ॥అరె–అట్టాగె॥

**చరణం : 3** తడిసీ నీ తెల్లకోక తపాతపామన్నది
తడబడి నా గడుసు మనసు దడాదడామన్నది
॥తడిసీ॥
కళ్లు మూసికొస్తినని
ఘొల్లున నువ్వు నవ్వితే ఆహ్హాహ్హా
చురకల్లె తగిలింది ఓలమ్మీ
ఉడుకెక్కిపోయిందె చిన్నమ్మీ
॥అరె–ఎట్టాగో॥ ॥అరె–అట్టాగె॥

**చిత్రం : దసరా బుల్లోడు (1971)**
**రచన : ఆచార్య ఆత్రేయ**
**సంగీతం : కె.వి.మహదేవన్**
**గానం : ఘంటసాల, పి.సుశీల**

కట్ చేయ్...దాచేయ్...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | 1 | | | 7 | | 5 | 9 |
| 8 | 7 | 5 | | 2 | | | | 4 |
| | 9 | | 3 | 1 | | 8 | | |
| | | | 4 | 5 | 1 | 9 | | 2 |
| | | | | | | | | |
| 1 | | 3 | 2 | 9 | 6 | | | |
| | 8 | | | 6 | 3 | | 9 | |
| 4 | | | | 8 | | 7 | 6 | 3 |
| 5 | 3 | | 9 | | | 8 | | 1 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 2 | 5 | 6 | 3 | 9 | 7 | 4 | 1 |
| 3 | 1 | 6 | 4 | 2 | 7 | 9 | 5 | 8 |
| 9 | 4 | 7 | 8 | 1 | 5 | 3 | 2 | 6 |
| 2 | 5 | 1 | 3 | 9 | 6 | 8 | 7 | 4 |
| 6 | 9 | 4 | 7 | 5 | 8 | 2 | 1 | 3 |
| 7 | 3 | 8 | 1 | 4 | 2 | 5 | 6 | 9 |
| 4 | 7 | 2 | 9 | 6 | 3 | 1 | 8 | 5 |
| 5 | 6 | 9 | 2 | 8 | 1 | 4 | 3 | 7 |
| 1 | 8 | 3 | 5 | 7 | 4 | 6 | 9 | 2 |

## రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (ఆగస్ట్ 3 నుండి 9 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

ఆగస్టు 4 ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా..



# కూరిమి తినండి

**స్నేహం ఎప్పుడూ నిండుగా చేయాలి.**
**ఆప్యాయతని నిండుగా పంచుకోవాలి.**
**ఈ గాలి.. ఈ నీరు.. ఈ ఆకాశం... ఈ యేరు..**
**ఈ నేడు.. ఈ రేపు అన్నీ మనవే అనుకుని**
**ఉత్సాహపడేవాళ్లే స్నేహితులు.**
**ఏ ఇద్దరు స్నేహితులు కలిసిన క్షణాలైనా నిండైనవి.**
**వాటిని బోలు పదార్థాలతో ఎందుకు చప్పగా మార్చాలి?**
**ఇలా కూరిన స్నాక్స్‌తో**
**కూరిమి (స్నేహాన్ని)**
**వెలిగించండి.**

## ఆలూ కుల్చా

**కావలసినవి:** గోధుమ పిండి – ఒక కప్పు (120 గ్రా.); మైదాపిండి – ఒక కప్పు; బేకింగ్ సోడా – పావు టీ స్పూను; నెయ్యి లేదా నూనె – 3 టీ స్పూన్లు; పెరుగు – 2 టేబుల్ స్పూన్లు; పంచదార – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత; నీళ్లు – అర కప్పు కంటె కొద్దిగా ఎక్కువ; కుల్చాలు కాల్చడానికి నూనె లేదా నెయ్యి – తగినంత; నువ్వులు – ఒక టేబుల్ స్పూను

**స్టఫింగ్ కోసం:** బంగాళ దుంపలు – 3 (సుమారు 350 గ్రా. ఉండాలి); సన్నగా తరిగిన పచ్చి మిర్చి – 5; మిరప కారం – అర టీ స్పూను; ఆమ్‌చూర్ పొడి – అర టీ స్పూను; గరం మసాలా – పావు టీ స్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు

**తయారీ:** ● ఒక పాత్రలో గోధుమ పిండి, మైదాపిండి, బేకింగ్ సోడా, పంచదార, ఉప్పు వేసి బాగా కలపాలి ● పెరుగు, మూడు టీ స్పూన్ల నూనె జత చేసి, మృదువుగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేసి, చేతితో అదుముతూ ఎక్కువ సేపు కలిపి, మూత ఉంచి రెండు గంటలు నాననివ్వాలి ● అరగంట తరవాత ఒకసారి పిండిని బాగా కలిపి, మళ్లీ మూత ఉంచాలి ● బంగాళ దుంపలను ఉడకబెట్టి, తొక్క తీసేసి, దుంపలను చేతితో మెత్తగా మెదిపి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● పచ్చిమిర్చి తరుగు, ఆమ్ చూర్ పొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు జత చేయాలి ● అన్నీ బాగా కలిసే వరకు మరోమారు చేతితో బాగా కలపాలి ● కలిపి ఉంచుకున్న గోధుమపిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి ● ఒక్కో ఉండను చిన్న చపాతీ మాదిరిగా ఒత్తుకోవాలి ● తయారుచేసి ఉంచుకున్న బంగాళ దుంప మిశ్రమాన్ని, చపాతీ మీద కొద్దిగా ఉంచి అంచులను మధ్యలోకి తీసుకువచ్చి మూసేయాలి ● కొద్దిగా గోధుమ పిండి అద్దుతూ, జాగ్రత్తగా ఒత్తాలి ● స్టౌ మీద పెనం ఉంచి వేడయ్యాక ఒత్తి ఉంచుకున్న కుల్చాను ఉంచి, రెండు వైపులా నెయ్యి వేసి బాగా కాల్చి ప్లేటులోకి తీసుకోవాలి (ఇవి కాలడానికి ఎక్కువ సమయం పడుతుంది. రెండు మూడుసార్లు అటు ఇటు తిప్పుతూ కాల్చాలి. లేదంటా పచ్చిగా ఉంటాయి)

## క్యాబేజీ రోల్స్



**కావలసినవి:** క్యారట్ తురుము – అర కప్పు; ఆవాలు – పావు టీ స్పూను; జీలకర్ర – పావు టీ స్పూను; పచ్చి బఠాణీ – పావు కప్పు; కార్న్ ఫ్లోర్ – పావు కప్పు; ఉప్పు – తగినంత; మిరియాల పొడి – అర టీ స్పూను; పచ్చి మిర్చి – 4 (చిన్న చిన్న ముక్కలు చేయాలి); కొత్తిమీర తరుగు – ఒక టేబుల్ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు (సన్నగా తరగాలి); క్యాబేజీ పెద్ద పువ్వు – 1

**తయారీ:** ● ఒక పెద్ద పాత్రలో నిండుగా నీళ్లు పోసి బాగా మరిగించి, దింపేయాలి ● క్యాబేజీ పువ్వును ఆ నీళ్లలో వేసి మూత పెట్టి, పావుగంటసేపు అలాగే ఉంచేయాలి ● స్టౌ మీద బాణలిలో కొద్దిగా నూనె వేసి కాచాలి ● ఆవాలు, జీలకర్ర ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించాలి ● క్యారట్ తురుము, పచ్చిబఠాణీ వేసి బాగా వేయించాలి ● ఉప్పు జతచేసి మరోమారు కలిపి, కొద్దిగా నీళ్లు పోసి మూత ఉంచాలి ● కార్న్‌ఫ్లోర్‌కు తగినన్ని నీళ్లు జత చేసి బాగా కలిపి, ఉడుకుతున్న క్యారట్ మిశ్రమం మీద పోసి కలపాలి ● మిరియాల పొడి, పచ్చిమిర్చి తరుగు, కొత్తిమీర తరుగు, కరివేపాకు తరుగు వేసి బాగా కలిపి దింపేయాలి ● వేడినీళ్లలో ఉన్న క్యాబేజీని బయటకు తీయాలి ●క్యాబేజీ పొరలను ఒక్కొక్కటిగా జాగ్రత్తగా తీసి పక్కన ఉంచాలి ● తయారు చేసి ఉంచుకున్న మిశ్రమాన్ని స్పూనుతో తీసుకుని క్యాబేజీ పొరలో ఉంచి, పొట్లం మాదిరిగా రోల్ చేయాలి ● కార్న్‌ఫ్లోర్ నీళ్లతో పైభాగం అంచులు మూసేయాలి ● ఇలా అన్నీ చేసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారు చేసి ఉంచుకున్న క్యాబేజీ రోల్స్‌ను వేసి, సన్నని మంటమీద కొద్ది సేపు దోరగా వేయించాక పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి. ●టొమాటో సాస్, చిల్లీ సాస్‌లతో తింటే రుచిగా ఉంటాయి.

## బ్రెడ్ రోల్స్



**కావలసినవి:** నూనె – 3 టేబుల్ స్పూన్లు; ఉల్లి తరుగు – అర కప్పు; అల్లం వెల్లుల్లి ముద్ద – ఒక టీ స్పూను; తరిగిన పచ్చి మిర్చి – 5; పచ్చి బఠాణీ – 3 టేబుల్ స్పూన్లు; స్వీట్‌కార్న్ గింజలు – 3 టేబుల్ స్పూన్లు; బంగాళ దుంపలు – 5 ; పసుపు – పావు టీ స్పూను; కాశ్మీరీ మిరప కారం – అర టీ స్పూను; గరం మసాలా – అర టీ స్పూను; ఆమ్‌చూర్ పొడి – అర టీ స్పూను; ఉప్పు – తగినంత; పనీర్ తురుము – 3 టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ స్లయిసులు – 6; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక, మూడు టీ స్పూన్ల నూనె వేయాలి ● ఉల్లి తరుగు వేసి రంగు మారేవరకు వేయించాలి ● అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చి మిర్చి తరుగు వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి ● మెదిపిన బంగాళదుంప ముద్ద, పసుపు, మిరప కారం, గరం మసాలా, ఆమ్ చూర్ పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి ● పనీర్ తురుము జత చేయాలి ● రెండు టేబుల్ స్పూన్ల కొత్తిమీర తరుగు జత చేసి బాగా కలిపి దింపి, చల్లారబెట్టాలి ● బ్రెడ్ స్లయిసుల అంచులు కట్ చేసేయాలి ● బ్రెడ్‌ను నీళ్లలో ముంచి వెంటనే తీసేసి నీళ్లు పూర్తిగా పోయేలా గట్టిగా పిండేయాలి ● తయారుచేసి ఉంచుకున్న మిశ్రమాన్ని పొడవుగా రోల్ చేసి, బ్రెడ్‌మీద ఉంచాలి ● బ్రెడ్‌ను రోల్ చేసి అంచులు మూసేయాలి (అంచులు తెరుచుకుని ఉంటే, నూనెలో వేయగానే స్టఫింగ్ బయటకు వచ్చేస్తుంది) ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారుచేసి ఉంచుకున్న బ్రెడ్ రోల్స్ వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● టొమాటో కెచప్‌తో అందిస్తే రుచిగా ఉంటాయి.

## నూడుల్స్ సమోసా



**కావలసినవి:** మైదాపిండి – పావు కేజీ; ఉడికించిన నూడుల్స్ – 2 కప్పులు; వాము – అర టీ స్పూను; అల్లం వెల్లుల్లి ముద్ద – ఒక టీ స్పూను; క్యాబేజీ తరుగు – పావు కప్పు; చిల్లీ సాస్ – ఒక టీ స్పూను; సోయా సాస్ – 2 టీ స్పూన్లు; ఉల్లికాడల తరుగు – పావు కప్పు; కార్న్‌ఫ్లోర్ – ఒక టీ స్పూను; క్యారట్ తురుము – ఒక టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత.

**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక అల్లం వెల్లుల్లి ముద్ద వేసి వేయించాలి ● క్యాబేజీ తరుగు, చిల్లీ సాస్, సోయా సాస్ వేసి కలియబెట్టాలి ● ఉల్లి కాడల తరుగు జత చేసి మరోమారు కలపాలి ● ఉప్పు, కార్న్ ఫ్లోర్ వేసి మరో మారు కలపాలి ● పదార్థాలన్నీ బాగా వేగిన తరవాత నూడుల్స్ జత చేయాలి ● బాగా వేగిన తరవాత బయటకు తీసి ప్లేటులోకి తీసుకోవాలి ● తడి పోయే వరకు ఆరనివ్వాలి ● ఒక గిన్నెలో మైదా పిండి, ఉప్పు, కొద్దిగా నూనె, నీళ్లు వేసి పిండిని ముద్దలా కలిపి, మూత పెట్టి పక్కన ఉంచాలి ● అర గంట తరవాత పిండిని తీసుకుని, చిన్న చిన్న ఉండలుగా చేసి, పూరీలా ఒత్తుకోవాలి ● పూరీని సగానికి కోసి, త్రికోణాకారంలో మడతపెట్టాలి ● నూడుల్స్ మిశ్రమాన్ని కొద్దిగా తీసుకుని, ఇందులో స్టఫ్ చేసి అంచులు మూసేయాలి ● ఇలా అన్నిటినీ సిద్ధం చేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారుచేసి ఉంచుకున్న సమోసాలను వేసి, దోరగా వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● టొమాటో సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.

## శ్రీలంకన్ వెజిటబుల్ పాన్‌కేక్ రోల్స్



**కావలసినవి:** మైదాపిండి – 2 కప్పులు; ఉప్పు – తగినంత; పాలు – అర కప్పు; నీళ్లు – ఒక కప్పు; నూనె – ఒకటిన్నర టీ స్పూన్లు.

**ఫిల్లింగ్ కోసం:** క్యారట్ తరుగు – ఒక కప్పు; బంగాళదుంప ముక్కలు – ఒక కప్పు; పచ్చి బఠాణీ – ఒక కప్పు; టొమాటో తరుగు – పావు కప్పు; ఉల్లి తరుగు – పావు కప్పు; జీలకర్ర – అర టీ స్పూను; మిరియాలు – అర టీ స్పూను; పచ్చిమిర్చి – 4; ఉప్పు – తగినంత; పసుపు – పావు టీ స్పూను.

**తయారీ:** ● స్టౌ మీ ఒక పెద్ద పాత్ర ఉంచి వేడయ్యాక, నూనె వేసి వేడి చేయాలి ● బంగాళ దుంప ముక్కలు వేసి వేయించి, మధ్యమధ్యలో కలుపుతూ సుమారు నాలుగు నిమిషాలు వేయించాలి ● క్యారట్ తరుగు, టొమాటో తరుగు, పచ్చి మిర్చి తరుగు జత చేసి బాగా కలపాలి ● తగినంత ఉప్పు జత చేయాలి ● మిరప కారం జత చేసి మరోమారు కలపాలి ● జీలకర్ర పొడి, మిరియాలు, పసుపు వేసి కలిపి అర కప్పు నీళ్లు జత చేసి బాగా కలపాలి ● బంగాళ దుంప ముక్కలు బాగా ఉడికేవరకు మధ్యమధ్యలో కలుపుతుండాలి ● బఠాణీ జత చేసి, మూత ఉంచి, ఐదు నిమిషాలు ఉడికించి, దింపేయాలి ● ఒక పాత్రలో మైదాపిండి, నూనె, ఉప్పు, పాలు, నీళ్లు వేసి, ఉండలు లేకుండా బాగా కలపాలి ● స్టౌ మీద నాన్‌స్టిక్ పాన్ ఉంచి, వేడయ్యాక, కలిపి ఉంచుకున్న పిండిని చిన్న దోసె మాదిరిగా వేయాలి ● పిండి సమానంగా పరుచుకునేలా పాన్‌ను నాలుగువైపులకు కలపాలి ● బాగా కాలి, అంచులు విడేవరకు ఉంచాలి (సుమారు ఐదు నిమిషాల సమయం పడుతుంది. ఒక వైపు మాత్రమే కాల్చాలి. బాగా కాలిన తరవాత చేతితో తీస్తే వచ్చేస్తుంది) చిన్న పూరీ పరిమాణంలో చేసుకున్న పాన్ కేక్‌లో కొద్దిగా స్టఫింగ్ ఉంచి అంచులను మూస్తూ పొట్లంలా తయారుచేసి, రోల్ చేయాలి ● ఇలా అన్నీ చేసుకోవాలి ● మిగిలిన పిండిలో, తయారుచేసి ఉంచుకున్న రోల్స్‌ను ముంచి తీసి, బ్రెడ్ పొడిలో దొర్లించాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారు చేసి ఉంచుకున్న రోల్స్‌ను అందులో వేసి దోరగా వేయించాలి (నూనె బాగా మరగకూడదు, మీడియం మంట మీద తయారుచేయాలి) ● వేగిన రోల్స్‌ను పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● సాస్‌తో అందించాలి.

నిర్వహణ:
డా. వైజయంతి పురాణపండ

### మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

ప్రభుత్వంతో ముడిపడిన ఏ సమస్యలైనా సరే అధికారుల సుముఖత కారణంగా తప్పక పరిష్కారమవుతాయి. అయితే కొద్దికాలం పట్టవచ్చు.

కాలం పట్టినా మీరనుకున్నది అనుకున్నట్టుగానే ఫలితం ఉండబోతోంది కాబట్టి మానసిక తర్జన భర్జనలూ ఆందోళనా అవసరం ఉండదు– లేదు కూడా.

కాంట్రాక్టర్లకి ధనలాభం ఉంటుంది. నిరుద్యోగులకి ఉద్యోగ ప్రాప్తి ఉంటుంది. కొద్దికాలం మాత్రం ఎదురు చూడాల్సి ఉంటుంది. అయితే ఫలితం పూర్తి సానుకూలంగా ఉంటుంది. మీకున్న ఆవేశాన్నీ సాహసాన్నీ నియంత్రించుకుని ఉండాల్సిందే.

రెచ్చగొట్టి మిమ్మల్ని అధికారుల మీదికో ప్రభుత్వం మీదికో లేక ఇరుగుపొరుగుల వారి మీదికో దూకేలా చేసే వ్యక్తులకి ఎంత దూరంగా మీరుండగలిగితే అంత ఆనందంగానూ ఈ వారం గడుస్తుంది. శ్రద్ధ పెట్టండి.

ఆరోగ్యం అనుకూలిస్తుంది. శస్త్ర చికిత్స తప్పదని భయపెట్టిన వైద్యుడు కాస్తా ఔషధాలతోనే వ్యాధి అదుపులోకొస్తుంది.

తగిన సమయంలో సరైన ఔషధాన్ని సక్రమంగా ఉపయోగించండి. ఆరోగ్యం మీకు కరతలామలకం.

ఆదాయం కంటె వ్యయం ఎక్కువ ఉండవచ్చు. ఇరుగు పొరుగుల వారితో చిన్న విరోధం వచ్చే అవకాశం ఉంది కాబట్టి మితభాషణం మంచిది– ముఖ్యంగా స్త్రీలకి.

**లౌకిక పరిహారం:** ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టి సకాలంలో ఔషధ సేవ చేయండి.
**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవిని తెల్లని వస్త్రాలు కట్టుకుని తెల్లని పూలతో పూజించండి.

### వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

సోదరుల మధ్యలో ఇరుగు పొరుగుల మధ్యనో చిన్నగా వాగ్వివాదం పెద్దదై రెండిళ్ల మధ్యా గోడని కట్టుకోవలసిన పరిస్థితిని తెచ్చేయవచ్చు. ఒకసారంటూ ఓ నిర్ణయాని కొచ్చాక ఇక వాయిదా వేయకండి. కానిచ్చెయ్యండి. అయితే దీనిద్వారా తొందరపాటు మాట ద్వారా రాబోయే ఫలితం ఏమిటో, వ్యయం ఎంతో, ఒక ఆత్మీయునితో స్నేహాన్ని చెడగొట్టుకునేందువల్ల వచ్చే లాభమెంతో గమనించుకోండి. అయిపోయిందేదో అయిపోయింది కాబట్టి ఇంకా వాళ్లమీద కోప– ద్వేషాలని కలిగి ఉండకండి. వాళ్లు అలా మీమీద చాడీలనీ నిందలనీ... ప్రచారం చేస్తూంటే మౌనంగా ఉండండి. వాళ్ల మాటల్ని విన్నవాళ్లు మళ్లీ మీతో ఆ మాటల్ని చెప్పబోతే వారించండి– విననే విననీ, చెప్పనే చెప్పవద్దనీనూ. పేడతట్ట మీది మూతను ఓసారి తెరిచి చూసుకుంటే ఎలా ఉంటుందో జరిగిపోయిన వ్యవహారాన్ని గురించి చర్చించు కుంటూంటేనూ అలానే ఉంటుంది.

కుటుంబంలో ఆస్తి పంపకాల గురించిన సూచనలు రావచ్చు. ముసుగులో వ్యవహారం కాకుండా– సోదరులందర్నీ పిలిచి ఆస్తి పరిష్కారానికి ధర్మబద్ధ పరిష్కారాన్ని ప్రకటించండి. అంగీకరించని పక్షంలో పెద్ద మనుషుల ద్వారా పరిష్కరించేసుకోండి తప్ప విషయాన్ని నాన్చకండి. రెండు మూడు రోజులంటూ సమయాన్ని మీకుగా మీరు ప్రార్థించకండి. ఇప్పుడే ఓ అవగాహనకి వచ్చేసి ఉండండి.

కవులూ పండితులూ కళాకారులూ సంగీత విద్వాంసులూ... ఇలా ఎందరో ప్రతిభావంతులకి జరిగే సన్మాన కార్యక్రమానికి మీరు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ఆనందించండి.

**లౌకిక పరిహారం:** సంతోషంతో ఉండాలని భావించుకోండి.
**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవిని పసుపు జలంతో శ్రీ సూక్తంతో అభిషేకించండి.

### మిథునం (మే 21 - జూన్ 20)

పాము తిరుగుతున్న ఇంట్లో ఓ రాత్రి నిద్ర చేయవలసి వచ్చినట్లుగా అన్ని సౌకర్యాలూ ఆనందాలూ ఉన్నప్పటికీ ఎందుకో తెలియని ఓ కొరతతో మానసికంగా చిన్న వ్యధతో ఉంటారు. దీనివల్ల కలిగే నష్టం దుఃఖం అంటూ ఏమీ ఉండదు కానీ పూర్తి సంతోషంతో ఉండలేకపోవచ్చు. కుజ బుధ రాహు కేతువులు నలుగురూ అననుకూలురుగా ఉండడం దీనిక్కారణం.

ఆర్థికంగా కలుసుబాటుతనం ఉంటుంది. రావలసిన బకాయిలు క్రమ క్రమంగా వస్తూ ఉంటాయి. ఎవరైనా వచ్చి రుణం కావాలంటే– ఇయ్యలేనని చెప్పగల దృఢత్వం మీకు వచ్చేసింది కాబట్టి ఆ భయమూ లేదు. తక్కువగా మాట్లాడే స్వభావం క్రమ క్రమంగా మీలో వస్తున్నందువల్లా మీ పనిమీదే ధ్యాస మొత్తం కేంద్రీకరింపబడి ఉంటూండడం వల్లా అలా వినోద విహార స్థలాలకి వెళ్లలేకపోతూండవచ్చు. అయితే మీ దంపతులు ఒకేచోట ఉన్నా భిన్నభిన్నమైన ఆసక్తి కలిగిన వారిగా మారి ఇద్దరూ కలిసి ఒక ప్రదేశానికంటూ వెళ్ల(లే)కపోవచ్చు. అది కొద్ది మనస్తాపం అనిపించవచ్చు.

స్నేహితుల్లో మంచి ఆప్తుడైన వానితో మళ్లీ సాన్నిహిత్యం ఏర్పడుతూ ఉండచ్చు. అది మీకు మంచిదే. సుఖాన్నీ దుఃఖాన్నీ నిలవ చేసుకునే స్థలం ఆప్తుని మనసు– అంటుంది జ్యోతిషం. ఆనందాన్ని పంచుకోండి. దుఃఖాన్ని చెరిసగం చేసుకుంటూ ఉండండి. ఇది మీకు నిజానికి మంచి కాలమే. కాబట్టీ– మీదే అనవసర మనస్తాప ఆలోచనతో ఉంటున్నారు కాబట్టీ ఆధ్యాత్మిక ప్రసంగాలనీ గ్రంథాలనీ చదువుతూ ఉండండి. మనోధైర్య స్థాయి పెరుగుతూ ఉంటుంది. భౌతిక చికిత్స వద్దు.

**లౌకిక పరిహారం:** మెరుపుతీగతో పాటు నల్లని మబ్బుని కూడా చూచి ఆనందించండి.
**అలౌకిక పరిహారం:** పసుపు వస్త్రాలని ధరించి పసుపు జలంతో లక్ష్మీదేవిని అభిషేకించండి.

### కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

చేయాల్సిన పనిని గూర్చి ఎలా చెయ్యాలి? ఎప్పుడు చెయ్యాలి? ... అని ఈ తీరుగా ఆలోచించుకుంటూండడం, అది ఎలా కావడానికి వీలు లేదో దాన్ని గురించి అంతర్మథనానికి గురి అవుతూ ఉండడంతో ఈ వారం మొత్తం గడవచ్చు. లోపల సంశయాస్పద భావన ఉన్నంత కాలం ఏదీ జరగడం లేదనే నిరాశాధోరణి ఉన్నంత కాలం ఏ పనినీ చేయలేరు. పనిలోకి దూకడం సరైన కర్తవ్యం. ముందు ఓ వ్యవహారం విషయంలో పట్టుదలకి పోయి ధనం, కాలం, ఆరోగ్యం... నష్టపోయి అనుభవం మీద– పట్టుదల అనేది నష్టానికే తోవ తీస్తుందనే విషయాన్ని గ్రహించుకుని పట్టుదలని మాని అనుకూల ఆలోచనల వైపుకి వస్తారు. ఇది నిజంగా ఆహ్వానించదగిన పరిణామం. సమయానికి తగినట్టుగా వ్యవహరించాలనే దృక్పథాన్ని అలవరచుకుంటారు. చేయదగిన పని ఇదే కూడా. సొంత వృత్తిని చేసుకుంటూ జీవించే వాళ్లకి పాతతరం మారిపోతూ కొత్తతరం వస్తున్న కారణంగా పాత వృత్తి పట్ల నిరాదరణ ఏర్పడవచ్చు. దానిమీద తగినంత ఆదాయం కూడా ఉండని కారణంగా ఇంట్లోనూ బంధుమిత్రులతోనూ కూడా అంత గౌరవం లభించకపోవచ్చు. ఇదో సంధికాలం. కాబట్టి నలుగురితో నారాయణ అన్నట్టుగా కొత్త వృత్తులకి మారడమే మంచిది మనశ్శాంతి కోసం. అనారోగ్యం లేకుండా లేదు గాని అది నిత్య జీవితగమనానికి అడ్డొచ్చేంతది కాదు. పైగా సహజ మానసిక భయం ఉన్న కారణంగా తగు జాగ్రత్తలతోనే ఉంటారు కూడా. వివాహాది ప్రయత్నాలు– న్యాయస్థాన సమస్యలూ వంటివి మధ్య మధ్యలో అడ్డంకులకి గురౌతూ ఉంటాయి తప్ప– పరిష్కారమనేది కుదిరిపోయి– ఈ సమస్య ముగిసిందనే ఆనందాన్ని కలిగించకపోవచ్చు ఈ వారంలో.

**లౌకిక పరిహారం:** ఆలోచన మాత్రమే కాకుండా అమలు కోసం ప్రయత్నించండి.
**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవిని బంగారం ముంచిన స్వర్ణజలంతో అభిషేకించండి.

### సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

మీరే మీరుగా తెచ్చుకున్న పనుల కారణంగా తీవ్రమైన ఒత్తిడులకి గురి అవుతారు. మోయగలిగినంత బరువునే ఎత్తుకోవడానికి సిద్ధం కండి. అదే తీరుగా అత్యాశకి వెళ్లకండి. లోగడ కలిగిన అనారోగ్యం మళ్లీ పడగని ఎత్తి కాటు వేసే ప్రమాదముంది.

మీరు ఒక పెద్దదైన వ్యాపారానికి ఆలోచనని బలంగా చేస్తూండవచ్చు. మంచిదే. అయితే ఆ పనిని నలుగురితో పంచుకుని చేసుకోవడానికి మానసికంగా మీరు సిద్ధపడితే అది సకాలంలో కార్యరూపానికి రాగలుగుతుంది. ప్రస్తుతం ఉన్న స్తబ్దత దానితో పాటు జరగడం లేదనే మానసిక నిరాశభయాలు తొలిగిపోతాయి కూడ.

మీ దగ్గర ఉన్న మొత్తాన్ని మీ సంతానపు చదువుల కోసమే వినియోగించుకోవాలనే దృఢ నిర్ణయం మీద ఉండండి తప్ప, మూడు నెలల్లో కోటీశ్వరుడైపోయే పథకాలకి ఆకర్షింపబడి ఎక్కడా పెట్టుబడిని పెట్టకండి. కనీసం మీరు ప్రారంభిద్దామనుకున్న వ్యాపారంలో కూడా నిర్వహణ చేసే బాధ్యతని తీసుకుని భాగస్వామిగా ఉండండి తప్ప పెట్టుబడిని పెట్టి ఇరుక్కుపోవద్దు.

రవిబుధులు అనుకూలురుగా లేని కారణంగా శారీరక శ్రమ తప్పదు. ప్రయత్నాల కోసం ధనవ్యయం కావచ్చు. ఇవ్వవలసిన వారి నుండి కష్టసమయంలో ధనం రాకపోవచ్చు. కేవలం సమయ నష్టమే జరుగుతూ ఉండిపోవచ్చు.

సంఘంలో గౌరవం ఉంటుంది. ధనాదాయమూ బాగుంటుంది. తల్లిదండ్రుల ఆరోగ్యమూ చక్కగా ఉంటుంది.

**లౌకిక పరిహారం:** పెట్టుబడికి దూరంగా ఉండండి
**అలౌకిక పరిహారం:** వెండి ముంచిన (రౌప్య జలం) నీటితో లక్ష్మీదేవిని అభిషేకించండి.

### కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

విత్తనాలని చల్లి పంట కోసం ఎదురు చూస్తున్న తీరుగా ప్రభుత్వంలో ఉద్యోగం కోసం ప్రయత్నం గట్టిగా చేసి, ఎప్పుడు ఉద్యోగం లభిస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటారు. ఫలితం సానుకూలంగానే ఉండొచ్చు. నిరాశ పడకండి. కొద్దిగా గుంభనని పాటించండి తప్ప ప్రయత్నాలూ వాటి వివరాలూ అనే వాటిని బహిరంగపరచకండి.

ఏదో పుణ్యక్షేత్రానికో వినోద విహార యాత్రకో సకుటుంబంగా వెళ్లొచ్చే అవకాశముంది. అక్కడికెళ్లి వచ్చాక ఏదో ఓ సంస్థని ప్రారంభించాలనే బలమైన ఆలోచనకి రావచ్చు. సాహసోపేతమైన నిర్ణయం అది. బాగా అనుభవం ఉన్నవారితో ముఖ్యంగా ఆ సంస్థ కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారితో మాత్రమే సంప్రదింపులు చేసి, ఓ ప్రాథమిక నిర్ణయానికి రండి తప్ప దూకుడుతనంతో వెళ్లొద్దు. శుక్రుడు అనుకూలంగా లేని కారణంగా కుటుంబంలో ఈ విషయం పట్ల వ్యతిరేకత ఉండొచ్చు. గమనించుకోండి. మీకున్న సహజమైన మంచితనం సంఘంలో గౌరవం కారణంగా మీ సలహా సంప్రదింపుల కోసం ఎవరైనా వస్తే ఒడ్డున ఉండి మాత్రమే ధర్మబద్ధమైన సూచనలివ్వండి తప్ప దానిలో దిగిపోకండి. మీరు ఎన్నుకున్న మీ సొంతపనులు చెడిపోవడంతోబాటు ఏదైనా దురదృష్టవశాత్తు పనిలో వ్యతిరేకత కలిగితే నిందపడే అవకాశముంది కూడా.

న్యాయస్థానాల్లో వెంటనే తీర్పు లభించకపోవచ్చు కాబట్టి ఆ తీర్పు వచ్చిన మీదట చేద్దామనే ఆలోచనలో ఉండకండి. ఎప్పటి ఆలోచనని అప్పుడే చేసుకోవలసిన పరిస్థితి మీది. రాజకీయంగా ప్రయత్నాలని చేయడం మీకు మంచిది కాకపోవచ్చు. ఉద్యోగ, వాణిజ్య పరంగానే పైకి రాగలుగుతారు.

**లౌకిక పరిహారం:** తొందరపాటుతనంతో వ్యవహరించకండి.
**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవిని బెల్లపు నీటితో అభిషేకించండి.

# ఆలూ బోండా



**కావలసినవి:** సెనగ పిండి – ఒక కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; నీళ్లు – అరకప్పుకి కొద్దిగా తక్కువ; పసుపు – పావు టీ స్పూను; మిరపకారం – అర టీ స్పూను; ఇంగువ – కొద్దిగా; బేకింగ్ సోడా – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత.

**స్టఫింగ్ కోసం:** బంగాళ దుంపలు – 5; ఉల్లి తరుగు – అర కప్పు; తరిగిన పచ్చి మిర్చి – 5; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి ముద్ద – ఒక టీ స్పూను; పసుపు – అర టీ స్పూను; ఇంగువ – చిటికెడు; ఆవాలు – ఒక టీ స్పూను; నిమ్మ రసం – అర టీ స్పూను; మినప్పప్పు – రెండు టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● బంగాళ దుంపలను ఉడికించి, తొక్కతీసి, చేతితో మెత్తగా మెదపాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఆవాలు, మినప్పప్పు వేసి వేయించాలి ● ఉల్లి తరుగు జత చేసి బంగారురంగులోకి మారేవరకు వేయించాలి ● అల్లం వెల్లుల్లి ముద్ద, కరివేపాకు, పచ్చి మిర్చి తరుగు జత చేసి మరోమారు వేయించాలి ● పసుపు, ఇంగువ జత చేసి బాగా కలిపిన తర వాత, కొత్తిమీర జత చేసి కలపాలి ● బంగాళ దుంప ముద్ద జత చేసి కలియబెట్టాలి ● తడి పోయి, పొడిపొడిలాడే వరకు స్టౌ మీదే ఉంచి కలుపుతుండాలి ● నిమ్మ రసం, ఉప్పు జత చేసి, దింపే యాలి ● కొద్దిగా చల్లారాక ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయ పరిమాణంలో ఉండలు చేసి పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో సెనగపిండి, బియ్యప్పిండి, నీళ్లు, పసుపు, మిరప కారం, ఇంగువ, బేకింగ్ సోడా, ఉప్పు వేసి తగినన్ని నీళ్లు జోడించి బజ్జీల పిండిగా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాచాలి ● తయారు చేసి ఉంచుకున్న బంగాళ దుంప ఉండలను ఒక స్పూనుతో తీసుకుని, పిండిలో ముంచి, జాగ్రత్తగా నూనెలో వేసి బంగారు రంగులోకి మారే వరకు రెండు వైపులా వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● కొబ్బరి పచ్చడి, సాస్‌లతో తింటే రుచిగా ఉంటాయి.

# చీజ్ స్టఫ్డ్ మష్రూమ్ బాల్స్



**కావలసినవి:** పుట్ట గొడుగులు – 8 (పెద్ద సైజువి); బ్రెడ్ క్రంబ్స్ – తగినన్ని; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా; టూత్‌పిక్స్ – తగినన్ని.

**స్టఫింగ్ కోసం:** ఉడికించిన బంగాళ దుంప – 1 (మెత్తగా మెదపాలి); ఉల్లి తరుగు – పావు కప్పు; అల్లం తురుము – ఒక టీ స్పూను; కొత్తిమీర – రెండు టీ స్పూన్లు; మోజరిల్లా చీజ్ – పావు కప్పు; మిరపకారం – అర టీ స్పూను; చాట్ మసాలా – పావు టీ స్పూను; ఆమ్‌చూర్ పొడి – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత.

**పైభాగం కోసం:** మైదా పిండి – 2 టేబుల్ స్పూన్లు; కార్న్ స్టార్చ్ – 2 టేబుల్ స్పూన్లు; నీళ్లు – పావు కప్పు.

**స్టఫింగ్ తయారీ:** ● ఒక పెద్ద పాత్రలో ఉడికించిన బంగాళ దుపం వేసి మెత్తగా మెదపాలి ● ఉల్లి తరుగు, అల్లం తురుము, కొత్తిమీర జత చేయాలి ● చీజ్ తురుము జత చేసి బాగా కలపాలి ● మిరప కారం, చాట్ మసాలా, ఆమ్ చూర్ పొడి, ఉప్పు వేసి మరోమారు కలిపి పక్కన ఉంచాలి ● పుట్టగొడుగులను తీసుకుని, జాగ్రత్తగా పైన ఉండే తొడిమ వంటి భాగాన్ని కట్ చేసి తీసేయాలి ● తయారుచేసి ఉంచుకున్న స్టఫింగ్‌ను కొద్దికొద్దిగా తీసుకుని పుట్టగొడుగులలోకి స్టఫ్ చేయాలి ● రెండేసి పుట్టగొడుగులను ఎదురెదురుగా ఉంచి దగ్గరగా అయ్యేలా అదిమి, టూత్ పిక్‌తో కలపాలి ● వీటిని కార్న్ ఫ్లోర్, మైదా పిండి మిశ్రమంలో ముంచాలి ● బ్రెడ్ క్రంబ్స్‌లో దొర్లించాలి ● మైదాలోను, బ్రెడ్ క్రంబ్స్‌లోను రెండు సార్లు ఇదే విధంగా చేయాలి (రెండుసార్లు తప్పనిసరిగా చేయాలి. లేదంటే పుట్టగొడుగులు విడిపోతాయి) ● వీటిని ఫ్రిజ్‌లో అరగంట సేపు ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, ఫ్రిజ్‌లో నుంచి పుట్టగొడుగుల బాల్స్ తీసి నూనెలో వేసి గోధుమ రంగులోకి వచ్చేవరకు వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.

## హెల్త్ టిప్ – తలనొప్పి నుంచి ఉపశమనానికి...

● దాల్చినచెక్క ఆహారానికి రుచిని ఇవ్వడమే కాదు.. తలనొప్పిని తగ్గించడానికి కూడా ఉపయోగపడుతుంది. దాల్చిన చెక్కను పొడిగా చేసి నీటిలో కలిపి నుదుటిపై రాసుకుని ఆరగంట తరువాత వేడి నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వలన తలనొప్పి నుంచి ఉపశమనం పొందుతారు ● తాజా ద్రాక్ష పళ్లతో జ్యూస్ చేసుకుని తాగడం వలన తలనొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ జ్యూస్‌ను రోజుకు రెండు సార్లు తాగితే సరిపోతుంది ● అల్లం రసాన్ని కాస్త నిమ్మ రసంలో కలిపి తాగడం వలన తలనొప్పి తగ్గుముఖం పడుతుంది ● తలనొప్పి ఎక్కువైనప్పుడు మెడ, తల భాగాన్ని నొక్కుతూ మెల్లగా మసాజ్ చేసుకోవడం వలన రక్తప్రసరణ పెరిగి తలనొప్పి తగ్గుతుంది.

## ఫుడ్ ప్రింట్స్

**వెదురు బొంగు... ఇంటి పైకప్పుగా మారి నీడనిస్తుంది... సన్నజాజి వంటి పందిళ్లను పెనవేసుకుంటుంది... నిచ్చెనగా మారుతుంది... బుట్టగా తయారై, పెళ్లికూతురుని మోస్తుంది... పూలకు ఆలవాలమవుతుంది... విసనకర్రలుగా మారి, మలయపవనాలు వీస్తుంది... వెదురు మురళిగా మారి సంగీతాన్ని జాలువారుస్తుంది... వెదురు బియ్యంతో వండిన అన్నం ఆకలిని తీరుస్తుంది... ఇప్పుడు వెదురు బొంగు తన పొట్టలో చికెన్‌ను నింపుకుని, బొగ్గుల మీద కాలి, కమ్మటి రుచికరమైన వంటకాన్ని అందిస్తోంది... మారేడుమిల్లి అడవులలో తయారవుతున్న గిరిజన తెగకు చెందిన వెదురు బొంగు చికెన్ మీద ప్రత్యేక కథనం...**





# వెదురును వంటగ మలిచి...

ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం పేరు చెప్పగానే చాలామందికి 1987 సంఘటన గుర్తుకు వస్తుంది. ఆ సంవత్సరం డిసెంబరు 27న ఎనిమిది మంది ఐఏఎస్ ఆఫీసర్లను గుర్తేడు దగ్గర నక్సలైట్లు కిడ్నాప్ చేశారు. ఆ సంఘటన అప్పుడు సంచలనమైంది. ఆ ప్రదేశం ఇప్పుడు సందర్శకులతో కళకళలాడుతోంది. అంతేనా... అక్కడి గిరిజనులు తయారుచేసే వెదురు బొంగు చికెన్ కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి ఆ అటవీ ప్రాంతానికి పర్యాటకులు వేల సంఖ్యలో వస్తున్నారు.

**క్విజీన్‌లలో కూడా...**

బొంగు చికెన్ ఇప్పుడు బాగా పాపులర్ అయ్యింది. పెద్ద పెద్ద రెస్టారెంట్లలో కూడా ఈ వంటకాన్ని మెనూలో చేరుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని కొండారెడ్డి గిరిజన తెగకు చెందిన వారు బొంగు చికెన్‌ను మొట్టమొదటగా తయారు చేసినట్లు చెబుతారు. ఈ వంటకాన్ని హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాలలోని మల్టీ క్విజీన్ రెస్టారెంట్లలో సర్వ్ చేస్తున్నారు. ''ఈ ప్రాంతంలో ఉన్న అందమైన సెలయేళ్ల, వెదురు బొంగు చికెన్ కారణంగా పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఇటీవలి కాలంలో టూరిస్టుల సంఖ్య పెరగడంతో, వెదురు బొంగు చికెన్ గురించి బయటి ప్రపంచానికి బాగా పరిచయమైంది'' అంటారు స్థానిక గిరిజన హక్కుల సంఘం నాయకుడు మొక్కపాటి ప్రకాశ్.

**ఇలా తయారవుతుంది...**

ప్రత్యేకమైన వెదురు బొంగును ఎంచుకుని, మ్యారినేట్ చేసిన చికెన్‌ను ఇందులో స్టఫ్ చేస్తారు. బొగ్గుల మంట మీద ఈ వెదురు బొంగును ఉంచి, లోపలి చికెన్ కాలేలా చూస్తారు. ఇందులో ఒక్క చుక్కనూనె కూడా ఉపయోగించరు. వెదురు బొంగులోకి వెళ్లే ఆవిరి ద్వారానే లోపల ఉన్న చికెన్ కాలుతుంది. ఈ విధానంలోనే వెదురు షూట్ కర్రీ, వెదురు చట్నీ కూడా తయారుచేస్తారు. విదేశీయులు సైతం బొంగు చికెన్‌ను ఇష్టంగా తింటున్నారు.

**ఇంటిల్లిపాదికీ...**

'ఏడాదిగా, చికెన్ ధరలు బాగా పెరిగిపోయాయి. అయినా మేము ప్లేట్ చికెన్ 70 రూ.లకే ఇస్తున్నాం. కేజీకి ఆరేడు ప్లేట్లు వస్తుంది'' అంటారు పదిహేను సంవత్సరాలుగా బొంగు చికెన్‌ను తయారు చేస్తున్న రామారెడ్డి. అతని తండ్రి, సమీపంలోని అడవి నుంచి నెలకొకసారి వెదురు తీసుకువచ్చేవారు. రామారెడ్డి సహాయంతో అతని భార్య రాణి చికెన్ తయారు చేసేది. ఇప్పుడిది పెద్ద మార్కెట్ స్థాయికి చేరబోతోంది. రెండు మల్టీ నేషనల్ కంపెనీలు ఈ గిరిజన బొంగు చికెన్ రెసిపీని పాపులర్ చేయడం కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇటీవలే ఒక కంపెనీ మారేడుమిల్లి వచ్చి, అక్కడే ఉన్న ఇకో టూరిజం గెస్ట్‌హౌస్‌లో రెండు రోజుల పాటు ఉండి, బొంగు చికెన్, ఆలూ ధమ్‌లకి సంబంధించిన సమాచారాన్ని వీడియోల ద్వారా సేకరించింది.



**విద్యార్థులంతా ఇక్కడికే...**

కాకినాడ జెఎన్‌టియు, అమలాపురం, భీమవరం, ఏలూరు వంటి ప్రదేశాలలో చదువుకునే కాలేజీ విద్యార్థులంతా మారేడుమిల్లి వచ్చి బొంగు చికెన్ తింటుంటారు. ఒకసారి 20 మంది విద్యార్థులు అక్కడకు వెళ్లడానికి ప్రణాళిక వేసుకున్నారు. ముందుగానే రామారెడ్డికి కబురు చేశారు. మరుసటిరోజు వీరంతా అక్కడకు వెళ్లారు. బొంగు చికెన్ సిద్ధం చేశారు. అయితే వారిలో ముగ్గురు వెజిటేరియన్లు కావడంతో, రామారెడ్డి అప్పటికప్పుడు వెదురు, కాప్సికమ్ మసాలా తయారు చేశారు.

**అదే... ఆకర్షణ...**

మావోయిస్టులు విస్తృతంగా సంచరించే ప్రాంతం నుంచి ఈ వంటకం ఎక్కడ పుట్టిందనే విషయంలో స్పష్టత లేదు. ఈ వంటకం గురించిన సమాచారం ఇతర రాష్ట్రాలకు ఎలా చేరిందో కూడా పూర్తిగా తెలియదు. ఎక్కడ నుంచి ఎలా వచ్చింది అనే విషయం భోజన ప్రియులకు అనవసరం. ఈ వంటకాన్ని తయారుచేసే విధానమే అందరినీ ఆకర్షిస్తోంది. వెదురు బొంగులోకి చికెన్‌ను స్టఫ్ చేసి, బొగ్గుల మీద నెమ్మదిగా కాల్చడం వల్ల చికెన్ చక్కగా ఉడికి, వెదురులో స్రవించే రసంతో కలిపి, మెత్తగా, రుచికరంగా తయారవుతుంది. ఆ ప్రాంతం ఇప్పుడు మంచి పిక్‌నిక్ స్పాట్‌గా మారింది. ఇప్పుడు కేవలం కొండారెడ్డి గిరిజన జాతికి చెందిన వారు మాత్రమే కాదు, ఇతరులు కూడా ఈ వంటకాన్ని తయారు చేస్తున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్స్ చేతిలోకి వెళ్లిపోతున్నందుకు గిరిజనులు బాధపడుతున్నారు.

**చెట్లను కాపాడుతున్నారు...**

బొంగు చికెన్ తినేవారి సంఖ్య పెరిగిపోవడంతో, వెదురుచెట్లను కొట్టేయవలసి వస్తోంది. అందువల్ల అటవీశాఖ అధికారులు వెదురు చెట్లను విస్తృతంగా పెంచుతూ, గిరిజనులకు సహాయపడుతున్నారు. ఇప్పుడు అక్కడ ఏసీ హోటల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. అటవీశాఖవారు వాటర్ ఫాల్స్, పార్కులను అభివృద్ధి చేసి, పర్యావరణాన్ని కాపాడుతున్నారు. పర్యాటక స్థలాన్ని అక్కడి గిరిజనులే నిర్వహిస్తున్నారు.

## సినిమా

# 25 గెటప్స్‌లో!



● విక్రమ్

సినిమా సినిమాకు విభిన్నంగా కనబడుతుంటారు కొందరు హీరోలు. విక్రమ్ విషయానికి వస్తే ఒక్క సినిమాలోనే విభిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తుంటారు. రకరకాల పాత్రలు చేసి ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంటారు. ఇది వరకు 'అపరిచితుడు, మల్లన్న, ఐ, ఇంకొక్కడు' వంటి సినిమాల్లో రకరకాల గెటప్స్‌లో కనిపించారు. ఇక త్వరలో నటించ నున్న కొత్త చిత్రంలో ఏకంగా 25 గెటప్స్‌లో కనిపిస్తారని తెలిసింది. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విక్రమ్ హీరోగా ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించనున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. విక్రమ్ 25 గెటప్స్ కోసం ఓ అమెరికన్ కంపెనీ వర్క్ చేస్తోంది. ఈ సినిమా ప్రకటించినప్పుడు విడుదల చేసిన పోస్టర్‌లో కూడా విక్రమ్ పలు గెటప్స్‌లో ఉన్నారు.

# అద్దెకు బాయ్‌ఫ్రెండ్

ప్రేమ మీద నమ్మకం లేని ఓ అమ్మాయి బాయ్‌ఫ్రెండ్‌గా ఉండమని ఓ అబ్బాయితో డీల్ కుదుర్చుకుంటుంది. ఆ వెంటనే మరో అమ్మాయి వీరిద్దరి మధ్యలోకి వస్తుంది. అప్పుడు ఎలాంటి ఆసక్తికరమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయనే అంశాల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమాకు 'బీఎఫ్‌హెచ్' (బాయ్‌ఫ్రెండ్ ఫర్ హైర్) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'కేరింత, మనమంత' చిత్రాల ఫేమ్ విశ్వంత్ హీరోగా నటిస్తున్నారు. ఇందులో మాళవికా సతీషన్, పూజా రామచంద్రన్ కథానాయికలుగా నటించనున్నారు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో వేణు మాధవ్ పెద్ది నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాత యశ్ రంగినేని, హీరో విజయ్ దేవరకొండ తండ్రి గోవర్ధన్ దేవరకొండ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 26న ప్రారంభం కానుంది. శివాజీరాజా, రాజా రవీందర్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు గోపీ సుందర్ సంగీతం అందించనున్నారు.



● విశ్వంత్, మాళవికా సతీషన్

# పవర్‌ఫుల్



● నిత్యామీనన్

ఓ నేరానికి సంబంధించిన ఆధారాల కోసం ఓ పోలీసాఫీసర్‌తో కలిసి వర్కవుట్ చేస్తున్నారు నిత్యామీనన్. విషయం ఏంటంటే.. ఆమె ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కథానాయికగా నటిస్తున్నారు. 'ఆరమ్ తిరుకల్పన' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి అజయ్ దేవలోక దర్శకుడు. షైన్ టామ్ చాకో ఈ చిత్రంలో హీరోగా నటిస్తారు. ఓ వాస్తవ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ''ఈ సంఘటన గురించి షైన్‌తో మాట్లాడినప్పుడు చాలా కొత్తగా ఉందన్నాడు. స్క్రీన్‌ప్లే ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. షైన్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు. నిత్యామీనన్ పాత్ర స్ట్రాంగ్ అండ్ పవర్‌ఫుల్‌గా ఉంటుంది'' అని అజయ్ దేవలోక పేర్కొన్నారు.

## తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

ఉపాధి మార్గం ఉంటే ఉద్యోగం వృత్తీ దొరికిన కారణంగా ఆర్థికంగా ఎదుగుతారు. చేసిన రుణభారాన్ని తగ్గించుకోవడాన్ని అమలు చేస్తారు. ఇంట్లో వివాహం కానివాళ్లకి వివాహ ప్రయత్నాలని ప్రారంభిస్తారు కానీ అది వెంటనే అనుకూలించకపోవచ్చు. నిరాశపడకండి. మీకు మానసికంగా కష్టాన్ని కలిగించిన వారిమీద మీరు న్యాయస్థానానికి వెళ్లి ఉండొచ్చు. మరింత అనుకూలమైన తీర్పు మీకు లభించి ఉండచ్చు.

కుటుంబంలో ఏ విధమైన పొరపొచ్చాలూ లేని కారణంగా బంధు ఆప్త గుణంతో ఆనందంగా గడుపుతూ మానసికంగా దృఢంగా ఉంటారు. శారీరకంగా ఏవైనా అనారోగ్యాలున్నా అవన్నీ తాత్కాలిక ఔషధ సేవతో తీరిపోయేవే తప్ప లెక్కించుకోదగినవిగా ఉండవు. దూర భార ప్రయాణాలు తప్పవు. ఉన్న ఊరికి దగ్గరగా బదిలీల వంటివి ఇప్పట్లో సాధ్యపడే అవకాశం ఉండకపోవచ్చు. విత్తనాన్ని నాటిన మరునాడే ఫలాలని ఆశించడం ఎంత వెర్రితనమో అలాగే మీరు చేస్తున్న కృషికి తగిన ఫలితాలు వెంటనే రావడం లేదని భావించడం కూడా అంత అమాయకత్వమూ కావచ్చు కాబట్టి ఓ వ్యవహారంలో మీరు చేస్తున్న కృషిని చేసుకుంటూనే వెళ్లండి తప్ప, వెంటనే ఫలితం గురించి ఆశించకండి– ఎదురు చూడకండి కూడా. వ్యవసాయదారులే గనక మీరయ్యుండి ఉంటే మంచి సహకారం లభించే అవకాశం ఉంది కాబట్టి చక్కటి దిగుబడి వచ్చే తీరుగా సేద్యం చేసుకోగలుగుతారు. అధిక మూల్యం లభిస్తోంది కదా! అనే ఎవరి సూచన మీదనో లేదా మీ సొంత ఆలోచనతోనే అమ్మజూపడం ఏమాత్రమూ సరికాదు. వీలైతే రుణాన్ని తీసుకుని మరో కొంత పొలాన్ని కొనే ప్రయత్నం మంచిది కూడా.

**లౌకిక పరిహారం:** ఫలితాలకి వెంటనే ఎదురు చూడకండి.

**అలౌకిక పరిహారం:** నవధాన్య జలాలతో లక్ష్మీదేవిని అభిషేకించండి.

## వృశ్చికం (అక్టోబర్ 23 - నవంబర్ 21)

ప్రతిపనీ ముఖ్యాతిముఖ్యంగా అనిపిస్తూ ఉంటుంది. వాటిని పూర్తి చేయగల తీరుబడి ఉండడం అనేది ప్రశ్నార్థకంగా అవుతుంది. ఎంత తప్పించుకుందామ నుకున్నా కొన్ని కొన్ని పనులు కుత్తుకమీదికొచ్చి మిగిలిన చేస్తున్న పనులని మానేసి, వాటిని పూర్తి చేసి తీరాల్సిన పరిస్థితికి తెస్తాయి. ఏమైనా ఈ వారం ఒత్తిడి మాత్రం గట్టిగానే ఉంటుంది. తప్పదంతే.

మీ శత్రుపక్షం వారికి ఇంకొక పని లేక మిమ్మల్ని సాధించడం మీకు ఉపకారాన్ని కల్గించడం– అపకీర్తిని మూటగట్టి వీలయినంత చెడుగా మీ గురించి ప్రచారాన్ని చేయడమనే పనిలోనే కంకణం కట్టుకుని ఉండడం కనిపిస్తోంది. ధర్మబద్ధంగానే సాగిపొండి. ఏమీ వ్యతిరేకత మీకు కలగనే కలగదు. ఏదో జరగబోతోందనే భయంతో మిమ్మల్ని వణికింపజేసి మిమ్మల్ని లోబరుచుకోవాలనేదే వాళ్ల ప్రణాళిక. మీ అదృష్టమేమిటంటే– ఏ సమస్యైనా ఉపద్రవరూపంలో అలా మీ నెత్తిమీది దాకా వచ్చి– ఆ క్షణంలోనే గాలికి మేఘంలా అలా కదిలి వెళ్లిపోవడం అదనేదే. దిగులూ భయం నిరాశా ఉన్నా ధైర్యంగా ఉండండి. వ్యతిరేకత జరగదు మీకు.

మాటల్లోనూ రాతల్లోనూ దొరికిపోయే అవకాశముంది కాబట్టి ఆచితూచి మాట్లాడడం– ఆ మాట్లాడిన కొంత కూడా ఎవరి ద్వారానో ఎక్కడో నమోదై వెళ్లబోతోందన్న భయాన్ని లోపల ఉంచుకుని మాత్రమే చెయ్యండి. న్యాయస్థానంలో ఏమాత్రపు అనుకూలతా భార్యాపుత్రుల విషయంలో ఉండనే ఉండదని నిశ్చయం కండి! మంచి మాటలని వింటూ సమయాన్ని గడపడం కూడా సరికాదు ప్రస్తుతానికి.

**లౌకిక పరిహారం:** మాటల్లో రాతల్లో పూర్తి జాగ్రత్తలని పాటించాలి.

**అలౌకిక పరిహారం:** ఆవు పాలతో లక్ష్మీదేవికి అభిషేకాన్ని చేసుకోండి.

## ధనుస్సు (నవంబర్ 22 - డిసెంబర్ 21)

మీపై అధికారులు అనుక్షణం మిమ్మల్ని కనిపెట్టి ఉంటారనీ – ఒత్తిడిని కలిగిస్తుంటారనీ – అవసరమైనా అనవసరమైనా అస్తమానం మీరు చేస్తున్న పనుల్లో జోక్యం చేసుకుంటూ మీకు సమయనష్టాన్ని చేస్తూ మీరు చేసిన పనినే మళ్లీ చేయచవచ్చుననీ.. మానసికంగా సిద్ధపడి ఉండండి. ఇదంతా ఆ శని ఒకటవ యింట ఉండి చేయిస్తున్న పనిగా భావించి శనికి ధ్యానాన్ని చేసుకుంటూ ఆయన అనుగ్రహం కోసం ప్రార్థిస్తూ ఉండండి. మీకు సహజమైన ఉన్నది ఉన్నట్టుగా వ్యక్తి ముఖం మీద మాట్లాడే ధోరణిని పూర్తిగా మార్చుకోండి. తాను కూచున్న కొమ్మని తానే నరుక్కున్న చందంగా లేకుండా చేసుకోవాలంటే ఇది తప్పనిసరి. ఓ సందర్భంలో బహిరంగంగా మీరు దుర్విమర్శ చేసే అవకాశముంది. కాలం సరి లేని సందర్భంలో కడుపులో దాచుకోవడం అవసరమని శాస్త్రం చెప్పేమాట. పాటించి సంతోషాన్ని పొందుతూ మనో దుఃఖాన్ని తొలగించుకోండి. సంతానంతో చిన్న చిన్న అభిప్రాయభేదాలు వచ్చే అవకాశం ఉంది. వీటి విషయంలో స్పష్టతని పాటిస్తూ – ఇలా చేస్తే ఎందుకు మంచిదో, అలా చేస్తే ఎందుకు కాదో– ఆ విషయాన్ని సూటిగానూ నిదానమైన కంఠస్వంతోనూ చెప్పి చూడండి. వినని పక్షంలో 'ముందే చెప్పి ఉండచ్చుగా!' అనే నింద మీకు రాదు. మీ క్షేమానికి అది అవసరం. భార్యాపుత్రులూ లేదా తల్లిదండ్రులూ మీ మాటకంటే బయటివాళ్ల మాటలకి ఎక్కువ విలువనిస్తూ ఉన్నా కూడ మౌనంగానే ఉండండి తప్ప, వాళ్లని సరిదిద్దే ప్రయత్నాన్ని చేయకండి. తలకి తగిలినప్పుడే – ద్వారబంధం వద్ద తలని దించుకుని వెళ్లాలి కొన్ని చోట్ల– అనే నీతి అర్థమౌతుంది.

**లౌకిక పరిహారం:** ధననష్టం, సమయనష్టం, పరువునష్టం.. అన్నిటికీ సిద్ధపడి ఉండండి.

**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవిని మారేడు పత్రాలతో అర్చించండి.

## మకరం (డిసెంబర్ 22 - జనవరి 19)

కొత్తగా చేరిన ఉద్యోగం కంటే ఇంతకు ముందు చేరిన ఉద్యోగమే గొప్పది అనే భావన కలగవచ్చు. కుటుంబంలో ఆనందం గనుక ఉంటే బయటి ఉద్యోగంలో చిన్న ఇబ్బందులున్నా పట్టించుకోం.

అదే ఉద్యోగం చాలా చక్కగా ఉన్నా ఇంటి పరిస్థితి బాగుండకపోయినా ఏమీ అనుకోం గాని, మద్దెలలాగా రెండువైపులా దెబ్బలుంటే మానసిక క్షోభకి గురికాక తప్పదు. జరిగే నష్టం ఉండదుగాని మనోవ్యథ ఉంటుంది.

మీరే ఓ చింతలో ప్రయాణిస్తూ ఉంటే ప్రస్తుత దశలో మరొకరి విషయం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ న్యాయపరిష్కారాన్ని చేయడమనేది సరికాదు. దానివల్ల కొత్త చిక్కు కూడ వచ్చిపడే అవకాశముండచ్చు. నిర్భయంగా చెప్పెయ్యండి. మానసిక శాంతితో లేను కాబట్టి ఈ విషయంలో తలదూర్చలేనే'ని. ఏదో అబద్ధం చెప్పద్దు. వాళ్లకింకా మీ మీద ఆశ ఉండేలా లౌక్యసమాధానాన్ని చెప్పి తప్పించుకోవద్దు. పిల్లల్ని పట్టించుకోండి.

వెండి, బంగారాలూ, వృత్తి ఉద్యోగ వ్యాపార వ్యవహారపత్రాలూ.. వంటి వాటిని వీలయినంతవరకూ తీసుకెళ్లకండి. ఒకవేళ తప్పనిసరి అయితే ఆ సంచి బాధ్యతని మీరు మాత్రమే వహిస్తూ మరోధ్యాసలో ఉండకండి. శని 12వ ఇంటి ఉండి పొంచి చూస్తుంటాడు. శాశ్వత కష్టాన్ని ఎలా కల్గిద్దామా? అని. శుభకార్యం అనుకున్నది అనుకున్నట్లుగా పూర్తవుతుంది. ఇంతకుముందు సంపాదించిన ధనంతోనే సరిపడే స్థాయిలోనే ఆ శుభకార్యం ముగుస్తుంది. రుణం చేయనక్కరలేదు.

**లౌకిక పరిహారం:** ముఖ్యపత్రాలూ సంతానపు చదువూ పట్ల జాగ్రత అత్యంత అవసరం.

**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవికి ఏవైనా సరే ఐదుపండ్ల రసాలతో అభిషేకాన్ని చేయండి.

## కుంభం (జనవరి 20 - ఫిబ్రవరి 18)

ఆదాయమార్గాల్లో అనుకూలత పెరిగే కారణంగా ఇంతకుముందు కాలంలో చేరిన కొన్ని బకాయిలని పూర్తి చేసుకోగలుగుతారు. బంధుమిత్రులతో ఉన్న ఆర్థికమైన లావాదేవీలని పరిష్కరించుకోగలుగుతారు. సంతానం విద్యాబుద్ధులకీ విదేశాల్లో చేర్పించేందుకూ కావలసిన ధనాన్ని మీరు సమకూర్చుకుని ఉన్నా – అదృష్టవశాత్తూ వాళ్లకి ఉపకారవేతనం లభించే సందర్భంగా ఖర్చు చేయాల్సిన సొమ్ము మీకు మిగిలిపోతుంది. ఆశ – అత్యాశ – దురాశ అని మూడు తీరులు. సంపాదించుకున్న ధనాన్ని మరింత పెంచుకోవాలనే తపన మరింతగా అవుతూ కుటుంబాన్ని పట్టించుకోకుండా ఉండే స్థితి రావచ్చు. కొద్దికాలం పాటు అలా సంపాదించుకున్నాక కుటుంబంతో సన్నిహితంగా ఉండడం మంచిది. దానివల్ల కుటుంబంతో శత్రుత్వం కలగదు. మీరు అత్యాశకి పోయే అవకాశమున్న కారణంగా ఓ కొన్ని సంవత్సరాల పాటు విదేశాలకి వెళ్లే ఆలోచన రావచ్చు. అది తప్పక మీ కుటుంబాన్ని మీకు దూరం కల్గించే పరిస్థితిని కల్గించవచ్చు. సంపాదన తగ్గినా ఇంటిని పట్టించుకుంటూ ఉండడం మంచిది. శారీరకమైన ఇబ్బందులు పొడచూపే అవకాశం కారణంగా విదేశీ ప్రయాణం ఆగిపోయినా, కుటుంబం అందరి మాటనీ నిరాదరిస్తూ విదేశయానానికే ప్రాముఖ్యాన్నిచ్చాననే నింద రావచ్చు. సంపాదన ఈ కుటుంబానికే కదా! వాళ్లే విదేశీయాన వ్యతిరేకతని తెలియజేస్తూంటే ఇంక ఎవరికోసం సంపాదనకి ఎగబడాలి? గమనించుకోండి. వ్యాపారస్థులకి అకస్మాత్తుగా మారిన నియమ నిబంధనల దృష్ట్యా లాభం లేకపోవడం లేదా వచ్చిన లాభం నిర్వహణ వ్యయానికి సరిపోయే కారణంగా మనఃక్షోభ కలగడం ఉండచ్చు.

**లౌకిక పరిహారం:** ఇంటిని పట్టించుకోవడం ఉత్తమం.

**అలౌకిక పరిహారం:** లక్ష్మీదేవికి తెల్లని వస్త్రాల సమర్పణ మంచిది.

## మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20)

సంతానంలో ఒకరికి విద్యలో ఏకాగ్రత ఉండకపోవచ్చు. అది తల్లిదండ్రులకి బాధాకరం కావచ్చు. రవి కుజ బుధ శుక్రులు అననుకూలత కారణంగా అంతా మంచికే జరుగుతూన్నట్టు పైకి అన్పించినా అదంతా నిజం కాకపోవచ్చు. కాబట్టి పదిమందిని విచారించి మాత్రమే ఏ పనినైనా చేపట్టడం ఉత్తమం. బంధుమిత్రుల రాకపోకలు బాగా ఉండే కారణంగా చదువులో కొద్దిగా ఏకాగ్రతకి అభ్యంతరాలు ఏర్పడచ్చు. సంతానం కోసం వైజ్ఞానిక వైద్య ప్రయత్నాలు చేసినా లేక సహజంగానైనా సరే ఆధ్యాత్మిక ధోరణితో ప్రయత్నిస్తే తప్పక ఫలితం అనుకూలంగా ఉంటుంది. పలుకుబడిని ఉపయోగిస్తూ ఆర్థికలాభం కోసమని కొన్ని కాంట్రాక్టుల కోసం ప్రయత్నిస్తే ఫలితం మాధ్యమంగా ఉండచ్చు. వివాహాది ప్రయత్నాలు కలిసొచ్చే అవకాశముంది కాబట్టి ప్రయత్నలోపం లేకుండా ఆ దిశగా సాగండి. సంతానంలో ఒకరికి విద్యాపరంగా ప్రతిభ కన్పిస్తూన్నప్పటికీ, ప్రవర్తన పరంగా అంత అనుకూలత గోచరించకపోవచ్చు. రావలసిన బకాయిల కోసం కొద్దిగా ప్రయత్నాన్ని – మెత్తని ధోరణిలో మాట్లాడుతూ మాత్రమే – చేసిన పక్షంలో కొంత ప్రయోజనం లభించవచ్చు. అకస్మాత్తుగా ఆధ్యాత్మిక ధోరణి మీలో ప్రవేశించవచ్చు. అది మంచిదే అవుతుంది. మంచికే అవుతుంది కూడ. లాభసాటి పరిచయాలు ఏర్పడే అవకాశముంది. ఏమైనప్పటికీ వ్యాపారం వృత్తీ – మరో తీరు ఆదాయమార్గం... అనుకుంటూ ఇలాటి ధోరణితోనే సాగిపోతూంటే కుటుంబంతో ఉండే సంబంధ బాంధవ్యాలూ – వీటితోపాటు బంధువులతో ఉండే దగ్గరితనాలూ పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదముందేమో గమనించుకోవడం మరింత అవసరం.

**లౌకిక పరిహారం:** కేవలం ఆదాయమార్గమే జీవితధ్యేయమనే భావన సరికాదు.

**అలౌకిక పరిహారం:** యధాశక్తిగా అన్నప్రసాద వితరణని – లక్ష్మీపూజ చేసి చేయండి.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శనివారం 3-8-2019

# బర్త్‌డేకి ఫస్ట్ లుక్?


● మహేశ్‌బాబు

'సరిలేరు నీకెవ్వరు'లో మహేశ్‌బాబు గెటప్‌కు సంబంధించిన లుక్స్ కొన్ని నెట్టింట్లో వైరలయ్యాయి. కానీ అవి అంత క్లారిటీగా లేవు. ఫుల్ క్లారిటీగా ఉన్న ఫొటోలను త్వరలో చూసే అవకాశం ఉందని సమాచారం. ఈ నెల 9న మహేశ్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'సరిలేరు నీకెవ్వరు'లోని మహేశ్ లుక్‌ని విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోందట. ఇందులో మహేశ్‌బాబు ఆర్మీ మేజర్‌గా నటిస్తున్నారని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. రైల్వేస్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో లవ్ సీన్స్ తెరకెక్కిస్తున్నారు. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్ బాబు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

# కొత్త గెటప్


● అఖిల్

'బొమ్మరిల్లు' భాస్కర్ సినిమాతో బిజీ బిజీగా ఉన్నారు అఖిల్. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఈ మధ్యనే ప్రారంభమైంది. అప్పుడే తదుపరి సినిమాను లైన్‌లో పెడుతున్నారట అఖిల్. 'అ!, కల్కి' చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో అఖిల్ హీరోగా ఓ సినిమా రూపొందనుందని తెలిసింది. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని టాక్. ఇందులో అఖిల్ లుక్ సరికొత్తగా, ఇప్పటివరకూ చూడని విధంగా ఉంటుందట. అందుకే 'బొమ్మరిల్లు' భాస్కర్‌తో చేస్తున్న సినిమా పూర్తయిన తర్వాత ఈ సినిమాను ప్రారంభించాలనుకుంటున్నారట.



# తుగ్లక్ దర్బార్‌లోకి ఎంట్రీ


● అదితీరావ్ హైదరీ

రాజకీయ నాయకుడిగా మారనున్నారు విజయ్ సేతుపతి. ఆయనకు తోడుగా అదితీ రావ్ హైదరీ కూడా జాయిన్ అయ్యారని తెలిసింది. మరి రాజకీయాల్లో వీళ్ల లక్ష్యం ఏంటో స్క్రీన్‌పైనే చూడాలి. విజయ్ సేతుపతి హీరోగా నూతన దర్శకుడు ఢిల్లీ ప్రసాద్ దీనదయాళ్ తెరకెక్కించనున్న తమిళ చిత్రం 'తుగ్లక్ దర్బార్'. పొలిటికల్ ఫ్యాంటసీ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమాలో అదితీ రావ్ హీరోయిన్‌గా నటించనున్నారని చిత్రబృందం ప్రకటించింది. పార్తిబన్ విలన్‌గా నటించనున్నారు. ఇదివరకు మణిరత్నం తీసిన 'నవాబ్'లో విజయ్ సేతుపతి, అదితీ రావ్ నటించారు. జోడీగా నటించడం మాత్రం ఇదే తొలిసారి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# పది సినిమాలు చేసినంత అనుభవం వచ్చింది

- సుజీత్


● సుజీత్, కృష్ణకాంత్

"ఇలాంటి భారీ సినిమాకి అవకాశం రావడం గ్రేట్. పాటల్లోని పదాలు సందర్భానికి తగ్గట్టుగా ఉంటాయి. కమర్షియాల్టీ కోసం పాట రాయలేదు. అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు" అని పాటల రచయిత కృష్ణకాంత్ అన్నారు.

'ఏ చోట నువ్వున్నా.. ఊపిరిలా నేనుంటా, వెంటాడే ఏకాంతం.. లేనట్టే నీకింక, వెన్నంటే నీవుంటే.. నాకేమైనా బావుంటా, దూరాల దారుల్లో.. నీ వెంట నేనుంటా....' అంటూ బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్‌తో యూరప్‌లోని అందమైన మంచుకొండల్లో ఆడిపాడారు ప్రభాస్. 'రన్ రాజా రన్' ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో ప్రభాస్, శ్రద్ధాకపూర్ జంటగా తెరకెక్కిన చిత్రం 'సాహో'. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలవుతోంది. కృష్ణకాంత్ సాహిత్యం అందించగా గురు రాంధ్వా స్వరాలు సమకూర్చిన 'ఏచోట నువ్వున్నా...' అనే పూర్తి నిడివిగల వీడియో పాటను హైదరాబాద్‌లో విడుదల చేసి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడారు...

● నా తొలి సినిమా 'రన్ రాజా రన్' వచ్చి గురువారంతో ఐదేళ్లు అయింది. నా రెండో సినిమా 'సాహో'. తొలి, ద్వితీయ సినిమాకి చాలా టైమ్ పట్టింది. ఈ సమయంలో వేరే సినిమా చేసి ఉండొచ్చు కదా? అని అడుగుతున్నారు. భవిష్యత్ అనేది మన చేతుల్లో ఉండదు. ప్రభాస్‌గారు కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి. ఆయనంటే చాలా ఇష్టం. అందుకే ఇన్ని రోజులు వేచి చూశానేమో. ఇన్నేళ్ల నిరీక్షణలో నేను చాలా నేర్చుకున్నా. ఒక్క 'సాహో'కే పది సినిమాలు చేసినంత అనుభవం వచ్చింది.

● 'బాహుబలి'కంటే ముందే 'సాహో' కథ చెప్పాను. అయితే 'బాహుబలి' విడుదల తర్వాత ప్రభాస్‌గారి స్టార్‌డమ్, మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకుని 'సాహో' కథలో మార్పులు చేయలేదు. యాక్షన్ సీక్వెన్స్ మరింత బెటర్‌గా ఉండేలా చూసుకున్నా. 'బాహుబలి'ని దాటాలనుకోలేదు. దాని ప్రభావం నాపై లేదు. మా సినిమాని 'బాహుబలి'తో పోల్చకూడదు.

● నా రెండో సినిమానే ప్రభాస్‌గారితో చేయడం సంతోషం. ఆయనతో పని చేస్తున్నప్పుడు ఓ స్టార్ హీరోతో చేస్తున్నాననే భావన కలగలేదు. అంత సరదాగా షూటింగ్ జరిగింది. ఈ నెల 15న సినిమా విడుదల చేయాల్సి ఉంది. అయితే హైస్టాండర్డ్ వీఎఫ్‌ఎక్స్ వల్ల ఆలస్యమైంది. వినాయక చవితి పండగ సమయంలో ఈ 30న సినిమాని రిలీజ్ చేస్తున్నాం.

● ఫారిన్‌లో షూటింగ్ పర్మిషన్స్ కోసం కొంచెం ఎక్కువ సమయం పట్టింది. అయితే చిత్రీకరణ సాఫీగా సాగింది. షూటింగ్ ఆలస్యం అయిందని అందరూ అంటున్నారు. బడ్జెట్ తగ్గించాలనుకుని ముందుగానే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేశాం. అందుకే కొంచెం ఆలస్యం అయింది. షూటింగ్ స్టార్ట్ చేశాక ఎక్కడా ఆలస్యం కాలేదు. 'బాహుబలి 2' చిత్రంతోపాటు 'సాహో' టీజర్ రిలీజ్ చేశాం. అయితే అప్పటికి షూటింగ్ కూడా మొదలు పెట్టలేదు. ఆ తర్వాతే మొదలైంది.

● 'సాహో'లో లవ్‌స్టోరీ కూడా ఉంటుంది. మూడు నాలుగు పాటలుంటాయి. అవి కథను ఎక్కడా డిస్టర్బ్ చేయవు. ముందుగా ఒకే సంగీత దర్శకుడితోనే పాటలన్నీ చేయించాలనుకున్నాం. అయితే ఒక్కో పాటకు ఒక్కరు చేయాల్సి వచ్చింది.. దానివల్ల బెస్ట్ వర్క్ వచ్చింది. నేపథ్యసంగీతం ఇద్దరు ముగ్గురు చేస్తే బాగుండదు కానీ, ఒక్కో పాటను ఒక్కరు చేయడం వల్ల నష్టం ఏమీ లేదు.

● 'బాహుబలి' తర్వాత ఇమేజ్‌కి తగ్గ సినిమా చేయాలని ప్రభాస్‌గారు కానీ, నేను కానీ అనుకోలేదు. యాక్షన్ ఎపిసోడ్స్ అంతర్జాతీయ స్థాయిలో ఉండాలనో, బాలీవుడ్ సినిమాతో మ్యాచ్ చేయాలనో తీయలేదు. ప్రేక్షకులకు కొత్తగా ఏం చూపిద్దాం అనుకుని స్టార్ట్ చేశాం. మేం అనుకున్న దాన్ని రీచ్ అయ్యాం. దర్శకులు రాజమౌళి, శంకర్‌గార్లతో నన్ను పోల్చకూడదు. శంకర్‌గారి సినిమాల్లో పాటలు చాలా బాగుంటాయి. 'సాహో' సినిమాలో ఆయన రేంజ్‌లో ఓ పాట ఉండేలా ట్రై చేశా.

# వసూళ్ల వర్షం పడుతోంది

-అభిషేక్ నామా


● అభిషేక్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కోనేరు సత్యనారాయణ, రమేష్ వర్మ, వాసు

''ఈ రోజు నాకు చాలా మెమొరబుల్. ఇలాంటి రోజు కోసమే రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాను. నాకు 'రాక్షసుడు'తో మంచి హిట్ ఇచ్చిన సత్యనారాయణగారికి రుణపడి ఉంటాను'' అన్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ నిర్మించిన చిత్రం 'రాక్షసుడు'. నిర్మాత అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిన్న (శుక్రవారం) విడుదల చేశారు. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''అందరూ సినిమా గురించి పాజిటివ్‌గా చెబుతున్నారు. కమర్షియల్‌గానే కాదు.. క్రిటిక్స్ దగ్గర నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. సత్యనారాయణగారు ఖర్చుకు వెనకాడకుండా తెలుగు రీమేక్ రైట్స్ కొని మాపై నమ్మకంతో మాకు ఇవ్వడమే బిగ్గెస్ట్ సక్సెస్ అని భావిస్తున్నాం. టీమ్ అంతా బాగా కష్టపడ్డాం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు. ''నాపై నమ్మకంతో సినిమా చేసిన సత్యనారాయణగారికి, బెల్లంకొండ సురేశ్, హీరో సాయి శ్రీనివాస్‌కు థ్యాంక్స్. ఈ సినిమా రిజల్ట్ గురించి మూడు రోజులుగా టెన్షన్ పడ్డాను. సినిమా చూసిన తర్వాత నా శ్రీమతి ఫోన్ చేసి 'బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు' అని చెప్పింది. నా సక్సెస్‌లో భాగమైన అందరికీ థ్యాంక్స్'' అన్నారు రమేశ్ వర్మ. ''ఈ సినిమాను రమేష్ వర్మ ఓ కసితో డైరెక్ట్ చేశాడు. సాయి కూడా ఈ సినిమాతో హిట్ కొట్టాలని వెయిట్ చేశాడు. మామూలు వర్షమే కాదు.. కలెక్షన్ల వర్షం కూడా పడుతోంది. సత్యనారాయణగారు మమ్మల్ని పట్టుదలగా ముందుకు నడిపించారు'' అన్నారు అభిషేక్ నామా. ''సాయి తన ఇమేజ్‌ను పక్కనపెట్టి కంటెంట్ ఉన్న సినిమా చేయడానికి అంగీకరించినప్పుడే సక్సెస్ డిసైడై పోయింది'' అన్నారు మల్టీ డైమన్షన్ వాసు. సినిమాటోగ్రఫర్ వెంకట్ మాట్లాడారు.

# నట గురువు ఇక లేరు

రజనీకాంత్, చిరంజీవి ఇప్పటి సూపర్‌స్టార్స్. కానీ వాళ్లకు నటనలో ఓనమాలు దిద్దించిన నటగురువు దేవదాస్ కనకాల. వీరే కాదు రాజేంద్రప్రసాద్, 'శుభలేఖ' సుధాకర్, నాజర్, ప్రదీప్ శక్తి, భానుచందర్, అరుణ్ పాండ్యన్, రఘువర న్, రాంకీ వంటి నటులందరికీ నటనలో శిక్షణ ఇచ్చిన దేవదాస్ కనకాల ఇక లేరు. నటుడిగా, దర్శకుడిగా, నట శిక్షకుడిగా ఇండస్ట్రీలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా దేవదాస్ కనకాల ప్రయాణం సాగింది. నిన్నటితో ఆ ప్రయాణం ఆగిపోయింది. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం దేవదాస్ కనకాల మృతి చెందారు. 1945 జూలై 30 యానాంలోని కనకాల పేటలో కనకాల పాపయ్య, మహాలక్ష్మికి జన్మించారు. ఫ్రెంచ్ పరిపాలనలో ఉన్నప్పుడు వీరి తండ్రి ఎమ్మెల్యేగా పనిచేశారు కూడా. దేవదాస్ కనకాల విశాఖపట్టణంలోని ఎ.వి.యన్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో థియేటర్ ఆర్ట్స్ చదివారు. సినిమా కోసం ఉద్యోగాన్ని సైతం వదిలేశారాయన. పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యనభ్యసించిన తర్వాత నటనలో శిక్షణ కేంద్రం స్థాపించారు. ఎందరో నటీనటులను తీర్చిదిద్ది ఇండస్ట్రీకి పంపించారాయన. చెన్నైలోని అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో, హైదరాబాద్‌లోని మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో అధ్యాపకునిగా చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖలో అధ్యాపకునిగా, శాఖాధిపతిగా పనిచేశారు. నటుడిగా 'ఓ సీత కథ, సిరి సిరి మువ్వ, గ్యాంగ్‌లీడర్, మంచు పల్లకి.


● దేవదాస్ కనకాల


● భార్య లక్ష్మీదేవి, కొడుకు, కోడలు రాజీవ్, సుమలతో...

అమ్మో ఒకటో తారీఖు, మల్లీశ్వరీ, కింగ్, అసాధ్యుడు' వంటి సినిమాల్లో నటించారు. 'అమృతం' టీవీ సీరియల్‌లో కూడా నటించారు. 'చలి చీమలు, నాగవల్లి' అనే చిత్రాలకు దర్శకత్వం వహించారు. దేవదాస్ కనకాల ఇబ్బందుల్లో ఉన్నప్పుడు గురుదక్షిణగా రజనీకాంత్ తన డేట్స్ ఇచ్చినప్పటికీ దేవదాస్ కనకాల తిరస్కరించారట. 1971 నవంబర్ 21న లక్ష్మీదేవిని వివాహం చేసుకున్నారు. వీరి పిల్లలు రాజీవ్ కనకాల, శ్రీ లక్ష్మి కనకాల ఇద్దరూ నటనా రంగంలోనే ఉన్నారు. రాజీవ్ కనకాల భార్య సుమ ప్రముఖ యాంకర్. శ్రీ లక్ష్మి నాటక రంగ ప్రముఖులు డా. పెద్ది రామారావును వివాహం చేసుకున్నారు. 2018లో దేవదాస్ భార్య లక్ష్మి దేవి మరణించారు. భార్య దూరం అయిన బాధలో దేవదాస్ ఎక్కువ శాతం ఇంటికే పరిమితం అయ్యారు. మహేశ్‌బాబు నటించిన 'భరత్ అనే నేను' ఆయన నటించిన చివరి చిత్రం. దేవదాస్ కనకాల మృతి పట్ల ఇండస్ట్రీ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలియజేశారు. శనివారం ఉదయం మణికొండలోని స్వగృహానికి దేవదాస్ భౌతికకాయాన్ని ఆస్పత్రి నుంచి తరలిస్తారు. ఉదయం 11.30. తర్వాత అంత్యక్రియలు ఆరంభమవుతాయి.

# గుణ అనే పిలుస్తారు

- కార్తికేయ

''హిట్లు, సూపర్‌హిట్లు, బ్లాక్‌బస్టర్లు, ఫ్లాప్‌లు వస్తూనే ఉంటాయి. కానీ, కొన్ని సినిమాలు మాత్రమే మనకు గౌరవం తెస్తాయి.. మనల్ని చూసే విధానం బాగుంటుంది. అలాంటి పాత్ర చేసే అవకాశం 'గుణ 369'తో వచ్చింది. ఇక నన్ను 'ఆర్ ఎక్స్ 100' హీరో అనరు. గుణ అనే పిలుస్తారు'' అన్నారు కార్తికేయ. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ, అనఘ జంటగా తెరకెక్కిన చిత్రం 'గుణ 369'. ప్రవీణ కడియాల సమర్పణలో అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం కేక్ కట్ చేసి సంతోషం పంచుకున్నారు. కార్తికేయ మాట్లాడుతూ– ''ఈ క్షణం కోసం వేచి చూశా. ఇప్పటివరకూ నన్ను యూత్‌ఫుల్ హీరో, షర్ట్‌లెస్, లిప్‌లాక్స్... అనే కోణంలో చూసేవారు. ఈ సినిమాతో మహిళలు నన్ను ఓన్ చేసుకుంటున్నారు. మహిళల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఇది కదా మనకు కావాల్సింది? అనిపించింది. ఇలాంటి మంచి పాత్ర నాతో చేయించిన అర్జున్‌కి రుణపడి ఉంటా. మా కాంబినేషన్‌లో మరో సినిమా ఈ ఏడాదిలోనే ప్రారంభిస్తున్నాం'' అన్నారు. ''గుణ 369' సినిమా నిర్మించినందుకు గర్వంగా ఉంది. మంచి విషయాన్ని ఎప్పుడు చెప్పినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సినిమాతో మేం కచ్చితంగా హిట్ కొట్టాం'' అన్నారు ప్రవీణ. ''మా అబ్బాయి హీరో ఎందుకు అయ్యాడా? అనిపించింది. కానీ 'గుణ 369' చూశాక చాలా సంతోషంగా, గర్వంగా ఉంది'' అన్నారు కార్తికేయ తల్లి రజనీ అన్నారు.


● అనిల్, ప్రవీణ, తిరుమల్, కార్తికేయ, అర్జున్







## ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఫర్హార్ట్ సేవలు



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఫిజియో ప్యాట్రిక్ ఫర్హార్ట్... ఇకపై ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు సేవలందించనున్నాడు. ఈ మేరకు అతడు మూడేళ్ల వ్యవధికి శుక్రవారం ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఫర్హార్ట్ ఇటీవలి ప్రపంచ కప్ వరకు భారత సీనియర్ జట్టుకు ఫిజియోగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గతంలో కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, ముంబై ఇండియన్స్‌కూ పనిచేసిన అనుభవం ఉన్న ఫర్హార్ట్... ఢిల్లీ ఫ్రాంచైజీకి సేవలందించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఆ జట్టు రెండు సీజన్లుగా మెరుగైన ప్రదర్శన చేస్తున్న విషయాన్ని గుర్తుచేశాడు. ఫర్హార్ట్‌ను తమ బృందంలో చేర్చుకోవడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు ఢిల్లీ క్యాపిటల్స్ ఈసీవో ధీరజ్ మల్హోత్రా చెప్పాడు.




# ఆట మళ్లీ మొదలు

**నేడు భారత్- వెస్టిండీస్ తొలి టి20 ● ఫ్లోరిడాలోని లాడర్‌హిల్ వేదికగా మ్యాచ్**
**కుర్రాళ్లతో సిద్ధమైన టీమిండియా ● రాత్రి 8 గంటల నుంచి సోనీ టెన్1లో ప్రత్యక్ష ప్రసారం**

లాడర్‌హిల్ (అమెరికా)

మెరుగైన ప్రత్యామ్నాయాలే అనుకోనీ... భవిష్యత్ జట్టు రూపమే అనుకోనీ... వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌లో యువ రక్తంతో బరిలో దిగుతోంది టీమిండియా. బ్యాటింగ్‌లో శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండేలను పరీక్షిస్తూ, కీపింగ్‌లో రిషభ్ పంత్‌పై పూర్తి బాధ్యత మోపుతూ, బౌలింగ్‌లో నవదీప్ సైనీ, రాహుల్ చహర్‌లను ప్రయోగిస్తూ కరీబియన్ పర్యటనను ప్రారంభించనుంది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం లాడర్‌హిల్ వేదికగా తొలి టి20 జరుగనుంది. ప్రపంచ కప్ నుంచి రిక్తహస్తాలతో తిరిగొచ్చిన నేపథ్యంలో.. అభిమానుల ఆవేదనను మరిపించేందుకు కోహ్లి సేనకు ఇదో అవకాశం. అయితే, పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్లయిన వెస్టిండీస్ అనూహ్య ఆటకు పెట్టింది పేరు. ఒంటిచేత్తో ఫలితాన్ని మార్చగల హిట్టర్లున్న ఆ జట్టుపై యువ భారత్ ఎలా పైచేయి సాధిస్తుందో చూడాలి.

### ధావన్ వచ్చాడు.. నంబర్ 4లో రాహుల్

సీనియర్ ఓపెనర్ శిఖర్ ధావన్ పునరాగమనం ఈ సిరీస్‌లో టీమిండియాకు పెద్ద ఉపశమనం. ఎప్పటిలానే రోహిత్, కోహ్లికి అండగా అతడు రాణిస్తే తిరుగుండదు. కానీ, అందరి చూపు నంబర్ 4 పైనే. మంచి స్కోర్లతో ఈ స్థానంలో కేఎల్ రాహుల్ పాతుకుపోవాలని జట్టు ఆశిస్తోంది. ప్రస్తుతానికి మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్‌లలో ఒకరికే అవకాశం దక్కే వీలుంది. మున్ముందు రాహుల్ విఫలమైతే ఈ ఇద్దరికీ చోటుంటుంది. ఇక ఎటువంటి బాదరబందీ లేకుండా ఏకైక వికెట్ కీపర్‌గా ఉన్న పంత్ తన ప్రత్యేకత చాటాల్సి ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్లలో జడేజా ఖాయం. రాహుల్ చహర్ వైపు మొగ్గితే కృనాల్ పాండ్యా బెంచ్‌కే పరిమితం అవుతాడు. ప్రత్యర్థి జట్టులో నలుగురు ఎడమచేతి బ్యాట్స్‌మెన్ ఉన్నందున ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్నా ఆశ్చర్యం లేదు. భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్‌కు తోడు మూడో పేసర్‌గా సైనీ, దీపక్ చహర్‌లలో ఎవరిని తీసుకుంటారో చూడాలి. విండీస్ దూకుడైన ఆటకు అడ్డుకట్ట వేయాలంటే పెద్దగా అనుభవం లేని దళంతో భువీ మరింత కష్టపడాల్సి ఉంటుంది.

### విండీస్ విజృంభించగలదా?

సాధారణంగా చూస్తే విండీస్‌తో టి20 అంటే కొంత కష్టమే అనిపిస్తుంది. ఇప్పుడు మాత్రం ఆ జట్టు కొంత బలహీనంగా ఉంది. గేల్, రసెల్ లేనందున లూయిస్, పూరన్, హెట్‌మైర్ బ్యాటింగ్ భారం మోయాల్సి వస్తోంది. పొలార్డ్ రాణిస్తే ఇబ్బంది ఉండదు కానీ, అతడి ఫామ్ అనిశ్చితం. రావ్‌మన్ పావెల్, పియర్ సత్తా ఏమిటో తెలియాల్సి ఉంది. మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ పునరాగమనం వారికి ఊరట. కానీ పేసర్లు కాట్రెల్, ఒషాన్ థామస్, కెప్టెన్ బ్రాత్‌వైట్‌లకు భారత బ్యాట్స్‌మెన్‌కు సవాల్ విసిరే స్థాయి లేదు. వీరిలో ప్రపంచ కప్‌లో ఆకట్టుకున్న కాట్రెల్ కాస్త మెరుగు. బ్యాట్స్‌మెన్ అసాధారణ స్థాయిలో రాణిస్తే విజయంపై విండీస్ ఆశలు పెట్టుకోవచ్చు.



బ్రాత్‌వైట్

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాహుల్, పాండే/అయ్యర్, పంత్, జడేజా, దీపక్ చహర్/ సైనీ, భువనేశ్వర్, ఖలీల్, రాహుల్ చహర్.

**వెస్టిండీస్:** ఎవిన్ లూయిస్, జాన్ కాంప్‌బెల్, పూరన్, హెట్‌మైర్, పొలార్డ్, రావ్‌మన్ పావెల్, ఖారీ పియర్, బ్రాత్‌వైట్ (కెప్టెన్), నరైన్, కాట్రెల్, థామస్/కీమో పాల్.

### రసెల్ ఔట్

సిరీస్‌కు ముందే విండీస్‌కు ఎదురుదెబ్బ. హార్డ్ హిట్టింగ్ స్టార్ ఆల్ రౌండర్ ఆంద్రీ రసెల్ గాయంతో టి20 సిరీస్ మొత్తానికే దూరమయ్యాడు. అతడి స్థానంలో బ్యాట్స్‌మన్ జేసన్ మొహమ్మద్‌కు చోటిచ్చారు. ఇప్పటికే విధ్వంసక ఓపెనర్ గేల్... జట్టుకు అందుబాటులో లేడు. రసెల్ సేవలను కూడా కోల్పోయిన విండీస్ ఏమేరకు పోటీనిస్తుందో చూడాలి.

### ఆ మ్యాచ్ గుర్తుందా?

లాడర్‌హిల్స్ మైదానం అంటే పరుగుల పండుగే. సరిగ్గా మూడేళ్ల క్రితం ఇక్కడ భారత్–వెస్టిండీస్ మధ్య జరిగిన టి20నే దీనికి ఉదాహరణ. నాటి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 245 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లలో ఎవిన్ లూయిస్ (49 బంతుల్లో 100; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) చెలరేగి శతకం బాదగా, జాన్సన్ చార్లెస్ (33 బంతుల్లో 79; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. రోహిత్ (28 బంతుల్లో 62; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులతో భారత్ దీటుగానే బదులిచ్చింది. అయితే, రహానే (7), కోహ్లి (16) వైఫల్యంతో ఆశలు నీరుగారాయి. కానీ, కేఎల్ రాహుల్ (51 బంతుల్లో 100 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత సెంచరీతో నిలిపాడు. అప్పటి కెప్టెన్ ధోని (25 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్స్) సైతం బ్యాట్ ఝళిపించినా... చివరి బంతికి రెండు పరుగులు తీయాల్సిన పరిస్థితిలో అతడు ఔటయ్యాడు. కడదాక పోరాడిన భారత్ ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది.

### రోహిత్... రికార్డుకు 4 సిక్స్‌ల దూరంలో

టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ టి20ల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడి రికార్డుకు మరో 4 సిక్స్‌ల దూరంలో ఉన్నాడు. ఈ ఫార్మాట్‌లో వెస్టిండీస్ విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్ 105 సిక్స్‌లతో (58 మ్యాచ్‌ల్లో) టాప్‌లో ఉన్నాడు. న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (76 మ్యాచ్‌ల్లో 103 సిక్స్‌లు), రోహిత్ (94 మ్యాచ్‌ల్లో 102 సిక్స్‌లు) అతడి వెనుక నిలిచారు. శనివారం నుంచి భారత్‌తో ప్రారంభమయ్యే మూడు టి20ల సిరీస్‌కు గేల్ దూరంగా ఉన్నందున అతడి రికార్డును రోహిత్ తేలిగ్గా అధిగమించే వీలుంది.

## క్రిస్టియానో రొనాల్డో నాకు స్ఫూర్తి

**టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి**

**జ్యూరిచ్:** ఫుట్‌బాల్‌లో అర్జెంటీనా స్టార్ లయోనల్ మెస్సీ, పోర్చుగల్ దిగ్గజం రొనాల్డోలలో ఎవరు గొప్ప అనేది ఎడతెగని చర్చనీయాంశం. దీనిపై మొత్తం ప్రపంచమే రెండుగా విడిపోయినట్లుగా ఉంటుంది. ఇదే విషయం టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిని అడగ్గా... సందేహం లేకుండా రొనాల్డోకే ఓటేశాడు. సవాళ్లను రొనాల్డో సమర్థంగా స్వీకరించిన తీరే దీనికి కారణంగా చెప్పాడు. ఫిఫా డాట్ కామ్‌తో మాట్లాడుతూ 'నాకు రొనాల్డో స్ఫూర్తి ప్రదాత. నా దృష్టిలో అందరికంటే అతడే ముందుంటాడు. ఆట పట్ల రొనాల్డో నిబద్ధత, విపరీతమైన ఆరాధనను దేనితోనూ పోల్చలేం. అది ప్రతి మ్యాచ్‌లోనూ కనిపిస్తుంది. రొనాల్డో ఏ క్లబ్‌కు ఆడితే ఆ క్లబ్‌నే నేను ఇష్టపడతా' అని స్పష్టం చేశాడు. రొనాల్డోను పరిపూర్ణ ఆటగాడిగా కోహ్లి అభివర్ణించాడు.

## సాయిప్రణీత్ నిష్క్రమణ

- సెమీస్ చేరిన సాత్విక్ సాయిరాజ్–చిరాగ్‌శెట్టి
- థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీ

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ – 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత టైటిల్ ఆశలను మోస్తున్న భమిడిపాటి సాయిప్రణీత్ కూడా ఓటమి పాలయ్యాడు. క్రితం వారం జరిగిన జపాన్ ఓపెన్‌లో సెమీస్ మెట్టు వరకు చేరిన ప్రణీత్ ఈ సారి మాత్రం క్వార్టర్స్ నుంచే ఇంటి దారి పట్టాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రణీత్ 18–21, 12–21తో కంట సునెయామ (జపాన్) చేతిలో వరుస గేమ్‌లలో చిత్తయ్యాడు. పోటాపోటీగా సాగిన మొదటి గేమ్ చివర్లో తడబడిన అతను 18–17 ఆధిక్యం నుంచి 18–21తో గేమ్‌ను కోల్పోయాడు. అనంతరం మరింత చెలరేగిన సునెయామ రెండో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

**డబుల్స్‌లో మిశ్రమ ఫలితాలు**

శుక్రవారం జరిగిన డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌ల్లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. పురుషుల విభాగంలో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్‌శెట్టి జంట 21–17, 17–21, 21–19తో చోయ్ సోల్గ్యు – సియో సెంగ్ జే (కొరియా) ద్వయంపై పోరాడి గెలవగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – అశ్విని పొన్నప్ప జోడి 13–21, 15–21తో యుట వటనాబె – అరిస హిగాషినో (జపాన్) జోడి చేతిలో ఓడింది. నేటి సెమీస్ మ్యాచ్‌లో కొ సంగ్ హ్యూన్ – షిన్ బేక్ చియోల్ (కొరియా) ద్వయంతో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్‌శెట్టి ద్వయం తలపడనుంది.

## ఏదో ఓ రోజు కోచ్ అవుతా: గంగూలీ



**కోల్‌కతా:** భారత కోచ్ అయ్యే ఆలోచన తనకూ ఉందని... ఏదో ఓ రోజు తప్పకుండా అవుతానని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. ప్రస్తుత కోచ్ రవి శాస్త్రిని దాదా నేతృత్వంలో అప్పటి క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) నియమించింది. ఇందులో దిగ్గజాలు సచిన్, వీవీఎస్ లక్ష్మణ్ ఇతర సభ్యులు. అయితే ఇప్పుడు కోచ్ నియామక బాధ్యతను కపిల్ దేవ్ కమిటీ చూసుకుంటుంది. ప్రస్తుతం 47 ఏళ్ల గంగూలీ బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్)కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. శుక్రవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అతను మీడియాతో మాట్లాడుతూ 'కోచ్ కావడంపై నాకు ఆసక్తి ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా భారత కోచ్ అవుతాను. కానీ ఇప్పుడు మాత్రం కాదు. ఎందుకంటే నేనిప్పుడు చాలా బాధ్యతల్లో నిమగ్నమయ్యాను. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ అడ్వైజర్‌గా, క్యాబ్ అధ్యక్షుడిగా, టీవీ వ్యాఖ్యాతగా బిజీగా ఉన్నా. ఇవన్నీ పూర్తయ్యాక కోచ్ పదవి కోసం దరఖాస్తు చేస్తాను' అని అన్నాడు. రవిశాస్త్రి పదవీకాలంపై స్పందించేందుకు ఈ మాజీ కెప్టెన్ నిరాకరించాడు. ప్రస్తుతం భారత చీఫ్ కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసిన వారిలో పేరొందిన కోచ్‌లెవరూ లేరని అతను అభిప్రాయపడ్డాడు.

## భారీ స్కోరు దిశగా ఇంగ్లండ్

**తొలి ఇన్నింగ్స్‌లో 267/4 ● రోరీ బర్న్స్ అజేయ సెంచరీ**


రోరీ బర్న్స్

**బర్మింగ్‌హామ్:** యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు తొలి టెస్టులో పైచేయి సాధించేందుకు పరుగుల బాట పట్టింది. టాపార్డర్ బ్యాట్స్‌మెన్ రాణించడంతో భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఓపెనర్ రోరీ బర్న్స్ (282 బంతుల్లో 125 బ్యాటింగ్; 16 ఫోర్లు) అజేయ శతకం సాధించగా, కెప్టెన్ జో రూట్ (119 బంతుల్లో 57; 6 ఫోర్లు) అర్ధసెంచరీ చేశాడు. ఆసీస్ బౌలర్లలో ప్యాటిన్సన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆట నిలిచే సమయానికి బర్న్స్‌తో పాటు స్టోక్స్ (71 బంతుల్లో 38 బ్యాటింగ్; 6 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

**రాయ్ విఫలమైనా...**

రెండో రోజు ఆరంభంలోనే ఇంగ్లండ్‌కు రాయ్ రూపంలో తొలి దెబ్బ తగిలింది. 10/0 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం ఆట కొనసాగించిన ఇంగ్లండ్ కాసేపటికే ఓపెనర్ రాయ్ (10)ను కోల్పోయింది. ప్యాటిన్సన్ బౌన్సర్‌ను ఆడిన రాయ్ రెండో స్లిప్‌లో ఉన్న స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత ఓపెనర్ బర్న్స్‌కు కెప్టెన్ రూట్ జతయ్యాడు. భోజన విరామ సమయానికి ఇంగ్లండ్ వికెట్ నష్టానికి 71 పరుగులు చేసింది.

**రూట్ అర్ధసెంచరీ**

రెండో సెషన్ పూర్తిగా ఇంగ్లండ్ వశమైంది. బర్న్స్, రూట్ కుదురుగా ఆడటంతో కంగారూ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. ఓపెనర్ బర్న్స్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... కాసేపటి తర్వాత ఇంగ్లండ్ 39వ ఓవర్లో 100 పరుగులు దాటింది. రూట్ అడపాదడపా బౌండరీలు బాదడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. డ్రింక్స్ తర్వాత రూట్ 110 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. కాసేపటికి సిడిల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి రూట్ నిష్క్రమించాడు. దీంతో 132 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

**శతక్కొట్టిన బర్న్స్**

రూట్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన డెన్లీ (18; 3 ఫోర్లు), తర్వాత వచ్చిన బట్లర్ (5)స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల వద్ద నాలుగో వికెట్‌ను కోల్పోయింది. తర్వాత స్టోక్స్ అండతో బర్న్స్ 224 బంతుల్లో టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. వీళ్లిద్దరు పట్టుదలతో ఆడటంతో ఇంగ్లండ్ మరో వికెట్ కోల్పోకుండా రెండో రోజును ముగించింది. కమిన్స్, సిడిల్ చెరో వికెట్ తీశారు.

## అది నా ఒక్కడి నిర్ణయం కాదు: బంగర్

**ధోని ఏడో స్థానంపై బ్యాటింగ్ కోచ్ వివరణ**



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన ప్రపంచకప్ సెమీస్ మ్యాచ్‌లో ధోనిని ఏడో స్థానంలో దించడమనేది సమష్టి నిర్ణయమని బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ వివరించాడు. 'ఈ అంశంలో కొందరు నన్నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారో తెలియదు. ఎందుకంటే నాకొక్కడికే నిర్ణయాధికారం లేదనే విషయాన్ని అందరూ గుర్తించాలి. ఇదంతా టీమ్ మేనేజ్‌మెంట్ సమష్టి నిర్ణయం. ఇందుకు ఎన్నో అంశాల్ని, పరిస్థితుల్ని పరిశీలించాకే ఆ నిర్ణయం (ఏడో స్థానంలో ధోని) తీసుకున్నాం' అని బంగర్ అన్నాడు. ఈ విషయం జట్టులో అందరికీ తెలుసని, మ్యాచ్ ముగిశాక కెప్టెన్ కోహ్లి కూడా ఈ నిర్ణయంపై వివరణ ఇచ్చాడని అతను గుర్తుచేశాడు. కివీస్ విధించిన 240 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకిదిగిన భారత్ పది ఓవర్లయిన పూర్తి కాకముందే 24 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయింది. ఐదో స్థానంలో దినేశ్ కార్తీక్‌ను, తర్వాత హార్దిక్ పాండ్యాను దించాక ఏడో స్థానంలో ధోనిని పంపించడం, అతనితో కలిసి జడేజా పోరాడినా జట్టు గెలవలేకపోవడంతో తీవ్ర విమర్శలు చెలరేగాయి. కీలకమైన మ్యాచ్‌లో అనుభవజ్ఞుడైన మాజీ కెప్టెన్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో దిగువన బరిలోకి దించడమేంటని భారత క్రికెట్ దిగ్గజాలు మండిపడ్డారు.

## భారత్ 'ఎ' లక్ష్యం 278

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** వెస్టిండీస్ 'ఎ'తో జరుగుతోన్న రెండో అనధికార టెస్టులో భారత బౌలర్లు కృష్ణప్ప గౌతమ్ (5/17), సందీప్ వారియర్ (3/45) అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో 12/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ 'ఎ' 39.5 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. సునీల్ ఆంబ్రిస్ (71; 10 ఫోర్లు), బ్లాక్ వుడ్ (31; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 128 పరుగులు కలుపుకొని భారత్ ముందు విండీస్ 278 పరుగుల లక్ష్యాన్ని విధించింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 46.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. 20 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన భారత్ 'ఎ'ను ప్రియాంక్ పాంచల్ (125 బంతుల్లో 58; 8 ఫోర్లు), శివం దూబే (85 బంతుల్లో 79; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. కీమర్ హోల్డర్ (5/54), షెఫర్డ్ (3/29), రేమన్ రీఫర్ (2/42) ధాటికి ముగ్గురు భారత బ్యాట్స్‌మెన్ డకౌట్ కాగా... మరో నలుగురు సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. కృష్ణప్ప గౌతమ్ (18) కాసేపు క్రీజులో నిలిచాడు. విండీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు చేసింది. నేడు ఆటకు చివరి రోజు.

## మరో రెండు పతకాలు ఖాయం

**సెమీస్ చేరిన సోలంకీ, గోవింద్ ● రష్యా బాక్సింగ్ టోర్నమెంట్**

**న్యూఢిల్లీ:** మగోమెడ్ సాలమ్ ఉమఖనోవ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. 56 కేజీల క్వార్టర్స్ బౌట్‌లో కామన్వెల్త్ గేమ్స్ పసిడి పతక విజేత గౌరవ్ సోలంకీ 3–2తో మక్సిమ్ చెర్నిషెవ్ (రష్యా)ను మట్టికరిపించాడు. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత బాక్సర్ గోవింద్ సహాని (49 కేజీలు) నాకౌట్ పంచ్‌తో షేర్మఖమ్మద్ రుస్తామోవ్ (తజికిస్తాన్)పై గెలిచాడు. అయితే 52 కేజీల విభాగంలో పోటీపడ్డ ఆశిష్ ఇన్‌షాకు మాత్రం క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. 1–4తో ఇస్లమిత్‌దిన్ అలిసొల్తనోవ్ (రష్యా) చేతిలో ఓడాడు. గాయంతో సంజీత్ (91 కేజీలు) క్వార్టర్స్ బౌట్ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే మహిళల విభాగంలో భారత్‌కు 4 పతకాలు ఖాయమయ్యాయి.

**ఫైనల్లో నీరజ్**

భారత మహిళా బాక్సర్ నీరజ్ తుది పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం ముగిసిన మహిళల 57 కేజీల సెమీస్ బౌట్‌లో నీరజ్ 3–2తో ప్రపంచ చాంపియన్ మెసియానో (ఇటలీ)ను మట్టికరిపించింది.

# టైటాన్స్ నాన్ టెక్నికల్ టై



**ముంబై:** తెలుగు టైటాన్స్ ఆటగాళ్ల అత్యుత్సాహం జట్టుకు విజయాన్ని దూరం చేసింది. సాధారణంగా మ్యాచ్ ముగిశాక రిఫరీ వేసే లాంగ్ విజిల్ కంటే ముందుగా కబడ్డీ కోర్టు వెలుపల ఉన్న సహచర ఆటగాళ్లు గెలిచామనే ఆనందంతో కోర్టులోకి దూసుకొచ్చారు. దీంతో ఆగ్రహించిన రిఫరీలు యూపీ యోధకు నాన్ టెక్నికల్ రైడ్ పాయింట్ కేటాయించడంతో... టైటాన్స్‌కు ఈ సీజన్‌లో దక్కాల్సిన తొలి విజయం కాస్తా 'టై'గా ముగిసింది. ముంబై వేదికగా శుక్రవారం ముగిసిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, యూపీ యోధ జట్లు నిర్ణీత సమయానికి 20–20తో సమంగా నిలిచాయి. దీంతో ప్రొ కబడ్డీ సీజన్ – 7లో తొలి 'టై' నమోదైంది. టైటాన్స్ తరపున సిద్ధార్థ్ దేశాయ్ (5 పాయింట్లతో) ఫర్వాలేదనిపించాడు.

**చేజేతులా...**

ఎలాగైనా విజయాన్ని నమోదు చేయాలనే పట్టుదలతో బరిలో దిగిన టైటాన్స్ మొదట ఆధిక్యాన్ని ఆ తర్వాత గెలుపుని చేజేతులా జారవిడుచుకుంది. మొదట 7–3తో ఆధిక్యంలో ఉన్న సమయంలో అలసత్వం ప్రదర్శించడంతో యూపీ వరుస పాయింట్లను సాధించి స్కోర్‌ను సమం చేసింది. మళ్లీ చివరి నిమిషంలో అదే అలసత్వం ప్రదర్శించి గెలుపును వదులుకుంది. మ్యాచ్ చివరి క్షణాల్లో కూతకెళ్లిన టైటాన్స్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ పాయింట్ సాధించి జట్టును 20–19తో ఆధిక్యంలో నిలిపాడు. దీంతో గెలిచామనే ఆనందంలో టైటాన్స్ జట్టు సభ్యులు రిఫరీ లాంగ్ విజిల్ వేశాడా..? లేదా... అనేది చూసుకోకుండా కోర్టులోకి దూసుకురావడంతో రిఫరీలు యూపీ జట్టుకు నాన్ టెక్నికల్ రైడ్ పాయింట్‌ను కేటాయించారు. దీనిపై టైటాన్స్ సమీక్షకు వెళ్లగా... టీవీ అంపైర్ రిఫరీల నిర్ణయానికే కట్టుబడటంతో గెలవాల్సిన మ్యాచ్ కాస్త టైగా ముగిసింది.

**ఆఖరి పంచ్ ముంబైదే..**

ముంబై వేదికగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఆఖరి పంచ్ ముంబై కొట్టింది. గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌పై 20–32తో ముంబై గెలిచి వరుస పరాజయాలకు ఫుల్‌స్టాప్ పెట్టింది. ముంబై ఆటగాళ్లు సురేందర్ సింగ్ 9 పాయింట్లతో, అభిషేక్ సింగ్ 6 పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర వహించారు. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; బెంగాల్ వారియర్స్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి.**

సాక్షి బిజినెస్
శనివారం
3-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 100 ▲ | 17 ▲ |
| 37,118 | 10,997 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30గం.లకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,972 | ▼ 139 |
| డోజోన్స్ | 26,331 | ▼ 252 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,407 | ▼ 178 |
| డాక్స్ | 11,872 | ▼ 381 |
| షాంఘై | 2,869 | ▼ 41 |
| నికాయ్ | 21,087 | ▼ 454 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.45 | 70.09 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 82.31 | 85.33 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.30 | 78.15 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.47 | 65.94 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.20 | 48.36 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.51 | 51.25 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.83 | 19.54 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.25 | 19.77 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.41 | 10.76 |

# ఎస్‌బీఐ లాభం 2,312 కోట్లు

## గత క్యూ1లో రూ. 4,876 కోట్ల నష్టాలు

- వరుసగా నాలుగో క్వార్టర్‌లోనూ లాభాలే
- మెరుగుపడిన రుణ నాణ్యత
- త్వరలో ఎస్‌బీఐ కార్డ్ ఐపీఓ
- ఫలితాలు బావున్నా 3 శాతం పతనమైన షేర్
- తాజా మొండిబకాయిలు పెరగడమే కారణం

**ముంబై:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.2,312 కోట్ల నికర లాభాన్ని (స్టాండ్ అలోన్)సాధించింది. గత క్యూ1లో రూ.4,876 కోట్ల నికర నష్టాలు వచ్చాయని ఎస్‌బీఐ తెలిపింది. వడ్డీ ఆదాయం అధికంగా రావడం, మొండిబకాయిలు తగ్గిన కారణంగా కేటాయింపులు తక్కువగా ఉండటంతో ఈ క్యూ1లో లాభాలు వచ్చాయని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ వివరించారు. మొత్తం ఆదాయం రూ.65,493 కోట్ల నుంచి రూ.70,653 కోట్లకు పెరిగింది. ఆర్థిక ఫలితాలకు సంబంధించి ఇతర వివరాలు...

**» నికర వడ్డీ ఆదాయం 5 శాతం అప్...**

బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 5 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.21,798 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం ఈ క్యూ1లో రూ.22,939 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 2.95 శాతం నుంచి 3.01 శాతానికి ఎగసింది. బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ1లో 9.95 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 7.53 శాతానికి తగ్గాయి. అలాగే నికర మొండి బకాయిలు 4.84% నుంచి 3.07 శాతానికి తగ్గాయి. మొండిబకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గాయి. గత క్యూ1లో రూ.16,849 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ1లో 35 శాతం తగ్గి రూ.10,934 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 79.34 శాతంగా ఉంది. అయితే తాజా మొండిబకాయిలు ఈ క్యూ1లో భారీగా, రూ.16,212 కోట్లకు పెరిగాయి. ఒక మహారత్న కంపెనీకి చెందిన రూ.2,000 కోట్ల రుణం ఎన్‌పీఏగా మారడం, వ్యవసాయ, ఎస్ఎంఈ రుణాలు ఎన్‌పీఏలుగా మారడంతో ఈ క్యూ1లో తాజా మొండి బకాయిలు పెరిగాయి.




**» రూ. 5,769 కోట్ల రికవరీలు...**

మొండి బకీలకు సంబంధించి రికవరీలు, అప్‌గ్రేడ్‌లు రూ.5,769 కోట్లకు పెరిగాయి. దివాలా ప్రక్రియ నడుస్తున్న ఎస్సార్, భూషణ్ స్టీల్, అలోక్ ఇండస్ట్రీస్‌ల కేసులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ ఖాతాల నుంచి రూ.16,000 కోట్ల రుణాలు రికవరీ అవుతాయి. బ్యాంక్ క్యాపిటల్ అడెక్వసీ రేషియో 12.89% నుంచి 12.83 శాతానికి మెరుగుపడింది.

**» రూ.7,000 కోట్ల సమీకరణ....**

అదనపు టైర్–1 బాండ్ల జారీ ద్వారా రూ.7,000 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నామని బ్యాంక్ తెలిపింది. మరో రూ.20,000 కోట్ల నిధులు సమీకరించాలని కూడా ఆలోచిస్తున్నామని, అయితే దీనికి సమయం పడుతుందని బ్యాంక్ చైర్మన్ రజనీశ్ కుమార్ తెలిపారు. మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడేదాకా వేచి చూస్తామని పేర్కొన్నారు. ఈ నాలుగో క్వార్టర్‌లో ఎస్‌బీఐ కార్డ్ ఐపీఓ ఉంటుందని, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఐపీఓ వచ్చే ఏడాది ఉంటుందని ఆయన తెలిపారు.

*రూ.2,312 కోట్ల నికర లాభం రావడం, రుణ నాణ్యత మెరుగుపడటం వంటి సానుకూలతలున్నా, బీఎస్ఈలో ఎస్‌బీఐ షేర్ నష్టపోయింది. తాజా మొండి బకాయిలు పెరగడంతో ఎస్‌బీఐ షేర్ 3 శాతం నష్టంతో రూ.308 వద్ద ముగిసింది.*

## రోజూ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను....

వరుసగా నాలుగో క్వార్టర్‌లోనూ లాభాలు సాధించామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. క్రమక్రమంగా మెరుగుపడుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది, ఇతర వ్యయాలు నియంత్రణలోనే ఉన్నాయని, ఆదాయానికి, వ్యయానికి గల నిష్పత్తి అర శాతం తగ్గి 2.03 శాతానికి చేరిందని వివరించారు. నిర్వహణ లాభం పెంచుకోవడంపై దృష్టి పెట్టామని, ఈ క్యూ1లో నిర్వహణ లాభం 11 శాతం వృద్ధితో రూ.13,246కు పెరిగిందని పేర్కొన్నారు. రుణ వృద్ధి అంతంతమాత్రంగానే ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో నికర వడ్డీ మార్జిన్ పెంచుకోవడం కష్టమైన పనేనని అంగీకరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 శాతం రుణ వృద్ధి, 3.1 శాతం నికర వడ్డీ మార్జిన్ సాధించగలమని పేర్కొన్నారు. మొండిబకాయిలు వసూలు కావాలని ప్రతి రోజూ దేవుడ్ని ప్రార్థిస్తున్నానని చెప్పారు. వాహన రంగంలో మందగమనం చోటు చేసుకోవడం వల్ల తామెలాంటి ఆందోళన చెందడం లేదని పేర్కొన్నారు. మొత్తం రిటైల్ వాహన రుణాలు రూ.71,000 కోట్లుగా ఉన్నాయని, వీటిల్లో వాహన డీలర్ల రుణాలు రూ.11,500 కోట్లని రజనీష్ కుమార్ తెలిపారు.

## ప్రాఫిట్ ప్లస్ డైలీ

### రూ.148కే టర్మ్‌ప్లాన్

ఎడెల్‌వీజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ మొబిక్విక్ భాగస్వామ్యంతో రూ.లక్ష నుంచి జీవిత బీమా పాలసీలను ఆఫర్ చేస్తోంది. మొబిక్విక్ ప్లాట్‌ఫామ్ ద్వారా యూజర్లు గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవచ్చు. రూ.లక్ష, రూ.3 లక్షలు, రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్‌తో ఈ పాలసీలు అందుబాటులో ఉంటాయి. రూ.లక్ష బీమాకు ఏడాదికి ప్రీమియం రూ.148. అదే రూ.3 లక్షల బీమాకు ప్రీమియం రూ.443, రూ.5 లక్షల బీమాకు ప్రీమియం రూ.738. ఇవి టర్మ్ పాలసీలు. సాధారణంగా ఎండోమెంట్ పాలసీలతో పోలిస్తే టర్మ్ పాలసీల ప్రీమియం చౌకగా ఉంటుంది. ఇవి పూర్తి స్థాయి బీమా రక్షణతో కూడిన పాలసీలు. గడువు తీరిన తర్వాత పాలసీదారులు జీవించి ఉన్నా చెల్లించిన ప్రీమియం తిరిగి రాదు. మొబైల్ టెక్నాలజీల వినియోగం పెరుగుదల, ఇంటర్నెట్ విస్తరణ నేపథ్యంలో కస్టమర్లకు బీమా ఉత్పత్తుల ద్వారా చేరువ కావడానికి మొబిక్విక్ వంటి ఫిన్‌టెక్ సంస్థలు వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని ఎడెల్‌వీజ్ టోకియో లైఫ్ ఎండీ, సీఈవో సుమిత్‌రాయ్ వ్యాఖ్యానించారు.

## గోల్డ్ బాండ్ ధర గ్రాముకు రూ. 3,499




**న్యూఢిల్లీ:** సావరిన్ గోల్డ్ బాండ్స్ 2019–2020 (సిరీస్ 3) జారీ ధరను కేంద్రం గ్రాముకు రూ.3,499గా స్థిరీకరించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. బాండ్లకు చందా చెల్లింపు ఆగస్టు 5వ తేదీన ప్రారంభమవుతుంది. ఆగస్టు 9వ తేదీన ముగుస్తుంది. సెటిల్‌మెంట్ తేదీ ఆగస్టు 14 అని ఆర్థిక శాఖ తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, డిజిటల్ పద్ధతిలో చెల్లింపులు జరిపే వారికి గ్రాముకు రూ.50 వరకూ డిస్కౌంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే అటువంటి ఇన్వెస్టర్లు గ్రాముకు చెల్లించాల్సింది రూ.3,449 మాత్రమేనన్న మాట. దేశంలో బంగారానికి (ఫిజికల్‌గా) డిమాండ్‌ను తగ్గించడం లక్ష్యంగా 2015 నవంబర్‌లో కేంద్రం సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ప్రారంభించింది.

## మళ్లీ లాభాల్లోకి ఆంధ్రాబ్యాంకు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** బ్యాంకింగ్ రంగ సంస్థ ఆంధ్రాబ్యాంకు జూన్ త్రైమాసికం స్టాండ్‌లోన్ ఫలితాల్లో లాభాలను ప్రకటించింది. ఈ కాలంలో రూ.51.56 కోట్ల నికరలాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థకు రూ.540 కోట్ల నష్టం వాటిల్లింది. మార్చి త్రైమాసికంలో రూ.1,233 కోట్ల నష్టం చవిచూసింది. టర్నోవరు రూ.5,092 కోట్ల నుంచి రూ.5,437 కోట్లకు ఎగసింది. స్థూల నిరర్థక ఆస్తులు 16.69 నుంచి 16.44 శాతానికి వచ్చి చేరాయి. మార్చిలో ఇది 16.21 శాతం ఉండడం గమనార్హం. ఇక నికర ఎన్‌పీఏలు 7.96 నుంచి 5.67 శాతానికి వచ్చాయి. మార్చి క్వార్టరులో ఇది 5.73 శాతముంది. మొండి బకాయిల కోసం చేసిన కేటాయింపులు రూ.1,388 కోట్ల నుంచి రూ.923 కోట్లకు వచ్చి చేరాయి. కన్సాలిడేటెడ్ ఫలితాల్లో ఆంధ్రా బ్యాంకు రూ.39.5 కోట్ల నికరలాభం ప్రకటించింది.



అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.537 కోట్ల నష్టం నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.5,315 కోట్ల నుంచి రూ.5,724 కోట్లకు చేరింది. 2018–19లో నాలుగు త్రైమాసికాల్లో నష్టాలను చవిచూసింది. మొత్తంగా గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుకు రూ.2,786 కోట్ల నష్టం వాటిల్లింది.

# జీడీపీలో 7కు తగ్గిన భారత్ ర్యాంక్

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాంకు 2018 జీడీపీ ర్యాంకుల్లో భారత్ ఒక ర్యాంకు కోల్పోయి ఏడో స్థానానికి దిగజారింది. 2018లో జీడీపీ పరంగా 2.72 ట్రిలియన్ డాలర్ల పరిమాణంతో బ్రిటన్, ఫ్రాన్స్‌ల తర్వాత స్థానానికి వెళ్లింది. టాప్ 6 దేశాల్లో... అమెరికా (20.5 ట్రిలియన్ డాలర్లు), చైనా (13.6 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.9 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (3.9 ట్రిలియన్ డాలర్లు), బ్రిటన్ (2.82 ట్రిలియన్ డాలర్లు), ఫ్రాన్స్ (2.77 ట్రిలియన్ డాలర్లు) భారత్ కంటే ముందున్నాయి. 2024 నాటికి జీడీపీని 5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది చివరికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యాన్ని పెట్టుకుంది. 2017లో భారత్ ఫ్రాన్స్‌ను అధిగమించి

- ప్రపంచ బ్యాంకు 2018 జీడీపీ ర్యాంకుల విడుదల
- భారత్ కంటే ముందుకెళ్లిన బ్రిటన్, ఫ్రాన్స్
- 2017లో ఆరో స్థానం



ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. స్వల్ప తేడాతో బ్రిటన్‌ను కూడా దాటేసింది. 2017లో భారత జీడీపీ 2.65 ట్రిలియన్ డాలర్లుగా ఉంటే, బ్రిటన్ జీడీపీ 2.64 ట్రిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ జీడీపీ 2.59 ట్రిలియన్ డాలర్లకే పరిమితం కాగా, తిరిగి 2018లో భారత్‌ను దాటి ఈ రెండు దేశాలు ముందుకు వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో దేశ జీడీపీ ఐదేళ్ల కనిష్ట స్థాయికి( 5.8%) పడిపోవడం గమనార్హం. 2018–19 సంవత్సరానికి కూడా జీడీపీ 6.8%కి క్షీణించింది. కరెన్సీ విలువల్లో హెచ్చుతగ్గులు, జీడీపీ వృద్ధి నిదానించడం అంతర్జాతీయ జీడీపీ ర్యాంకుల్లో భారత్ కిందకు రావడానికి కారణాలుగా ఈఅండ్‌వై ముఖ్య విధాన సలహాదారు డీకే శ్రీవాస్తవ తెలిపారు. ఎగుమతులు తగ్గడం, డిమాండ్ పడిపోవడం వంటి పరిస్థితులను గుర్తు చేశారు. వృద్ధి తిరిగి గాడిన పడాలంటే ద్రవ్య ప్రోత్సాహకాలు అవసరమని అభిప్రాయపడ్డారు.

## రూపాయి 54 పైసలు డౌన్

### 69.60కు చేరిక; డాలర్లకు మళ్లీ డిమాండ్



**ముంబై:** చమురు ధరల పెరుగుదల, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం మళ్లీ ముదురుతోందన్న ఆందోళనలు, తరలిపోతున్న విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు రూపాయిపైనా గణనీయమైన ప్రభావం చూపించాయి. డాలర్లకు డిమాండ్ ఏర్పడడంతో శుక్రవారం డాలర్‌తో రూపాయి 54 పైసలు నష్టపోయి రూ.69.60కు చేరింది. రూపాయితోపాటు వర్ధమాన కరెన్సీలపైనా ఈ ప్రభావం పడింది. చైనాకు చెందిన 300 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై అదనంగా 10 శాతం టారిఫ్‌ను సెప్టెంబర్ 1 నుంచి విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం మరోసారి ప్రకటించడం గమనార్హం. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 69.26 వద్ద మొదలైన రూపాయి ఆ తర్వాత ఇంట్రాడేలో రూ.69.67 కనిష్ట స్థాయిని నమోదు చేసి చివరకు 69.60 వద్ద క్లోజయింది. రూపాయికి వరుసగా ఇది రెండో రోజు నష్టం. గురు, శుక్రవారాల్లో మొత్తం మీద డాలర్‌తో 81 పైసలు నష్టపోయింది. వారం మొత్తంమీద నికర నష్టం 71 పైసలు.

# హోమ్ ట్యూషన్స్ @ ఆచార్య.నెట్

- పాఠ్యాంశాలతో పాటు స్కిల్స్, లాంగ్వేజెస్ ట్రెయినింగ్
- 17 వేల సబ్జెక్ట్స్; 7 వేల మంది టీచర్ల నమోదు
- ఏడాదిలో 5 లక్షల మంది స్టూడెంట్స్ లక్ష్యం
- 'స్టార్టప్ డైరీ'తో ఆచార్య.నెట్ ఫౌండర్ రాజేశ్




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** 'ఇక్కడ ట్యూషన్స్ చెప్పబడును' అని ఇంటి గేటుకు బోర్డులు చూస్తుంటాం మనం. అయితే ఇప్పుడీ బోర్డులు ఆచార్య.నెట్‌లోకి ఆన్‌లైన్‌లోకి ఎక్కేశాయి. విజయవాడకు చెందిన ఈ స్టార్టప్ ప్రత్యేకత ఏంటంటే? ఓలా, ఉబెర్‌లలో ఎలాగైతే మనకు దగ్గర్లోని క్యాబ్స్ వివరాలు వస్తాయో.. అచ్చం అలాగే ఆచార్య.నెట్‌లో మన ఇంటికి దగ్గర్లో ఉన్న టీచర్ల వివరాలొస్తాయి. కేజీ నుంచి పీజీ వరకూ అన్ని రకాల పాఠ్యాంశాల ఉపాధ్యాయులు ఇందులో నమోదై ఉన్నారు. మరిన్ని వివరాలు ఫౌండర్ డాక్టర్ రాజేశ్ గుంతి మాటల్లోనే..




ఈ ఏడాది ప్రారంభంలో విజయవాడ కేంద్రంగా ఆచార్య.నెట్‌ను ప్రారంభించాం. స్కూల్ సబ్జెక్ట్స్ నుంచి మొదలుపెడితే బీటెక్, ఎంబీఏ, ఎంటెక్ వంటి ప్రొఫెషనల్ కోర్స్‌లు, ఫైన్ ఆర్ట్స్, హాబీలు, పోటీ పరీక్షల సబ్జెక్ట్స్, లాంగ్వేజెస్ వంటి అన్ని రకాల సబ్జెక్ట్స్ ఉంటాయి. ప్రస్తుతం 17 వేల సబ్జెక్ట్స్, వెయ్యికి పైగా ప్రొఫెషనల్ కోర్స్‌లున్నాయి. 7 వేల మంది అధ్యాపకులు నమోదయ్యారు. ఒక్క టీచర్ రిజిస్ట్రేషన్ కోసం ఏడాదికి రూ.99.

**వివరాలు, ఫీజులు..**

విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలంటే? ఆచార్య.నెట్ యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి.. పేరు, చిరునామా తదితర వివరాలను నమోదు చేయాలి. ఆ తర్వాత విద్యార్థికి కావాల్సిన సబ్జెక్ట్స్‌ను ఎంపిక చేస్తే.. మీ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న నమోదిత టీచర్లు, సమయం, ఫీజుల వివరాలు వస్తాయి. అంతే! మీకు కావాల్సిన టీచర్లను ఎంపిక చేసుకోవటమే. హోమ్ ట్యూషన్ గానీ ఆచార్య సెంటర్‌లో గానీ ట్యూషన్ పొందవచ్చు. ఇప్పటివరకు 26 వేల విజిటర్స్ ఉన్నారు. 1,400 మంది విద్యార్థులు మా సేవలను వినియోగించుకున్నారు.

**ఏడాదిలో 5 లక్షల మంది లక్ష్యం..**

సభ్యత్వం తీసుకున్న విద్యార్థులకు ఏడాది పాటు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఉంటుంది. అధ్యాపకులకు ఖాళీ సమయంలో విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు, ట్యూషన్స్ తీసుకుంటే వారికి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది ముగింపు నాటికి 5 లక్షల మంది విద్యార్థులు, 50 వేల మంది టీచర్ల నమోదు లక్ష్యం.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

# ఐటీసీ లాభం 3,437 కోట్లు

- 13 శాతం వృద్ధి
- 7 శాతం పెరుగుదలతో రూ.12,532 కోట్లకు ఆదాయం



**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 13 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.3,049 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.3,437 కోట్లకు పెరిగిందని ఐటీసీ తెలిపింది. నికర అమ్మకాలు రూ.11,746 కోట్ల నుంచి 7 శాతం వృద్ధితో రూ.12,532 కోట్లకు పెరిగాయని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.7,668 కోట్ల నుంచి రూ.8,114 కోట్లకు చేరాయని వివరించింది. డిమాండ్ అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, నిలకడైన ఆర్థిక ఫలితాలు సాధించామని ఐటీసీ తెలిపింది. ఆర్థిక ఫలితాల వివరాలు...

**సిగరెట్ల విభాగం ఆదాయం రూ.5,433 కోట్లు**

ఈ కంపెనీ ప్రధాన వ్యాపారమైన సిగరెట్ల విభాగం స్థూల ఆదాయం 6 శాతం పెరిగి రూ.5,433 కోట్లకు చేరింది. ఎఫ్ఎంసీజీ విభాగం ఆదాయం 7 శాతం వృద్ధితో రూ.3,060 కోట్లకు చేరింది. బ్రాండ్ బిల్డింగ్ కోసం అధికంగా వ్యయాలు చేయడం, కొత్త కేటగిరీల, కొత్త ప్లాంట్ల వ్యయాలు పెరిగినప్పటికీ, ఈ విభాగం నిర్వహణ లాభం 41 శాతం వృద్ధి చెంది రూ.181 కోట్లకు పెరిగింది. హోటళ్ల విభాగం ఆదాయం 15% వృద్ధితో రూ.393 కోట్లకు చేరింది.

*మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వెలువడ్డాయి. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.263ను తాకింది. చివరకు 1% నష్టంతో రూ.265 వద్ద ముగిసింది.*

## హెచ్‌డీఎఫ్‌సీ లాభం 46 శాతం అప్

### క్యూ1లో రూ.3,203 కోట్లు

**న్యూఢిల్లీ:** హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ. 3,204 కోట్ల నికర లాభం(స్టాండ్‌అలోన్) సాధించింది. గత క్యూ1లో ఆర్జించిన నికర లాభం, రూ.2,190 కోట్లతో పోల్చితే 46% వృద్ధి సాధించామని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.9,952 కోట్ల నుంచి రూ.12,996 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.2,190 కోట్ల నుంచి 43% ఎగసి రూ.3,130 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్)లో 3.3%గా నమోదైంది. మార్పు లేదు.

**రూ.45,000 కోట్ల సమీకరణ.....**

రుణాలు 11 శాతం వృద్ధితో రూ.4.16 లక్షల కోట్లకు పెరిగాయి. స్థూల మొండి బకాయిలు 1.22 శాతం నుంచి 1.29 శాతానికి పెరిగాయి. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన సెక్యూర్డ్, రిడీమబుల్ నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ.45,000 కోట్లు సమీకరించనున్నామని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. దీనికి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని పేర్కొంది.




*ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేర్ 1.7 శాతం లాభంతో రూ.2,124 వద్ద ముగిసింది.*

# ఆర్‌బీఐ నిల్వల బదలాయింపు సరికాదు!

- మాజీ గవర్నర్ దువ్వూరి అభిప్రాయం
- ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందికి ఇది సూచిక
- తరచూ సావరిన్ బాండ్ల జారీ సరికాదు
- సెంట్రల్ బ్యాంక్ స్వయంప్రతిపత్తి నిర్వహణ కీలకాంశం






**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మిగులు నిల్వల బదలాయింపు జరగాలన్న ధోరణిని మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందికర పరిస్థితులను ఇది ప్రస్ఫుటం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపట్ల అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ అంశంలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ నేతృత్వంలోని బిమల్‌జలాన్ కమిటీ కేంద్రానికి తన నివేదికను ఇవ్వడానికి కసరత్తు చేస్తున్న తరుణంలోనే దువ్వూరి ప్రకటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెబుతారని పేరున్న దువ్వూరి సీఎఫ్ఏ సొసైటీ ఇండియా ఇక్కడ శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- తన మొత్తం రుణాల్లో కొంత భాగాన్ని విదేశీ బాండ్ల జారీ ద్వారా సమీకరించుకోవాలన్న 2019–2020 బడ్జెట్ ప్రకటన బాగానే ఉంది. అయితే ఇది ఒకసారికైతే పర్వాలేదు. పదేపదే ఇదే ప్రయోగం అయితే కష్టమవుతుంది.
- సెంట్రల్ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌పై దాడికి ప్రపంచంలో ఎక్కడైనా ఏ ప్రభుత్వమైనా ప్రయత్నిస్తే, అది సరికాదు. ఇది ప్రభుత్వ తీవ్ర ఇబ్బందికర నైరాశ్య ధోరణిని ప్రతిబింబిస్తుంది.
- ప్రపంచంలోని ఇతర సెంట్రల్ బ్యాంకులతో ఆర్‌బీఐని పోల్చిచూడటం సరికాదు. వాటితో పోలిస్తే ఆర్‌బీఐ పనివిధానం, ఇబ్బందులను ఎదుర్కొనే ధోరణి వేరు. అందువల్ల 'మిగులు నిధుల బదలాయింపుల విషయంలో' అంతర్జాతీయంగా అనుసరిస్తున్న విధానాలనే భారత్‌లోనూ అనుసరించాలనుకోవడం సరికాదు.
- అటు ప్రభుత్వ బ్యాలెన్స్ షీట్స్‌తో ఇటు సెంట్రల్ బ్యాంకుల బ్యాలెన్స్ షీట్స్‌ను కూడా అంతర్జాతీయ ఇన్వెస్టర్లు పరిశీలిస్తారు. ఇందుకు తగినట్లు నిర్ణయం తీసుకుంటారు.
- ఆర్‌బీఐ బాధ్యతలు విస్తృతంగా ఉంటాయి. ఎన్నికలు, గెలుపు వంటి కొన్ని అంశాలు ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. ఆర్‌బీఐ విషయంలో ఇలాంటివి ఏవీ ఉండవు. కనుక ఆర్‌బీఐకి ఎప్పుడూ స్వయంప్రతిపత్తి కీలకాంశం.
- ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద దాదాపు రూ. 9 లక్షల కోట్ల రూపాయల మిగులు నిధులున్నాయి. ఆర్‌బీఐ సాయంతో ప్రభుత్వ విత్తలోటు ఆందోళనలు ఉపశమిస్తాయని అంచనా. నిధుల బదిలీ అంశమై బిమల్ జలాన్ కమిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినట్లు తెలిసింది. ఇతర దేశాల కేంద్ర బ్యాంకుల వద్ద మొత్తం అసెట్స్‌లో 14 శాతం రిజర్వుల రూపంలో ఉంటాయి. ఆర్‌బీఐ వద్ద 28 శాతం రిజర్వులున్నాయి. ఈ రిజర్వుల పరిమితిని తగ్గించగా వచ్చే మిగులు నిధులను ప్రభుత్వం వాడుకోవాలని యోచిస్తోంది. గత గవర్నర్ల హయాంలో ఈ అంశమై ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వాలకు మధ్య కొంత మేర ఘర్షణాపూరిత వాతావరణం ఏర్పడింది. గతంలో ఈ అంశంపై చర్చించేందుకు 1997లో సుబ్రమణ్యం కమిటీ, 2004లో ఉషా థోరట్ కమిటీ, 2013లో మాలేగామ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇవన్నీ ఆర్‌బీఐ 12–18% వరకు రిజర్వులుంచుకొని మిగిలినవి ప్రభుత్వానికి బదిలీ చేయాలని సూచించాయి.

## భారీగా తగ్గిన ద్విచక్ర వాహన విక్రయాలు

### జూలైలో రెండంకెల క్షీణత

**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహన కంపెనీల అమ్మకాలు జూలై నెలలో గణనీయంగా పడిపోయాయి. హీరో మోటోకార్ప్.. విక్రయాలు ఏకంగా 21.18% దిగజారి 5,35,810 యూనిట్లకు పరిమితమమ్యాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 27% తగ్గిపోయాయి. ఈ సంస్థ దేశీ విక్రయాలు 49,182 యూనిట్లు కాగా, బజాజ్ ఆటో అమ్మకాల్లో 13%, టీవీఎస్ మోటార్ విక్రయాల్లో 16% తగ్గుదల నమోదైంది. మరోవైపు టాటా మోటార్స్ అమ్మకాలు 34 శాతం తగ్గుదలతో 32,938 యూనిట్లుగా నయోదయ్యాయి. ఇక పూణేలో ఈ సంస్థ ఏడు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఈ ఏడాదిలోనే దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన నగరాల్లో 300 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించింది. ఢిల్లీ, ముంబై, పూణే, బెంగళూరు, హైదరాబాద్‌లలో వీటిని ప్రారంభించనున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది.



**రూ.1.58 లక్షలు తగ్గిన 'కోనా' ధర**

హ్యుందాయ్ తాజాగా విడుదలచేసిన తన తొలి ఎలక్ట్రిక్ కారు 'కోనా' ధరను రూ.1.58 లక్షలు తగ్గించింది. దీంతో ఈ కారు ధర రూ.23.71 లక్షలకు తగ్గింది. జీఎస్‌టీ తగ్గిన నేపథ్యంలో ఈ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీచేయడంలో భాగంగా ఈ మేరకు ధర తగ్గినట్లు కంపెనీ వివరించింది. మహీంద్రా కూడా ఈ–వెరిటో ధరను రూ.80 వేల వరకూ తగ్గించింది.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 2,745 |
| ఎన్ఎస్ఈ | 37,983 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 11,42,377 |
| ఎఫ్ఐఐ | -2,888 |
| డీఐఐ | 2,813 |

## నిఫ్టీ 50

### టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BHARTIARTL | 346.55 | 6.99 |
| ASIANPAINT | 1,548.00 | 2.88 |
| EICHERMOT | 16,982.00 | 2.53 |
| BAJAJ-AUTO | 2,600.55 | 2.48 |
| MARUTI | 5,710.00 | 2.47 |
| HDFC | 2,135.75 | 2.35 |
| ULTRACEMCO | 4,308.40 | 1.81 |
| TECHM | 636.8 | 1.78 |
| M&M | 557.3 | 1.6 |
| HEROMOTOCO | 2,400.75 | 1.36 |

### టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| IBULHSGFIN | 477 | -8.61 |
| TATASTEEL | 407.45 | -2.99 |
| SBIN | 307.95 | -2.9 |
| COALINDIA | 196.9 | -2.74 |
| WIPRO | 263.75 | -2.46 |
| VEDL | 142.3 | -2.17 |
| ONGC | 134 | -2.12 |
| NTPC | 124.35 | -1.97 |
| ZEEL | 340.5 | -1.83 |
| POWERGRID | 210.15 | -1.8 |

# సెన్సెక్స్ 100 పాయింట్లు అప్

- ఎఫ్‌పీఐలకు సూపర్ రిచ్ పన్ను మినహాయింపు !
- కనీస పబ్లిక్ హోల్డింగ్ నిబంధనపై పునరాలోచన!
- దీంతో నష్టాల్లోంచి లాభాల్లోకి వచ్చిన స్టాక్ మార్కెట్
- 100 పాయింట్ల లాభంతో 37,118 పాయింట్లకు సెన్సెక్స్
- 17 పాయింట్లు పెరిగి 10,997కు నిఫ్టీ




వాహన, ఐటీ, ఆర్థిక రంగ షేర్ల దన్నుతో శుక్రవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. చైనా దిగుమతులపై అమెరికా తాజాగా సుంకాలను వడ్డించడంతో ప్రపంచ మార్కెట్లు పతనమైనా, డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనపడ్డా, ముడి చమురు ధరలు భగ్గుమన్నా, మన మార్కెట్ మాత్రం లాభాల్లోనే ముగిసింది. సూపర్ రిచ్ పన్ను నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను మినహాయించే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోందనే వార్తలు సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్100 పాయింట్ల లాభంతో 37,118 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 17 పాయింట్లు పెరిగి 10,997 పాయింట్ల వద్ద ముగిశాయి. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 765 పాయింట్లు(2 శాతం), నిఫ్టీ 287 పాయింట్లు(2.54 శాతం) చొప్పున నష్టపోయాయి. ఈ ఏడాది స్టాక్ మార్కెట్ అత్యధికంగా నష్టపోయిన రెండో వారం ఇదే.

**768 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

ఆసియా మార్కెట్ల పతనం కారణంగా మన మార్కెట్ కూడా నష్టాల్లోనే ఆరంభమైంది. మధ్యాహ్నం వరకూ నష్టాలు కొనసాగాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు సంబంధించి సూపర్ రిచ్ పన్ను సర్‌చార్జీ విషయమై ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎమ్‌ఓ), ఆర్థిక మంత్రిత్వ శాఖ నడుమ చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు వచ్చాయి. సూపర్ రిచ్ పన్ను నుంచి ఎఫ్‌పీఐలను మినహాయించే అవకాశాలున్నాయన్న అంచనాలు పెరిగాయి. మరోవైపు లిస్టెడ్ కంపెనీల్లో ప్రజలకుండే కనీస వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచే ప్రతిపాదనపై కూడా కేంద్రం పున:పరిశీలించనున్నదన్న వార్తలతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల బాట పట్టాయి. జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, ఈ నెలలో వర్షాలు సమృద్ధిగానే కురవగలవన్న వాతావరణ శాఖ అంచనాలు, సేవల రంగం పీఎమ్ఐ గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటం సానుకూల ప్రభావం చూపించాయి. ఒక దశలో సెన్సెక్స్ 411 పాయింట్లు నష్టపోగా, మరో దశలో 357 పాయింట్లు పెరిగింది. మొత్తం మీద రోజంతా 768 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 236 పాయింట్లు పతనమై, ఆ తర్వాత కోలుకొని వంద పాయింట్లు లాభపడింది.

- భారతీ ఎయిర్‌టెల్ 6 శాతం లాభపడి రూ.343 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఈ క్యూ1లో నష్టాలు వచ్చినా, ఏఆర్‌పీయూ, నిర్వహణ లాభాలు పెరగడంతో షేర్ కూడా పెరిగింది.
- వరుసగా నాలుగో క్వార్టర్‌లోనూ లాభాలు వచ్చినా, తాజా మొండి బకాయిలు పెరగడంతో ఎస్‌బీఐ 2.7 శాతం నష్టంతో రూ. 308 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన షేర్ ఇదే.
- నికర లాభం సగం తగ్గడం, జూలై అమ్మకాలు 28 శాతం క్షీణించడంతో అశోక్ లేలాండ్ షేర్ 7 శాతం నష్టంతో రూ. 64.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 12 శాతం నష్టంతో ఐదేళ్ల కనిష్ట స్థాయి, రూ.60.85ను తాకింది.
- కేఫ్ కాఫీ డే కంపెనీ చైర్మన్ సిద్ధార్థ మృతి, ఆ తర్వాత ఆ కంపెనీపై వస్తున్న ప్రతికూల వార్తల కారణంగా కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేర్ నష్టాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఈ షేర్ 10 శాతం లోయర్ సర్క్యూట్‌తో జీవిత కాల కనిష్ట స్థాయి, రూ.99.45ను తాకింది. గత 4 రోజుల్లో ఈ షేర్ 48% నష్టపోయింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,957 కోట్లు హరించుకుపోయి రూ.2,110 కోట్లకు పడిపోయింది.
- స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసినప్పటికీ, ఇంట్రాడేలో 600కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. ఐటీసీ, టాటా మోటార్స్, ఇండియాబుల్స్ ఎక్స్పైడ్ ఇండస్ట్రీస్, ఎస్కార్ట్స్ ఈ జాబితాలో ఉన్నాయి.

### ప్రపంచ మార్కెట్లపై ట్రంప్ సుంకాల దెబ్బ

**30,000 కోట్ల డాలర్ల విలువైన చైనా దిగుమతులపై 10 శాతం సుంకాలు విధించనున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడంతో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి. ఆసియా మార్కెట్లు 1-3 శాతం రేంజ్‌లో, యూరప్ మార్కెట్లు 3 శాతం రేంజ్‌లో నష్టపోయాయి.యూరప్ మార్కెట్లకు ఈ ఏడాది అత్యధిక పతనం ఇదే.**



మంత్రి మేకపాటి గౌతం రెడ్డితో సెల్‌కాన్ సీఎండీ వై.గురు తదితరులు

# ఎలక్ట్రానిక్ పరిశ్రమలతో తిరుపతికి మరింత ప్రగతి

- బిజినెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి మేకపాటి
- యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక తర్ఫీదు

**రేణిగుంట (చిత్తూరు జిల్లా) :** ఎలక్ట్రానిక్ పరిశ్రమలను తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో ఎక్కువగా తీసుకొచ్చి ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే దృక్పథంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి అన్నారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ నూతన భవనాన్ని ఆయన శుక్రవారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో కలసి ప్రారంభించారు. వింగ్‌టెక్ సారథ్యంలో నడుస్తున్న సెల్‌కాన్ ఫెసిలిటీలో సెల్‌ఫోన్లు, చార్జర్ల తయారీ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి కార్మికులతో మాట్లాడారు. కార్బన్ కంపెనీని పరిశీలించారు. ఇప్పటికే 7 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు, రెండో యూనిట్ పూర్తయితే మరో 7 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని కంపెనీ ప్రతినిధులు మాలిక్, నాగేంద్ర మంత్రికి తెలిపారు.

**డిక్సన్ ఫేజ్-2 ప్రారంభం..**

ఈఎంసీ-2లో నిర్మాణంలో ఉన్న సెవెన్ హిల్స్ డిజిటల్ పార్కును మేకపాటి గౌతంరెడ్డి, నారాయణస్వామి, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. డిక్సన్ కంపెనీ ఫేజ్-2 కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. వివిధ కంపెనీల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో సుమారు 10 వేల మందికి ఉద్యోగావకాశాలు రానున్నట్లు మేకపాటి చెప్పారు. పలు కంపెనీల్లో పనిచేస్తున్న యువతకు సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు ప్రభుత్వ నైపుణ్య సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనకు భూమిలిచ్చిన వారికి ఉద్యోగాల కల్పనలో మొదటి ప్రాధాన్యం ఉంటుందని బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ నారాయణ భరత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ బ్యాంకులపై రూ.11 కోట్ల జరిమానా



**ముంబై:** కరెంట్ అకౌంట్ ప్రారంభం విషయంలో నిబంధనలను ఉల్లంఘించిన ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.11 కోట్ల జరిమానా విధించింది. వీటిలో అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (రూ. 2 కోట్ల చొప్పున), బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.1.5 కోట్ల చొప్పున) ఉన్నాయి. ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌పై రూ. కోటి జరిమానా విధించడం జరిగింది. ఇదిలావుండగా, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌కి సంబంధించి నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను కార్పొరేషన్ బ్యాంక్‌పై రూ.కోటి జరిమానా విధించినట్లు మరో ప్రకటనలో ఆర్‌బీఐ తెలిపింది.

# టెలికంలో ధరలు పుంజుకోవడం అత్యవసరం

**కుమారమంగళం బిర్లా**



**న్యూఢిల్లీ:** పోటీపరమైన ఒత్తిళ్లు, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సిన అవసరాలు దేశ టెలికం రంగం ఇబ్బందులను మరింత దారుణంగా మార్చేశాయని వొడాఫోన్ ఐడియా చైర్మన్ కుమారమంగళం బిర్లా అన్నారు. ఈ రంగం దీర్ఘకాల భవిష్యత్తు రీత్యా ధరలు పుంజుకోవడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. నిర్వహణ పరమైన సవాళ్లు ఇప్పటికీ ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. టెలికం రంగంలో స్థిరీకరణ ఫలితంగా మూడు ప్రైవేటు, ఒక ప్రభుత్వరంగ సంస్థ మిగిలాయని, దీర్ఘకాలంలో అవకాశాల నుంచి ఇవి ప్రయోజనం పొందగలవన్నారు. ''దేశ టెలికం ఆపరేటర్లు కఠిన మార్కెట్ పరిస్థితుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ధరల పరమైన ఒత్తిళ్లు కారణంగా ఆపరేటర్లు తక్కువ ధరలకే ప్లాన్లను ఆఫర్ చేయాల్సి వస్తోంది. ఇవి ప్రపంచంలోనే చౌకగా ఉన్నాయి'' అని 2018-19 వార్షిక నివేదికలో వొడాఫోన్ ఐడియా వాటాదారులకు బిర్లా వివరించారు. ఒకవైపు ధరల పరమైన ఒత్తిళ్లు ఉంటే, మరోవైపు బ్రాడ్ బ్యాండ్ కవరేజీ, నెట్‌వర్క్ సామర్థ్యం విస్తరణకు పెద్ద ఎత్తున పెట్టుబడుల అవసరం నెలకొందన్నారు. దీంతో ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆపరేటర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. అయితే, స్థిరకరణ చెందిన టెలికం మార్కెట్లో విజయం సాధించేందుకు వొడాఫోన్ ఐడియా... భారీ స్పెక్ట్రమ్ పోర్ట్‌ఫోలియో, నెట్‌వర్క్ సైట్లు, ఆప్టికల్ ఫైబర్, పంపిణీ విభాగంతో మంచి స్థితిలోనే ఉందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. జియోతో ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తీవ్రంగా పోటీపడుతున్న పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. జూన్ త్రైమాసికంలో వొడాఫోన్ ఐడియా రూ.4,873 కోట్ల నష్టాలను చవిచూసింది.

### నేటి బోర్డు సమావేశాలు

ఎల్ఐసీ హౌసింగ్‌ఫైనాన్స్, కార్పొరేషన్ బ్యాంక్, జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, ఎమ్ఆర్‌పీఎల్, జేకే సిమెంట్, రిలాక్సో ఫుట్‌వేర్, ట్రైడెంట్, సెయింట్ గోబైన్

### బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 36,280 | ▲ 790 |
| బంగారం (22 క్యారెట్లు) | 34,550 | ▲ 750 |
| వెండి (కిలో) | 44,300 | ▲ 600 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,520 | ▲ 760 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,830 | ▲ 730 |
| వెండి (కిలో) | 44,300 | ▲ 600 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,520 | ▲ 760 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,830 | ▲ 730 |
| వెండి (కిలో) | 44,300 | ▲ 600 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,000 | ▲ 350 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,400 | ▲ 250 |
| వెండి (కిలో) | 41,100 | ▲ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 36,340 | ▲ 700 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,800 | ▲ 650 |
| వెండి (కిలో) | 42,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 36,590 | ▲ 810 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,830 | ▲ 730 |
| వెండి (కిలో) | 44,300 | ▲ 600 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 55.73 (రాత్రి 11.30కు) | $53.95 (గురువారం ముగింపు) |
| బ్రెంట్ | 62.17 (రాత్రి 11.30కు) | $60.50 (గురువారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 03-08-2019

| | |
|---|---|
| విశాఖ | 352-00 |
| చిత్తూరు | 368-00 |
| వరంగల్ | 326-00 |
| చెన్నై | 375-00 |
| ముంబై | 378-00 |
| విజయవాడ | 335-00 |
| నమక్కల్ | 364-00 |
| గోదావరి | 330-00 |
| **02-08-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 323-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.85 |
| బెంగళూరు | 355-00 |
| కోల్‌కత్త | 369-00 |
| ఢిల్లీ | 330-00 |

# 11,755 అడుగుల ఎత్తులో ఏటీఎం

**కేదార్ నాథ్ ఆలయంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ కేదార్ నాథ్‌లో తొలి ఏటీఎంను ఏర్పాటు చేసింది. 11,755 అడుగుల ఎత్తులో, దేవాలయ ప్రాంగణంలో ఏటీఎంను ప్రారంభించడం ఇదే తొలిసారని హెచ్‌డీఎఫ్‌సీ ఒక ప్రకటనలో తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ ఆదిత్య పురీ, ఉత్తరాఖండ్ సీఎం తివేంద్ర సింగ్ రావత్ దీన్ని ప్రారంభించారు. నగదు ఉప సంహరణ, నిల్వ, ఇన్‌స్టంట్ లోన్స్, వినియోగ బిల్లుల చెల్లింపులు వంటి 15 రకాల సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో, 24 గంటలూ ఇది పనిచేస్తుందని, రోజుకు సుమారు 35 వేల మంది భక్తులు దీన్ని వినియోగించుకుంటారని పేర్కొన్నారు. కేదార్ నాథ్ ఆలయానికి 24 కి.మీ. పరిధిలో ఇదే ఏకైక ఏటీఎం. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో హెచ్‌డీఎఫ్‌సీకి 88 ఏటీఎంలున్నాయి.

# పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ లాభం 72% డౌన్

**న్యూఢిల్లీ:** పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ జూన్ క్వార్టర్ ఫలితాల విషయంలో నిరాశపరిచింది. సంస్థ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు ఏకంగా 72 శాతం కుంగి రూ.15.64 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.56 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం మాత్రం రూ.325 కోట్ల నుంచి రూ.352 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 2.76 శాతంగా నమోదైంది. విద్యుత్ రంగానికి ప్రధానంగా ఈ సంస్థ రుణాలను సమకూరుస్తోంది. జూన్ క్వార్టర్‌లో రూ.63 కోట్ల ప్రొవిజనింగ్ చేయాల్సి వచ్చినట్టు సంస్థ తెలిపింది. రూ.717 కోట్ల తాజా రుణాలను మంజూరు చేయగా, ఇందులో రూ.457కోట్లు పంపిణీ చేసినట్టు వెల్లడించింది. ఫలితాల ప్రభావం స్టాక్‌పై చూపించింది. బీఎస్ఈలో 9 శాతం నష్టంతో పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ రూ.12.32 వద్ద క్లోజయింది.

- రుణాల ముందస్తు చెల్లింపులకు సంబంధించి వ్యక్తిగత రుణ గ్రహీతలపై నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఎటువంటి (ఫోర్‌క్లోజర్) చార్జీలూ విధించడానికి వీలులేదు. ఈ మేరకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం అమలు ఎప్పటినుంచో తెలియాల్సి ఉంది.

# యూనియన్ బ్యాంకు లాభంలో భారీ వృద్ధి

**రూ.224 కోట్లుగా నమోదు**




**న్యూఢిల్లీ:** యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాండలోన్ లాభం జూన్ క్వార్టర్‌లో 73 శాతం పెరిగి రూ.224 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.129 కోట్లుగానే ఉంది. ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో రూ.3,369 కోట్ల నష్టాలతో చూసినా మెరుగుపడినట్టు తెలుస్తోంది. ఇక ఆదాయం మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.9,908 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.9,887 కోట్లకు పరిమితం అయింది. కన్సాలిడేటెడ్ లాభం రూ.140 కోట్ల నుంచి రూ.230 కోట్లకు, కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.10,042 కోట్ల నుంచి రూ.10,053 కోట్లకు పెరిగాయి. ఆస్తుల నాణ్యత కాస్త మెరుగైంది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) మొత్తం రుణాల్లో 16 శాతం నుంచి 15.18 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 8.7 శాతం నుంచి 7.23 శాతానికి క్షీణించాయి. విలువ పరంగా చూస్తే స్థూల ఎన్‌పీఏలు రూ.48,841 కోట్లు, నికర ఎన్‌పీఏలు రూ.21,230 కోట్లుగాను ఉన్నాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.1,803 కోట్ల నుంచి రూ.1,431 కోట్లకు తగ్గాయి.

# ఇంధన కంపెనీలకు నిధుల సమస్య లేదు

- విదేశీ ఇన్వెస్టర్లకు ఆకర్షణీయం గానే భారత ఇంధనరంగం
- పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** ఇంధన కంపెనీలు నిధుల సమీకరణ పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవడం లేదని పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. కొన్ని సార్వభౌమ ఫండ్స్, నార్వే పెన్షన్ ఫండ్ శిలాజ ఇంధన ఆధారిత ప్రాజెక్టుల్లో ఇన్వెస్ట్ చేయరాదని నిర్ణయించుకున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యం నెలకొంది. ''అక్కడ ఎటువంటి సవాళ్లు లేవు. పెన్షన్ ఫండ్స్ ఇతరులు ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తితోనే ఉన్నారు'' అని శుక్రవారం బీఎన్ఈఎఫ్ సదస్సుకు హాజరైన సందర్భంగా మంత్రి ప్రకటన చేశారు. ఇంధన కంపెనీలు ముఖ్యంగా విదేశీ మార్కెట్ల నుంచి నిధులు సమీకరించుకునే విషయంలో ఏవైనా సవాళ్లను ఎదుర్కొంటున్నాయా? అన్న ప్రశ్నకు మంత్రి స్పందించారు. ''భారత ఇంధన రంగం విదేశీ ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా ఉంది. సార్వభౌమ వెల్త్‌ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, పశ్చిమ దేశాలు, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల దీర్ఘకాలిక వ్యూహాత్మక ఇన్వెస్టర్ల నుంచి ఈ రంగం నిధులను పొందుతూనే ఉంది'' అని మంత్రి ప్రధాన్ స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థ 7 శాతం రేటుతో వృద్ధి చెందుతోందని, ఇది మరిన్ని నిధులను ఆకర్షించగలదన్నారు. చాలా కంపెనీలు విదేశీ బాండ్ మార్కెట్ ద్వారా నిధులను సమీకరించాయని, రానున్న కాలంలోనూ ఈ మార్గంలో నిధుల సమీకరణ మరింత పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎనిమిదేళ్ల కాలంలో గ్యాస్ మౌలిక సదుపాయాల రంగంలోకి 75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు.

### ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 375.45 | 371.1 |
| ASIAN PAINT | 1545.2 | 1504.7 |
| AXIS BANK L | 673.85 | 669.3 |
| BAJAJ AUTO | 2600.55 | 2537.65 |
| BAJAJ FINSE | 7063.7 | 7082 |
| BAJAJ FINAN | 3237.9 | 3222.1 |
| BHARTI AIRT | 343.55 | 323.9 |
| BPCL | 342.45 | 343.65 |
| BRITANNIA | 2594.4 | 2600.9 |
| CIPLA LTD | 516.1 | 512.45 |
| COAL INDIA | 197.2 | 202.45 |
| EICHER MOTO | 16905 | 16562.8 |
| GAIL (INDIA) | 127.65 | 128.6 |
| GRASIM INDU | 778 | 774.55 |
| HCL TECHNOL | 1010.5 | 1021.55 |
| HDFC LTD | 2124.8 | 2086.8 |
| HDFC BANK L | 2214.35 | 2221.8 |
| HERO MOTOCO | 2401.95 | 2368.55 |
| HINDALCO | 180.4 | 182.75 |
| HUL | 1737.45 | 1731.3 |
| INDIABULLS | 489.65 | 521.95 |
| ICICI BANK | 410.6 | 417.05 |
| INDUSIND BA | 1382.9 | 1398.65 |
| BHARTI INFR | 251.4 | 250.95 |
| INFOSYS LIM | 775.6 | 768.85 |
| INDIAN OIL | 135.25 | 136.95 |
| ITC LTD | 264.5 | 267.55 |
| JSW STEEL L | 225.15 | 225.25 |
| KOTAK MAHIN | 1507.6 | 1495.8 |
| LARSEN & T | 1370.25 | 1358.05 |
| MAHINDRA &M | 556.45 | 548.55 |
| MARUTI SUZU | 5689.35 | 5572.6 |
| NTPC LTD | 123.1 | 126.85 |
| ONGC | 134.35 | 136.9 |
| POWER GRID | 210.55 | 214 |
| RIL | 1184.35 | 1180.25 |
| SBI | 308.45 | 317.15 |
| SUN PHARMAC | 420.65 | 425.1 |
| TATA MOTORS | 130.7 | 129.55 |
| TATA STEEL | 409.1 | 420 |
| TATA CONSUL | 2205.3 | 2180.05 |
| TECH MAHIND | 636.15 | 625.65 |
| TITAN COMPA | 1064.7 | 1057.3 |
| ULTRATECH C | 4299.05 | 4231.7 |
| UPL LIMITED | 573.5 | 576.8 |
| VEDANTA LIM | 143 | 145.45 |
| WIPRO LTD | 263.65 | 270.4 |
| YES BANK LI | 88.3 | 88.4 |
| ZEE ENTERTA | 341.5 | 346.85 |
| **నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ** | | |
| ABB INDIA L | 1367.8 | 1352.65 |
| ACC LIMITED | 1517.45 | 1515.3 |
| AMBUJA CEME | 199.5 | 196.8 |
| ASHOK LEYLA | 64.4 | 68.85 |
| BAJAJ HOLDI | 3511.65 | 3354.25 |
| BANDHAN BAN | 464.9 | 480.25 |
| BANK OF BAR | 104.9 | 105.55 |
| BHEL | 56.5 | 57.55 |
| BIOCON LIMI | 231.25 | 223.55 |
| BOSCH LIMIT | 14785.95 | 14643.1 |
| CADILA HEAL | 225.3 | 226.3 |
| COLGATE PAL | 1181.2 | 1183.1 |
| CONTAINER C | 503.7 | 515.45 |
| DABUR INDIA | 426.5 | 425.4 |
| DLF LIMITED | 171.8 | 172.4 |
| AVENUE SUPE | 1514.2 | 1483.6 |
| GENERAL INS | 193.8 | 186.5 |
| GODREJ CONS | 611.75 | 603.55 |
| HAVELLS IND | 646.1 | 647.75 |
| HDFC AMC LI | 2153.05 | 2136.4 |
| HDFC LIFE I | 494.35 | 487.95 |
| HINDUSTAN P | 253.4 | 263.4 |
| HINDUSTAN Z | 211.6 | 211.5 |
| ICICI LOMBA | 1168.4 | 1151.45 |
| ICICI PRU L | 398.9 | 390.3 |
| VODAFONE ID | 6.35 | 6.65 |
| INTERGLOBE | 1507.65 | 1551.6 |
| L&T FINANCE | 95.25 | 96.2 |
| LUPIN LIMIT | 767.3 | 759.05 |
| MARICO LIMI | 372.65 | 362.6 |
| UNITED SPIR | 582.9 | 575.5 |
| MOTHERSON S | 103 | 105.4 |
| MRF LTD | 53869.55 | 53355.6 |
| NHPC LTD | 21.65 | 21.8 |
| THE NEW IND | 120.35 | 111.6 |
| NMDC LTD. | 105.5 | 108.65 |
| ORACLE FIN | 3305.85 | 3261.95 |
| PAGE INDUST | 18623.65 | 18435.55 |
| PIRAMAL ENT | 1748.4 | 1765.4 |
| PETRONET LN | 235.5 | 235.7 |
| P&G HYGIENE | 10715.35 | 10749.55 |
| PIDILITE IN | 1256.7 | 1211.4 |
| STEEL AUTHO | 40.9 | 42.1 |
| SBI LIFE IN | 791.65 | 777 |
| SHREE CEMEN | 20001.2 | 20001.75 |
| SIEMENS LTD | 1115.05 | 1119.5 |
| SHRIRAM TRA | 978.45 | 967.35 |
| UNITED BREW | 1411.7 | 1402.6 |

# నెస్లే ఇండియా ఆకర్షణీయ ఫలితాలు




**న్యూఢిల్లీ:** నెస్లే ఇండియా జూన్ త్రైమాసికానికి సంబంధించి ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించింది. కంపెనీ లాభం 11 శాతం పెరిగి రూ.438 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.395 కోట్లుగా ఉంది. ఇక అమ్మకాల ఆదాయం కూడా 11.35 శాతం పెరిగి రూ.2,983 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.2,678 కోట్లుగా ఉండడం గమనార్హం. కంపెనీ వ్యయాలు సైతం రూ.2,163 కోట్ల నుంచి రూ.2,414 కోట్లకు పెరిగాయి. దేశీయ అమ్మకాల ఆదాయం సైతం 13 శాతం పెరిగి రూ.2,507 కోట్ల నుంచి రూ.2,835 కోట్లకు చేరింది. ''వరుసగా పది త్రైమాసికాల్లో అమ్మకాల, లాభాల మిశ్రమ వృద్ధిని కొనసాగించాం. ఉద్యోగులు, భాగస్వాములు, ఇతర వాటాదారుల అవిశ్రాంత కృషి వల్లే ఇది సాధ్యమైంది. దీనికి తోడు వినియోగదారుల అన్వేషణ, సైన్స్ ఆధారిత ఆవిష్కరణలు, నవ్యత ఇందుకు తోడ్పడ్డాయి'' అని నెస్లే ఇండియా చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు.

# గోద్రేజ్ ఆగ్రోవెట్ లాభం రూ.78 కోట్లు




**న్యూఢిల్లీ:** గోద్రేజ్ ఆగ్రోవెట్ కన్సాలిడేటెడ్ లాభం జూన్ త్రైమాసికంలో 4 శాతం తగ్గి రూ.77.6 కోట్లకు పరిమితమైంది. ఆదాయం మాత్రం రూ.1,712 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.81 కోట్లు, ఆదాయం రూ.1,488 కోట్లుగా ఉన్నాయి. పశుదాణా, పంటల రక్షణ, పామాయిల్, డెయిరీ, పౌల్ట్రీ ఉత్పత్తుల్లో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. జూన్ త్రైమాసికం ఫలితాల్లో గోద్రేజ్ టైసన్ ఫుడ్స్, గోద్రేజ్ మ్యాక్సిమిల్క్ ఫలితాలు కూడా కలిసి ఉన్నట్టు కంపెనీ తెలిపింది. ఈ రెండూ సంస్థ అనుబంధ కంపెనీలుగా మారాయని, కనుక ఫలితాలను క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూడలేమని పేర్కొంది.

# పవర్‌గ్రిడ్‌కు రూ.2,502 కోట్ల లాభం



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.2,502 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని నమోదు చేసింది. ఆదాయం రూ.9,361 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.8,376 కోట్ల ఆదాయంపై రూ.2,277 కోట్ల లాభాన్ని పొందడం గమనార్హం. విద్యుత్ సరఫరా ద్వారా ఆదాయం రూ.8,058 కోట్ల నుంచి రూ.9,043 కోట్లకు పెరిగింది. టెలికం విభాగం ఆదాయం కూడా రూ.191 కోట్ల నుంచి రూ.194 కోట్లకు వృద్ధి చెందింది. కన్సల్టెన్సీ విభాగం ఆదాయాలు మాత్రం రూ.152 కోట్ల నుంచి రూ.126 కోట్లకు తగ్గాయి.

# ఎక్సైడ్ లాభంలో స్వల్ప వృద్ధి




**కోల్‌కతా:** బ్యాటరీ తయారీ సంస్థ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ స్టాండలోన్ లాభం జూన్ త్రైమాసికంలో 7 శాతం వృద్ధితో రూ.224 కోట్లుగా నమోదైంది. టర్నోవర్ రూ.2,779 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.209 కోట్లు, టర్నోవర్ రూ.2,772 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆటోమోటివ్ బ్యాటరీల డిమాండ్ ఇప్పటికీ ఒత్తిళ్లలోనే ఉందని, యూపీఎస్, టెలికం బ్యాటరీల్లో మాత్రం వృద్ధి ఉన్నట్టు ఎక్సైడ్ ఎండీ, సీఈవో చటర్జీ పేర్కొన్నారు.

# నిరాశపరిచిన ఐనాక్స్ లీజర్




**న్యూఢిల్లీ:** మల్టీప్లెక్స్ ఆపరేటర్ ఐనాక్స్ లీజర్ లాభం జూన్ త్రైమాసికంలో 27 శాతం మేర తగ్గిపోయింది. కేవలం రూ.27 కోట్ల లాభాన్ని సంస్థ ఆర్జించింది. ఆదాయం మాత్రం 18.75 శాతం పెరిగి రూ.496 కోట్లుగా నమోదైనంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.37 కోట్లు, ఆదాయం రూ.417 కోట్లుగా ఉన్నాయి. వ్యయాలు గణనీయంగా పెరిగి రూ.361 కోట్ల నుంచి రూ.454 కోట్లకు చేరాయి. దేశవ్యాప్తంగా 67 పట్టణాల్లో ఐనాక్స్ లీజర్ 595 స్క్రీన్లను నిర్వహిస్తోంది.

# బీఈఎంఎల్‌కు రూ.98 కోట్ల లాభం

**న్యూఢిల్లీ:** బీఈఎంఎల్ జూన్ త్రైమాసికానికి రూ.98 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.162 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.458 కోట్ల నుంచి రూ.589 కోట్లకు వృద్ధి చెందింది. రక్షణ, విద్యుత్, మైనింగ్ తదితర రంగాలకు బీఈఎంఎల్ ఉత్పత్తులను అందిస్తోంది.

# 9 శాతం తగ్గిన లారస్ లాభం

జూన్ త్రైమాసికంలో ఔషధ కంపెనీ లారస్ ల్యాబొరేటరీస్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 9 శాతం తగ్గి రూ.15.1 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.539 కోట్ల నుంచి రూ.550 కోట్లుగా ఉంది.

# బీఎస్ఈ లాభం 20 శాతం డౌన్




**న్యూఢిల్లీ:** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 20 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ.52 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.41 కోట్లకు తగ్గిందని బీఎస్ఈ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.164 కోటల నుంచి రూ.166 కోట్లకు పెరిగిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.109 కోట్ల నుంచి రూ.119 కోట్లకు పెరిగాయని వెల్లడించింది. స్టాండ్అలోన్ పరంగా చూస్తే, నికర లాభం రూ.52 కోట్ల నుంచి రూ.34 కోట్లకు తగ్గిందని బీఎస్ఈ తెలిపింది. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేర్‌ను రూ.680 ధరకు టెండర్ ఆఫర్ మార్గంలో బైబ్యాక్ చేయనున్నామని బీఎస్ఈ తెలిపింది. 13.06 శాతం వాటాకు సమానమైన మొత్తం 67.65 లక్షల షేర్లను బైబ్యాక్ చేయనున్నామని, దీని కోసం రూ.460 కోట్లు వెచ్చించనున్నామని బీఎస్ఈ సీఈఓ అశీష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. నికర లాభం 20 శాతం తగ్గడంతో ఎన్ఎస్ఈలో బీఎస్ఈ షేర్ 4 శాతం నష్టంతో రూ.475 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.475ను తాకింది.

# మైండ్‌ట్రీ సీఈఓగా డెబాషిస్ ఛటర్జీ



**న్యూఢిల్లీ:** ఐటీ సర్వీసుల సంస్థ మైండ్‌ట్రీ ఎండీ, సీఈఓగా డెబాషిస్ ఛటర్జీ నియమితులయ్యారు. గతంలో ఈయన కాగ్నిజెంట్ సంస్థలో గ్లోబల్ డెలివరీ అండ్ గ్లోబల్ లీడర్ ఫర్ డిజిటల్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ ప్రాక్టీస్ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. ఇక నాన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా ఎల్ అండ్ టీ సీఈఓ, ఎండీ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ నియమితులైయ్యారు.

# ‘జుట్టు’కో బ్యాంక్

హెయిర్ బ్యాంకు.. ఈ బ్యాంకు పేరెప్పుడూ విన లేదు కదూ.. మామూలు బ్యాంకులేం చేస్తాయి.. మా దగ్గర మీ డబ్బులు దాచుకోండి.. భవిష్యత్తులో అవి ఎన్నో రెట్లు పెరిగి మీకు ఉపయోగపడతాయి అంటాయి.. అంతేగా.. ఈ హెయిర్ బ్యాంకు కూడా డిటోనే. కాకపోతే.. మామూలు బ్యాంకుల్లో డబ్బులు దాస్తాం.. ఇక్కడ మన జుట్టు దాస్తాం.. అంతే.. తేడా..

– సాక్షి, సెంట్రల్ డెస్క్


డాక్టర్ ఫర్జో




తొలుత తలపై ఉన్న దాదాపు 100 హెయిర్ ఫాలికిల్స్‌ను తీసుకుంటారు.


హెయిర్ ఫాలికిల్స్ (డెర్మల్ పాపిల్లా కణాలు) ను మైనస్ 180 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద క్రయోప్రిజర్వేషన్ పద్ధతి ద్వారా భద్రపరుస్తారు.


డెర్మల్ పాపిల్లా కణాలు క్లోనింగ్ ప్రక్రియ ద్వారా రెట్టింపు అవుతూ.. కావాల్సినన్ని వెంట్రుకలు పెరిగేందుకు దోహదపడతాయి.


వెంట్రుకలు ఊడిపోయినా, బట్టతల వచ్చినా తలపై ఉన్న చర్మంలోకి డెర్మల్ పాపిల్లా కణాలను ఎక్కిస్తారు.

## ఇంతకీ ఎందుకు?

ఎందుకేంటి.. ఈ ప్రపంచంలో ధనిక, పేదా తేడా లేకుండా దిగులుతో తల్లడిల్లిపోయే సమస్య ఒకే ఒక్కటి.. అదే.. బట్టతల.. నిజానికి వెంట్రుకలు ఏర్పడేందుకు హెయిర్ ఫాలికిల్స్ కింది భాగంలో ఉండే డెర్మల్ పాపిల్లా అనే కణాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇది చర్మంలోని భాగం. వయసు పెరుగుతున్న కొద్దీ హెయిర్ ఫాలికిల్స్.. ఈ డెర్మల్ పాపిల్లా కణాల నుంచి వేరుపడుతాయి. దీంతో ఫాలికిల్ చిన్నగా అయిపోవడంతో వెంట్రుకలు చిన్నగా అయిపోవడం.. ఎదుగుదల లేకపోవడం జరుగుతుంటుంది. అంటే వెంట్రుకల ఎదుగుదలలో ఈ డెర్మల్ పాపిల్లా కణాలు చాలా ముఖ్య పాత్ర పోషిస్తాయన్న విషయం అర్థమైంది కదా.. సరిగ్గా ఇక్కడే పరిశోధకులు దృష్టి సారించి పరిశోధనలు సాగించారు. హెయిర్ బ్యాంకుగా పేర్కొంటున్న ఈ ప్రక్రియకు బ్రిటన్ అధికారులు తాజాగా అనుమతులిచ్చారు.

## ఇక్కడేం చేస్తారు..

ముందుగా ఎవరైనా వ్యక్తికి చెందిన డెర్మల్ పాపిల్లా కణాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే.. దాదాపు 100 కణాలను తీసుకుని బ్యాంకులో భద్రపరుస్తారు. ఈ కణాలు పాడవకుండా ఉండేందుకు ‘క్రయోప్రిజర్వ్’పద్ధతి ద్వారా దాదాపు మైనస్ 180 సెల్సియస్ డిగ్రీ ఉష్ణోగ్రత వద్ద ఎంత కాలం అంటే అంత కాలం దాచి ఉంచుతారు. కణాలను వేరే చేసే ప్రక్రియకే దాదాపు రూ.1.8 లక్షలు వసూలు చేయనున్నారు. ఆ తర్వాత భద్రపరిచినందుకు ఏటా దాదాపు రూ.9 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దాచి ఉంచినందుకు దాదాపు రూ.1.8 లక్షలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఆ వ్యక్తికి ఎప్పుడైనా భవిష్యత్తులో వెంట్రుకలు ఊడిపోతున్నా.. బట్టతల వచ్చినా ఆ బ్యాంకుకు వెళ్తే చాలు సమస్య పరిష్కారం అయినట్లే. ఎందుకంటే ఒక్క డీపీ కణం నుంచి చాలా చాలా డీపీ కణాలను క్లోనింగ్ ప్రక్రియ ద్వారా అభివృద్ధిపరచవచ్చు. ఇలా క్లోనింగ్ ద్వారా ఏర్పడిన కణాలను తలమీది చర్మంలోకి ఇంజెక్షన్ ద్వారా ఎక్కిస్తారు. అప్పుడు ఆ కణాల నుంచి హెయిర్ ఫాలికిల్స్ ఏర్పడి.. వాటి నుంచి ఒత్తయిన జుట్టు పెరుగుతుంది. 18 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరికి ఈ కణాలను దాచిపెట్టుకునే అవకాశం ఉంటుంది. యుక్త వయసు రాగానే ఈ కణాలను బ్యాంకులో దాచిపెట్టుకుంటే మరీ మంచిదని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న డాక్టర్ ఫర్జో వివరించారు. ఈ వెంట్రుకల బ్యాంకు కాన్సెప్ట్‌ను అమలు చేసేందుకు బ్రిటన్ హ్యూమన్ టిష్యూ అథారిటీ.. హెయిర్ క్లోన్ అనే బయోటెక్నాలజీ కంపెనీకి తాజాగా అనుమతులిచ్చింది.



## పాతవాటికి కొత్తదానికి తేడా??

బట్ట తల వచ్చినప్పుడు.. ప్యాచ్ సిస్టమ్ లేదా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (పీఆర్‌పీ)చేయించుకుంటారు. మొదటి విధానంలో వెంట్రుకలను తలపై భాగంలో అతికిస్తారు. రెండో విధానంలో మాత్రం మన రక్తాన్ని తీసుకుని సెంట్రిఫ్యూజ్ చేసి ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మాను వేరేచేస్తారు. దీన్ని వెంట్రుకలు ఎదగాల్సిన చోట ఇంజెక్షన్ ద్వారా ఎక్కిస్తారు. కానీ హెయిర్ బ్యాంకు ప్రక్రియ ద్వారా నేరుగా ఆరోగ్యవంతమైన మన డెర్మల్ పాపిల్లా కణాలను ఉపయోగించి, సహజసిద్ధంగా వెంట్రుకలు పెరిగేలా చేయొచ్చు. ఈ విధానంలోని వెంట్రుకలు ఉన్న చోట కొంత చర్మాన్ని ముందుగా తీసుకుంటారు తర్వాత అందులోని హెయిర్ ఫాలికిల్స్‌ను తీసుకుని, అందులో ఉన్న డెర్మల్ పాపిల్లాను వేరే చేస్తారు. ఆ పాపిల్లా కణాలను చాలా తక్కువ ఉష్ణోగ్రత వద్ద భద్రపరుస్తారు. అయితే ఈ విధానం వల్ల సైడ్ ఎఫెక్టులు తక్కువగా ఉండటమే కాకుండా.. వెంట్రుకలు పెరుగుతాయనేందుకు గ్యారంటీ కూడా ఉంటుందట.

# అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి

- గ్రూప్–1 సర్వీస్ అధికారులకు గవర్నర్ ఉద్బోధ
- విధి నిర్వహణలో ప్రజలతో మమేకమవ్వాలని సూచన
- రాష్ట్రాభివృద్ధికి పూర్తి శక్తి సామర్థ్యాలతో కృషిచేయాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పును తీసుకొచ్చేందుకు గ్రూపు–1 అధికారులు అన్నివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సూచించారు. ప్రజల సమస్యలు, బాధలను అర్థం చేసుకోవడానికి అధికారులు కృషి చేయాలని.. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలను కనుగొనడంలో సానుభూతిని ప్రదర్శించాలన్నారు. బంగారు తెలంగాణ సాధనకు ఇది అత్యావశ్యకమని చెప్పారు. శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర గ్రూపు–1 సర్వీసు అధికారుల ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాధికారులు ప్రజానుకూలంగా ఉండరనే భావన సమాజంలో ఉందని.. దానిని దూరం చేసేందుకు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలతో మరింత మమేకమై పని చేయాలని సూచించారు.

### అన్ని వర్గాలకు సేవ చేయాలి..

బలమైన సామాజిక మాధ్యమాలు, శక్తిమంతమైన పౌర సమాజం, జాగరూకతతో కూడిన ప్రజలున్న ప్రస్తుత పారదర్శక ప్రపంచంలో వ్యక్తిగత సామర్థ్యం, నిబద్ధత, ఇతర అంశాలు మరింత మెరుగుపర్చుకోవడం ద్వారా ప్రజానుకూల అధికారులుగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా బడుగులు, పేదలకు సేవ చేయడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకర్వణ ప్రక్రియ కారణంగా ప్రభుత్వాధికారులు ప్రజలతో మరింత మమేకమై స్నేహపూర్వకంగా ఎదిగేందుకు కావాల్సిన అరుదైన అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు.

### విధులకే పరిమితమవ్వొద్దు..

అధికారులు కేవలం తమ విధులకే పరిమితం కాకూడదని గవర్నర్ చెప్పారు. రాష్ట్రం బహుముఖంగా అభివృద్ధి చెందేందుకు అధికారులు తమ పూర్తి శక్తి సామర్థ్యాలను ఉపయోగించాలన్నారు. స్వాగతోపన్యాసం చేసిన ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ బీపీ ఆచార్య మాట్లాడుతూ కొత్తగా గ్రూప్–1 సర్వీసుల్లో చేరిన అధికారులు రాష్ట్రాభివృద్ధికి తమను తాము పునరంకితం చేసుకునేలా ఫౌండేషన్ కోర్సును నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు గవర్నర్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ నూకల ఉదయ్‌రెడ్డికి, రాతపరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన డీపీవో పేరిక జయసుధకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. అలాగే యువ అధికారుల హౌస్ జర్నల్ సొసైటీ రూపొందించిన ‘సవ్వడి’జర్నల్‌ను, ఐఏఎస్ అధికారిణి రజనీ శేఖరీ సిబాల్ రచించిన ‘ఫ్రాగ్రెంట్ వర్డ్స్’పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ షేక్ మహ్మద్ నబీ, కోర్సు కోఆర్డినేట్ డా.రావులపాటి మాధవి, హెచ్‌ఆర్‌డీ అదనపు డైరెక్టర్ జనరల్ జూసాని వెంకటేశ్వరరావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


ఉదయ్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న గవర్నర్ నరసింహన్, బీపీ ఆచార్య తదితరులు



విజయవంతంగా చంద్రయాన్‌–2

# కక్ష్య దూరం పెంపు

- మిషన్.. ఆరోగ్యకరమైన ప్రయాణం సాగిస్తోంది
- ఇస్రో శాస్త్రవేత్తల ప్రకటన

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ కేంద్రం నుంచి గత నెల 22న ప్రయోగించిన చంద్రయాన్–2 మిషన్‌కు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 3.27 గంటలకు ఆర్బిటర్‌లోని ఇంధనాన్ని 646 సెకండ్ల పాటు మండించి నాలుగోసారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. చంద్రయాన్–2 మిషన్ రోదసీలో ఆరోగ్యకరంగా ప్రయాణిస్తోందని ఇస్రో శాస్త్రవేత్తలు అధికారికంగా వెల్లడించారు. బెంగళూరు సమీపంలో బైలాలులో ఉన్న భూనియంత్రిత కేంద్రం నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్–2 మిషన్‌లోని ఆర్బిటర్‌లో నింపిన ఇంధన సాయంతో కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను నాలుగోసారి కూడా విజయవంతంగా నిర్వహించారు. జీఎస్ఎల్‌వీ మార్క్3–ఎం1 ఉపగ్రహ వాహకనౌక ద్వారా చంద్రయాన్–2 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 45,475 కిలోమీటర్ల ఎత్తులో భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కక్ష్య దూరాన్ని పెంచడంలో భాగంగా గత నెల 24న మొదటి విడతలో భూమికి దగ్గరగా ఉన్న 170 కిలోమీటర్ల ఎత్తును 230 కిలోమీటర్లకు, 26న రెండోసారి భూమికి దూరంగా 45,475 కిలోమీటర్లుగా ఉన్న కక్ష్య దూరాన్ని 54,829 కిలోమీటర్లకు, 29న చేపట్టిన ఆపరేషన్‌లో మూడోసారి భూమికి దగ్గర్లో ఉన్న 230 కిలోమీటర్ల దూరాన్ని 270 కిలోమీటర్లకు, దూరంగా ఉన్న 54,829 కిలోమీటర్ల దూరాన్ని 71,792 కిలోమీటర్లకు ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా పెంచిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం నాలుగోసారి భూమికి దగ్గరగా ఉన్న 270 కిలోమీటర్ల దూరాన్ని.. 277 కిలోమీటర్లకు, భూమికి దూరంగా ఉన్న 71,792 కిలోమీటర్ల దూరాన్ని 89,472 కిలోమీటర్ల దూరానికి విజయవంతంగా పెంచారు. మళ్లీ ఈ నెల 6న ఐదోసారి కక్ష్యదూరం పెంచే ఆపరేషన్‌ను చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు. తర్వాత 14న చివరిగా చంద్రయాన్–2 మిషన్‌ను భూ మధ్యంతర కక్ష్య నుంచి ఒకేసారి చంద్రుడి కక్ష్యలోకి పంపే ప్రక్రియను కూడా చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# గందరగోళంగా హెరిటేజ్ యాక్ట్

- హైకోర్టులో వాదనలు
- ఎర్రమంజిల్ భవనం కేసు 5కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హెరిటేజ్ యాక్ట్ లోపభూయిష్టంగా, గందరగోళంగా ఉందని, చారిత్రక, వారసత్వ కట్టడాలకు మధ్య తేడా గురించి చట్టంలో స్పష్టత లేకపోవడం శోచనీయమని హైకోర్టులో హైదరాబాద్ జిందాబాద్ స్వచ్ఛంద సంస్థ తరపు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి వాదించారు. ఎర్రమంజిల్ భవన ప్రదేశంలో చట్టసభల భవన సముదాయాల్ని నిర్మించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేసిన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం ఎదుట శుక్రవారం కూడా వాదనలు కొనసాగాయి. హెరిటేజ్ యాక్ట్ అసంబద్ధంగా ఉందని, రాష్ట్రంలో హెరిటేజ్ కమిటీనే ఏర్పాటు చేయలేదని ఆయన అన్నారు. ఏదైనా భవనాన్ని జాబితా నుంచి తొలగించాలంటే కమిటీ ద్వారా జరగాలని, కమిటీనే ఏర్పాటు చేయని ప్రభుత్వం ఆ భవనాన్ని ఎలా తొలగిస్తుందని ప్రశ్నించారు. వారసత్వ, పురాతన భవనాల మధ్య తేడా తెలియకుండా చట్టం ఉందన్నారు. వారసత్వ కట్టడాల జాబితా, మాస్టర్ ప్లాన్ మార్చాలంటే కచ్చితమైన విధానం అవలంబించాలని, అవేమీ లేకుండా ఎర్రమంజిల్ భవనాన్ని జాబితా నుంచి 2015లో తొలగించామని ప్రభుత్వం చెప్పడం సరికాదని మరో న్యాయవాది రచనారెడ్డి వాదించారు. 2017లో రూపొందించిన వారసత్వ కట్టడాల పరిరక్షణ చట్టం ఎర్రమంజిల్ భవనానికి వర్తించదన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని భవనాల్ని గుర్తించి వాటి రక్షణ బాధ్యత తీసుకుంటామని కోరితే అందుకు రాష్ట్రం ఒప్పుకోలేదని ఆమె హైకోర్టు దృష్టికి తెచ్చారు. పలు హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవాలని వారు కోరారు. వాదనలు ఈ నెల 5వ తేదీకి వాయిదా పడ్డాయి.

# ఓలా అంటూ... ఇలా...!

- ఓలా క్యాబ్ అంటూ ప్రైవేటు కారులో ఎక్కించుకున్న డ్రైవర్
- వెంబడించి అడ్డుకున్న కుటుంబసభ్యులు

శంషాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం కిడ్నాప్ కలకలం రేగింది. అనుమతి లేకుండా ప్రయాణికులను ఎక్కించుకుని అనుమానాస్పదంగా వెళ్లిన కారును కుటుంబసభ్యులు వెంబడించి అడ్డుకున్నారు. ముంబైకి చెందిన శ్రీనాథ్, అతని కుటుంబసభ్యులు నగరంలో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని కలవడానికి ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. రెండు ఓలా క్యాబ్‌లను బుక్ చేసుకున్నారు. ముందుగా వచ్చిన ఓలా క్యాబ్‌లో శ్రీనాథ్, అతడి భార్య, మరొకరు కూర్చున్నారు. వీరి కుటుంబంలోని యువతితోపాటు బాలిక, బాలుడు మరో ఓలా క్యాబ్ కోసం బస్టాప్ వద్ద వేచి ఉన్నారు. అదేసమయంలో అక్కడికి వచ్చిన ఓ కారు డ్రైవర్.. ఓలా క్యాబ్ అని చెప్పి వారిని ఎక్కించుకున్నాడు. క్యాబ్ ముందుకెళుతున్న సమయంలో ఓటీపీ చెబుతానని యువతి అనడంతో అక్కర్లేదని క్యాబ్ డ్రైవర్ తిరస్కరించాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత కారులోకి అతడి స్నేహితుడు ఎక్కాడు. యువతి అనుమానించి కారును నెమ్మదిగా తీసుకెళ్లమని చెప్పినా డ్రైవర్ వినిపించుకోకుండా వేగం పెంచాడు. ఆమె వెంటనే కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి డ్రైవర్ తీరు అనుమానాస్పదంగా ఉందని అప్రమత్తం చేసింది. దీంతో వారు ఆ కారును వెంబడించి ఓవర్ టేక్ చేశారు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద కారును ఆపి యువతితోపాటు బాలిక, బాలుడిని అందులో నుంచి దించారు. అయితే, డ్రైవర్ పరార్ కాగా కారులో ఉన్న అతడి స్నేహితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు (ఆర్‌జీఐఏ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్‌నకు యత్నించిన కారు డ్రైవర్ రంగారెడ్డి జిల్లా కొత్తూరుకు చెందిన కిషన్ అని పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


శుక్రవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

# ‘ఎరువుల ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి’

సాక్షి, న్యూఢిల్లీ: రామగుండం ఎరువులు, రసాయనాల సంస్థ (ఆర్ఎఫ్‌సీఎల్)లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఆ సంస్థ సీఈవో నిర్లీప్‌సింగ్ రాయ్‌కు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విన్నవించారు. మంత్రి కొప్పుల, ఎంపీ వెంకటేష్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సీఈవోను శుక్రవారం కలిశారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ సంస్థ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా స్థానిక ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అక్కడి 400 కుటుంబాలకు పునరావాసం కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల స్థాపనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. స్థానికంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

### కేంద్ర మంత్రులతో భేటీ..

ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశామని మంత్రి కొప్పుల తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథావాలేను కలిసినట్టు వివరించారు. మేడారం సమ్మక్క–సారక్క జాతరకు రావాలని అర్జున్ ముండాను ఆహ్వానించినట్టు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని రమేశ్ పోఖ్రియాల్‌ను కోరామన్నారు.

## ఘనంగా ఎల్పీయూ ఆత్మీయ సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ) పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ విభాగం పూర్వ విద్యార్థుల 5వ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని లహరి రిసార్ట్స్‌లో జరిగిన ఈ సమ్మేళనానికి దేశవిదేశాల్లో స్థిరపడ్డ వర్సిటీ పూర్వవిద్యార్థులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం డిప్యూటీ డైరెక్టర్ గౌరవ్ గుప్తా వారిని అభినందించారు. సమ్మేళనంలో ఎల్పీయూ పూర్వ విద్యార్థుల సంఘం హైదరాబాద్–అహ్మదాబాద్ విభాగం అధ్యక్షుడిగా రాహుల్ బిసారియాను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. హాఫెల్ ఇండియాలో టెరిటరీ మేనేజర్‌గా పనిచేస్తున్న కపీశ్ చితాపురం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎల్పీయూ లో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడమనేది తమ సంస్థకు దక్కిన గౌరవమని సంస్థ చాన్స్‌లర్ అశోక్ మిట్టల్ అన్నారు.

# వచ్చేస్తోంది 3డి గుండె!

**సరికొత్త పద్ధతి ఆవిష్కారం**

**కార్నెగీ మెలన్ వర్సిటీ శాస్త్రవేత్తల ఘనత**

త్రీడీ ప్రింటింగ్... గోడ గడియారం మొదలుకొని జెట్ ఇంజిన్ విడిభాగాల వరకూ దేన్నైనా కళ్లముందు ఇట్టే తయారు చేసివ్వగల ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు ఇంకో ఘనతను సాధించింది. కార్నెగీ మెలన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని త్వరలోనే మనిషి గుండె కూడా ఈ పద్ధతిలో తయారు కానుంది! గుండెతోపాటు అనేక ఇతర అవయవాలకు ఆధారమైన కొలేజన్‌ను త్రీడీ టెక్నాలజీ ద్వారా ముద్రించేందుకు కార్నెగీ మెలన్ వర్సిటీ శాస్త్రవేత్తలు సరికొత్త పద్ధతిని ఆవిష్కరించారు. ఫలితంగా గుండెలోని భాగాలతోపాటు పూర్తిస్థాయిలో పనిచేసే గుండెను కూడా ముద్రించేందుకు వీలు ఏర్పడింది.



## ‘ఫ్రెష్’తో సాధ్యమైందిలా...

ఇల్లు కట్టేందుకు ఇటుకలు ఎంత అవసరమో.. కాంక్రీట్ స్తంభాలు కూడా అంతే అవసరం అన్నది మనకు తెలుసు. ఇటుకలు మన శరీర కణాలైతే.. ఆ కణాలన్నింటినీ ఒక ఆకారంలో పట్టి ఉంచేందుకు ఉపయోగపడే ఒక ప్రొటీన్... కొల్లాజెన్. ఇది జీవ రసాయన సమాచార ప్రసారానికి, తద్వారా కణాలు పనిచేసేందుకూ ఉపయోగపడుతుంది. ఈ ఎక్స్‌ట్రా సెల్యులార్ మ్యాట్రిక్స్ ప్రొటీన్ల మధ్య ఆయా కణాలు వృద్ధి చెందడం ద్వారా అవయవాలు తయారవుతాయన్నమాట. అత్యంత సంక్లిష్టమైన ఈ ప్రొటీన్ నిర్మాణానికి ఇప్పటివరకూ జరిగినవి విఫల ప్రయత్నాలే. ఫ్రీఫామ్ రివర్సిబుల్ ఎంబెడ్డింగ్ ఆఫ్ సస్పెండెడ్ హైడ్రోజెల్స్ (ఫ్రెష్) అనే సరికొత్త పద్ధతిని ఉపయోగించడం ద్వారా శాస్త్రవేత్తలు తాజాగా ఈ పరిమితులన్నింటినీ అధిగమించగలిగారు.

## లక్షల గుండెలు అవసరం...

ప్రపంచవ్యాప్తంగా గుండె మార్పిడి కోసం ఎదురు చూస్తున్న వారు లక్షల మంది ఉన్నట్లు అంచనా. అవయవ దాతల సంఖ్య తక్కువగా ఉన్న నేపథ్యంలో కృత్రిమ గుండె తయారీ అవసరం పెరుగతోంది. ఫ్రెష్ పద్ధతి ద్వారా కణాలు, కొల్లాజెన్ సాయంతో గుండె కవాటాలు, గుండె మాదిరిగా కొట్టుకునే జఠరికలను తయారు చేయొచ్చని శాస్త్రవేత్త ఆడమ్ ఫైన్‌బర్గ్ తెలిపారు. ఎమ్మారై స్కాన్ల ద్వారా రోగుల గుండె నిర్మాణ వివరాలు సేకరించి కృత్రిమ గుండెలను తయారు చేయొచ్చని చెప్పారు. కొల్లాజెన్ ద్రవ రూపంలో ఉండటం వల్ల దాన్ని త్రీడీ ప్రింటింగ్‌లో ఉపయోగించుకోవడం ఒక సవాలుగా మారిందని... ఉపయోగించిన వెంటనే ఆకారం మారిపోవడం దీనికి కారణమని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న మరో శాస్త్రవేత్త ఆండ్రూ హడ్సన్ చెప్పారు. ఫ్రెష్ పద్ధతిలో కొల్లాజెన్‌ను హైడ్రోజెల్ పదార్థంలో పొరలు పొరలుగా అమరుస్తామని ఫలితంగా కొంత సమయం తర్వాత గట్టిపడి తన ఆకారాన్ని నిలుపుకొనేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత హైడ్రోజెల్‌ను సులువుగా తొలగించొచ్చని చెప్పారు. మానవ అవయవాలను పెద్ద ఎత్తున తయారు చేసేందుకు ఈ కొల్లాజెన్ నిర్మాణాలు ఎంతో కీలకమన్నారు. కొలేజన్‌తోపాటు ఫిబ్రిన్, అల్గినైట్, హైలోరోనిక్ యాసిడ్ వంటి ఇతర పదార్థాలను ఫ్రెష్ పద్ధతిలో ఉపయోగించొచ్చు. అన్నింటి కంటే ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఈ పద్ధతికి సంబంధించిన వివరాలన్నీ అందరికీ అందుబాటులో ఉండటం. విద్యార్థులు మొదలుకొని శాస్త్రవేత్తల వరకూ ఎవరైనా ఈ రంగంలో ప్రయోగాలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పూర్తిస్థాయి కృత్రిమ అవయవాలు అందుబాటులోకి వచ్చేందుకు మరిన్ని పరిశోధనల అవసరముందని, ఇందుకు కొంత సమయం పట్టొచ్చని ఫైన్‌బర్గ్ చెప్పారు.







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792